Prajalakshyam Telugu Daily
# ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి
సంపుటి: 16 | సంచిక: 280 | కరీంనగర్ | శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## జూబ్లీహిల్స్ వెంకన్నకు పుష్పయాగం

**- రెండు టన్నుల పూలతో విశేష అలంకరణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 26 : హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పయాగ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యమైన పుష్పసుగంధాలతో, భక్తి పారవశ్య వాతావరణంలో పుష్పయాగ సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయంలో ఫిబ్రవరి 17 నుండి 25వ తేదీ వరకు జరిగిన వార్షిక బ్రహ్మోత్సవాలు

11 లో

## సిఎం రేవంత్‌లో హిమాచల్ మంత్రి భేటీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, ఫిబ్రవరి 26 : హిమాచల్ ప్రదేశ్ మంత్రి విక్రమాదిత్య సింగ్ హైదరాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. మంత్రిని సిఎం సాదరంగా స్వాగతించి సన్మానించారు.



## భారతీయ విద్యాభవన్ తరహా స్కూళ్ళు



**- మౌలిక వసతులతో పాటు... బ్రేక్‌ఫాస్ట్**
**- విజయ డెయిరీ ద్వారా అవసరమైన పాల సరఫరా**
**- రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం**
**- ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం వేసేలా చర్యలు**
**- విద్యారంగంపై సమీక్షలో సిఎం రేవంత్ కీలక ఆదేశాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 26 : కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ,

11 లో



## తెలంగాణాలో దుర్మార్గమైన ప్రభుత్వం

**● పేదల ఇళ్లు కూల్చిన దుర్మార్గులు**
**● ముగ్గురు మంత్రుల పన్నాగం ఇది**
**● అసెంబ్లీలో మీ పక్షాన పోరాడుతాం**
**● కోర్టుల్లో పైసా ఖర్చు లేకుండా నిలబడతాం**
**● వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన కెటిఆర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఫిబ్రవరి 26 : తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను కేటీఆర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వచ్చే నెల16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభ మవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగేవరకూ మీ పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని కేటీఆర్ భరోసా కల్పించారు. అందరూ

11 లో

### అభివృద్ధిని చూసి ఓర్వలేక

## విషం చిమ్ముతున్న బిఆర్ఎస్

**- కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కమిషన్ల కోసమే నిర్మాణం**
**- సిబిఐ విచారణ కోరినా పట్టించుకోని బిజెపి**
**- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి పొంగులేటి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




హైదరాబాద్,ఫిబ్రవరి26 : తెలంగాణ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాష్ట్ర అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్నారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. వరుస ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాజెక్టుల అవినీతిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే ఎనిమిదో అద్భుతంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం కమిషన్ల కోసమే కట్టారని పొంగులేటి ఆరోపించారు. 38 వేల కోట్లతో పూర్తి కావాల్సిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి, తమ రాచరికాన్ని చాటు కోవడం కోసం లక్షల కోట్లతో కాళేశ్వరం నిర్మించారు. తీరా చూస్తే ఎన్నికల ముందు ఆ ప్రాజెక్టు పేకమేడలా కూలిపోయిందని ఎద్దేవా చేశారు. గత నాలుగేళ్లలో 162 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే, అందులో 50 టీఎంసీలు తిరిగి సముద్రం పాలయ్యాయని

11 లో

### ప్రభుత్వ పథకాల

## అమలు బాధ్యత మీదే

**- శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులతో సిఎం రేవంత్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఫిబ్రవరి26 : తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ, ఆధిపత్యాన్ని సహించబోరని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి గ్రూప్ 1 పరీక్షలను నిర్వహించి.. నియామక పత్రాలు అందించామన్నారు. గ్రూప్ 1, 2 ఉద్యోగుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకున్నామని కోర్టుల్లో లీగల్ లిటిగేషన్ పెట్టారని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క తప్పు కూడా చేయలేదని అన్నారు. బాగా చదువుకున్న వాళ్లను టీజీపీఎస్సీలో నియమించాం. అన్ని జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించాం. మీరంతా శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగాల్లో చేరుతున్నారు. ప్రభుత్వం మిమ్మల్నే రాష్ట్ర ప్రతినిధులుగా భావిస్తోంది. మీ ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలవుతాయి. మేం ఎన్ని పాలసీలు చేసినా.. దాని అమల్లో

11 లో

### తెలంగాణలో భారీగా

## ఐఏఎస్‌ల బదిలీలు

**- మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు**
**- పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం**






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 26 : తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీ డీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. సాధారణ పరిపాలన శాఖ

11 లో

### రాష్ట్రంలో అభివృద్ధిపై

## వందరోజుల కార్యక్రమాలు

**- మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా కార్యాచరణ**
**- ప్రతీ శాఖ వందరోజుల కార్యాచరణపై ప్రణాళిక**
**- మార్చి 1న జిల్లా కలెక్టర్లతో సిఎం రేవంత్ సమావేశం**
**- అధికారుల సమావేశంలో సిఎస్ రామకృష్ణారావు ఆదేశం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 26 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తోపాటు రాష్ట్ర మంత్రులు ప్రజా ప్రతినిధులు పాల్గొనే ఈ వంద రోజుల కార్యక్రమంలో అన్ని శాఖల వారీగా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని సి.ఎస్ నిర్వహించారు. స్పెషల్ సి.ఎస్ లు జయేష్ రంజన్, వికాస్ రాజ్, సి.వీ ఆనంద్, సంజయ్ కుమార్, మహేష్ దత్ ఎక్కా, సబ్యసాచి ఘోష్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, అహ్మద్ నదీమ్, తదితరులు హాజరైన ఈ సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, ఈ వంద రోజుల కార్యక్రమంపై ఈ నెల 28వ తేదీన నిర్వహించే కార్యదర్శుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా మార్చ్ 1వ తేదీ ఆదివారం నాడు జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మార్చి 2వ తేదీ నుండి జూన్ 9 వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై ప్రతీ శాఖ తమ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని, జిల్లా కలెక్టర్ల సమావేశంలో

11 లో

## చిన్నారి మృతి కారకులను శిక్షించాలి

**- లేదంటే హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం**
**- మాజీమంత్రి తలసాని హెచ్చరిక**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 26 : కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి మృతికి కారణమైన వారిని శిక్షించాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ కేంద్రంలో కుమ్మెర బాధితుల పక్షాన చేపట్టిన దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా

11 లో

## విహెచ్, జెట్టిలకు రాజ్యసభ ఇవ్వాలి

**- ఆ ఇద్దరి సభ్యత్వాలపై ఆలోచన చేయాలని**
**- ఖర్గేను కలిసి కోరిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 : తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి ఇవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఖర్గేతో ఆయన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాలపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కూడా ఈ విషయంపై మాట్లాడానని, వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి రాజ్యసభ ఇవ్వాలని కోరానని అన్నారు. ఇదే విషయంపై రాహుల్ గాంధీని, మల్లికార్జున్ ఖర్గేని కలవడానికి ఢిల్లీకి వచ్చానని తెలిపారు. రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వి. హనుమంతరావు. జెట్టి కుసుమ కుమార్‌లకు రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరానని తెలిపారు. జెట్టి కుసుమ కుమార్.. యూత్ కాంగ్రెస్ లీడర్‌గా, స్టూడెంట్ లీడర్‌గా.. కమ్మ సామాజిక వర్గం నుంచి ఉన్నారని ప్రస్తావించారు. జెట్టి కుసుమ కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటెర్స్ అని, వాళ్ల

11 లో

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల ఫిబ్రవరి 26 : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్.టి.సి., విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని,హెూట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గోదావరి పుష్కరాల నేపథ్యంలో ప్రమాదాల నివారణల భాగంగా లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, రహదారులపై కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు,




జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కూరగాయల వ్యాపారులు రహదారులపై విక్రయాలు చేయకుండా ప్రత్యేక మార్కెట్ స్థలాన్ని గుర్తించి తగు ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. రహదారులపై వాహనాల వేగాని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు రద్దుహెూచేయాలని, వారి వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు. అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటుఎ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రోడ్డు ప్రమాదాల నివారణను 20 శాతం మేర తగ్గించేలా లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, జిల్లాలో హాట్ స్పాట్ లను గుర్తించడం జరిగిందని, నగర పరిధిలో వాహనాల వేగ నియంత్రణ చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు రూపొందించాలి

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఫిబ్రవరి 26 : గోదావరి నది పుష్కరాల నిర్వహణకు ఇప్పటినుంచే పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న గోదావరి పుష్కరాలు నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంను దర్శించుకోవడానికి, అలాగే గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ప్రాంతాల వారీగా పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని, పుణ్యస్నానాలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూడాలని ఆదేశించారు. భక్తులకు వసతి, త్రాగునీరు, శాశ్వత, మొబైల్ టాయిలెట్లు, లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలు సమకూర్చాలని పేర్కొన్నారు. పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని, జిల్లాలోని అన్ని పుష్కర ఘాట్ల వద్ద తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేపట్టిన పనులను సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించాలని తెలిపారు.



జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, పుష్కరాల సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, పటిష్ట నిఘా ఉంచుతామని వివరించారు. భక్తులు సౌకర్యవంతంగా పుణ్యస్నానాలు పూర్తి చేసుకునేలా పోలీసు శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీలు రాజేష్ మీనా, సాయికిరణ్, డిపివో శ్రీనివాస్, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, బాసర ఆలయ ఈవో విజయ రామారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు





# రెండు కోట్ల ఐదు లక్షల విలువైన గంజాయి స్వాధీనం

### - భారీ అక్రమ రవాణా గుట్టురట్టు చేసిన భద్రాద్రి పోలీసులు

### - వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఫిబ్రవరి 26 : భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి పోలీసులు, సీసీఎస్ పోలీసులతో కలిసి నిర్వహించిన వాహనాల తనిఖీల్లో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు చేపట్టగా ఒక ద్విచక్ర వాహనం, ఒక కంటైనర్ లారీని ఆపి పరిశీలించారు. కొత్తగూడెం వైపు నుంచి ఖమ్మం దిశగా వెళ్తున్న కంటైనర్ లారీని తనిఖీ చేయగా, కొబ్బరి పీచు బండిల్స్ మధ్యలో కవర్ చేసి ఉంచిన 16 బ్యాగుల్లో 408.185 కిలోల నిషేధిత గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రెండు కోట్ల ఐదు లక్షల రూపాయలుగా అంచనా వేయబడిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరుకు సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి, కొబ్బరి పీచు బండిల్స్ మధ్యలో లోడ్ చేసి కంటైనర్ ద్వారా అక్రమంగా తరలిస్తుండగా చుంచుపల్లి పోలీసులు పట్టుకున్నారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో గంజాయిని కొనుగోలు చేసినవారు, అమ్మినవారిపై కూడా కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ అక్రమ రవాణా కేసులో మహారాష్ట్రకు చెందిన సూర్యవంశీ సంతోష్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ మహమ్మద్ ఉమర్, అలాగే రవాణాకు సహకరించిన ఒరిస్సాకు చెందిన దేబ్రత చక్రవర్తి, నరత్తం రాయ్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వివరించారు. గంజాయితో పాటు కంటైనర్ లారీ, ఒక బైకు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 2025 జనవరి నుంచి ఇప్పటివరకు భద్రాద్రి జిల్లా పోలీసులు సుమారు 84 కేసుల్లో 33 కోట్ల 44 లక్షల రూపాయల విలువైన 6,688 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని ఎస్పీ పేర్కొన్నారు. గంజాయి కేసులతో సంబంధం ఉన్న ముగ్గురిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపామని, మరో ముగ్గురి ఆస్తులను జప్తు చేసినట్లు చెప్పారు. మరికొంతమందిపై పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు జాబితా సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ గంజాయి పట్టివేతలో కీలకంగా పనిచేసిన సీసీఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్సైలు ప్రవీణ్, రామారావు, చుంచుపల్లి ఎస్సైలు రవికుమార్, ఉమాతో పాటు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# భద్రాద్రి జిల్లా నూతన కలెక్టర్‌గా అంకిత్ బాధ్యతలు స్వీకరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి–కొత్తగూడెం, ఫిబ్రవరి 26 : భద్రాద్రి–కొత్తగూడెం జిల్లా నూతన జిల్లా కలెక్టర్‌గా అంకిత్ గురువారం సాయంత్రం 6:19 గంటలకు కలెక్టరేట్ ఐడీఓసి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో తొలి సంతకం చేసి అధికారికంగా విధినిర్వహణ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సదర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సిఎండిగా నియమితులైన, ఇప్పటి వరకూ కలెక్టర్ గా పని చేసి బదిలీ పై వెళ్తున్న జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. వేణుగోపాల్ నూతన కలెక్టర్ అంకిత్ కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది హాజరై నూతన కలెక్టర్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జితేష్ వి. పాటిల్ జిల్లా అధికారులను నూతన కలెక్టర్‌కు పరిచయం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా కలెక్టర్‌గా పని చేసే అవకాశం లభించడం తనకు గౌరవంగా, సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకత, ప్రజాహితం ప్రధాన లక్ష్యాలుగా



పెట్టుకుని సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ వేగవంతమైన సేవలందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పడం వంటి అంశాల్లో సమగ్రంగా ముందుకు సాగాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌కు భద్రాచలం పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం భక్తి వాతావరణంలో జరిగింది. జిల్లాకు తొలిసారిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్ ను ఇల్లందు క్రాస్ రోడ్‌లో గల సింగరేణి గెస్ట్ హౌస్ వద్ద కొత్తగూడెం ఆర్డీవో మధు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. తర్వాత కలెక్టర్ ఐడీఓసి కార్యాలయానికి చేరుకుని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

# కరీంనగర్ కొత్త కలెక్టర్‌గా చిత్రా మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కరీంనగర్, ఫిబ్రవరి 26: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా భారీగా ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా మొత్తం 45 మంది అధికారులకు స్థానచలనం కలిగింది. కాగా ప్రస్తుత కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బదిలీ అయ్యారు. ప్రభుత్వం ఆమెను కార్మిక శాఖ ప్రత్యేక కమీషనర్‌గా నియమించింది. ప్రస్తుతం ఏటూరునాగారం ఐటీడీఏ పీఓగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న చిత్రా మిశ్రా కరీంనగర్ జిల్లా కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.




# రాంప్ ద్వారా మహిళలకు నిర్మాణాత్మక వ్యాపార త్వరణ మద్దతు

## జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బానోత్ దత్తారావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26 : రాంప్ మహిళా త్వరణ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎం.ఎస్.ఎం.ఈ. లకు నిర్మాణాత్మక వ్యాపార త్వరణం మద్దతును అందించడం జరుగుతుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బానోత్ దత్తారావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గల సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో సెర్ప్ డి.పి.ఎం. నాన్ ఫామ్ నాగజ్యోతి, వీ హబ్ సంచాలకులు జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఉహా లతో కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళ వ్యవస్థాపకులకు ఐటిఈ–సి విభాగం, వీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు, భారత ఎంఎస్ఎమ్ఈ మంత్రిత్వ శాఖ మద్దతుతో రాంప్ ద్వారా మహిళల నేతృత్వంలోని సంస్థలు, ఎంఎస్ఎమ్ఈ నిర్మాణాత్మక వ్యాపార రంగాలలో మహిళలను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. 2 సంవత్సరాల ఈ కార్యక్రమం ఎంపిక చేసిన మహిళా వ్యవస్థాపకులకు వ్యాపారహెూహెూవృద్ధిని వేగవంతం చేసేందుకు, వారి ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు అవకాశంహెూహెూఅందిస్తుందని తెలిపారు. వస్త్రాలు, ఆహార ప్రాసెసింగ్, తయారీ, హస్త కళలు, ఇతర అభివృద్ధి చెందుతున్న రంగాలలోని సంస్థలు, వ్యాపార నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తి అభివృద్ధి,హెూహెూవైవిధ్యీకరణ, బ్రాండింగ్, మార్కెట్ ఆక్సెస్, క్రెడిట్ లింకేజ్ లకు నిపుణుల మార్గదర్శకత్వంలో మద్దతు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమం అనంతరం ఆసక్తి గల వారి నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సల్మాన్, అబిద్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

# 3 లక్షల 9 వేల రూపాయలను కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

## పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, ఫిబ్రవరి 26 : సైబర్ నేరగాళ్లు ఏదో ఒకచోట వలపన్నీ డబ్బులు దోచుకుంటున్నారు. గుట్టు చప్పుడు కాకుండా ఆధార్ కార్డు ,బ్యాంకు వివరాలను అత్యంత రహస్యంగా తెలుసుకొని క్షణాల వ్యవధిలో నగదును తస్కరిస్తున్నారు. ఇలాంటి సైబర్ మోసం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకోగా సదరు బాధితుడు డబ్బులు పోగొట్టుకొని లబోదిబో మంటున్నాడు. పూర్తి వివరాల్లోకి వెళితే.... ఆసిఫాబాద్ పట్టణానికి చెందిన విశాల్ పవర్ జిమ్ నిర్వాహకుడు ఖండ్రే విశాల్ అనే యువకుడి యూనియన్ బ్యాంక్ అకౌంట్ ఆసిఫాబాద్కు చెందిన ఖాతా నంబర్ 201012010000995ల నుండి అతని ప్రమేయం లేకుండా 3 లక్షల 9 వేల రూపాయలను సైబర్ కేటుగాళ్లు దండుకున్నారు. అదేవిధంగా స్థానిక హెచ్డిఎఫ్సి బ్యాంకు ఖాతా నెంబర్ 50100727010630 నుండి రూపాయలు 10000 లను తస్కరించారు. రెండు రోజుల క్రితం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఒక్క సారిగా ఫోన్ కు మెసేజ్ లు రావడంతో గమనించగా సైబర్ దుండగులు 500 రూపాయల నుండి 50,000 రూపాయల వరకు కొద్ది కొద్ది సేపటికి కొంత డబ్బును బ్యాంక్ ఖాతాల నుండి డ్రా అయ్యాయని,తనకు ఎలాంటి ప్రమేయం లేకుండా అకౌంట్ లో నుండి డబ్బులు పోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు...తాను ఎలాంటి లింకులను కూడా క్లిక్ చేయలేదని అయిన కూడా తన బ్యాంక్ అకౌంట్ నుండి సైబర్ కేటుగాళ్లు డబ్బులను దండుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. అధికారులు స్పందించి తగు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. రెండు ఖాతాల నుండి డబ్బులు ఏ విధంగా తస్కరించా అబడ్డాయో వాటికి సంబంధించిన వివరాలతో బాధితుడు విశాల్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. త్వరితగతిన స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# అవయవదానంతో నలుగురికి పునర్జన్మ

## సృజన కుటుంబం మహోన్నత నిర్ణయం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), ఫిబ్రవరి 26 : కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జనకాపూర్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. బ్రెయిన్ డెడ్ అయిన ఈస్త సృజన(34) అవయవాలను దానం చేసి నలుగురికి కొత్త జీవితం ప్రసాదించిన కుటుంబం ఆదర్శంగా నిలిచింది. జనకాపూర్ కు చెందిన గుండు నాగరాజుకు, మందమర్రి కి చెందిన సృజనతో 2018లో వివాహం జరిగింది. వీరికి ఇప్పటికే ఒక కుమారుడు ఉన్నాడు. ఉద్యోగరీత్యా దుబాయ్‌లో నివసిస్తూఉన్నాడు.

కుప్పకూలి... బ్రెయిన్ డెడ్‌తో మృతి...

ఈనెల 21న తల్లిదండ్రుల ఇంట్లో ఉన్న సృజన అకస్మాత్తుగా తలనొప్పి ఉందని చెప్పి స్పృహ కోల్పోయింది. వెంటనే మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించ డంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజుల పాటు ఐసీయూలో వెంటిలేటర్‌పై వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు నిర్ధారిం చారు.

మరణిస్తూ నలుగురికి ప్రాణం పోస్తూ

ఈ నేపథ్యంలో వైద్యులు, జీవన్ ధాన్ సంస్థ ప్రతినిధులు కుటుంబ సభ్యులకు అవయవదానం గురించి అవగాహన కల్పించారు. విషయం తెలుసుకున్న భర్త నాగరాజు దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు చేరుకుని, భార్య అవయవాలను దానం చేయడానికి అంగీకరించారు. దీంతో సదరు ఆసుపత్రి వైద్యులు సృజన రెండు మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులను సేకరించి అవసరమైన రోగులకు మార్పిడి చేశారు. ఆమె అవయవాలు పలువురికి ప్రాణాధారంగా మారాయి. అవయవదానం అనంతరం సృజన పార్థివదేహానికి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది గౌరవ సెల్యూట్ చేసి నివాళులర్పించడం హృదయాలను కదిలించింది. సమాజహితాన్ని ముందుంచి అవయవదానానికి ముందుకొచ్చిన సృజన కుటుంబ సభ్యులను జీవంధాన్ ప్రతినిధులతో పాటు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, సభ్యులు సానా రామకృష్ణారెడ్డి, నూక రమేష్, లగిశెట్టి చంద్రమౌళి, భీష్మాచారి, కేఎస్ వాసు, రాంరెడ్డి తదితరులు అభినందించారు.




# కీలక ఖనిజరంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యం




- ప్రభుత్వ, ప్రైవేటు ఖనిజ పరిశ్రమలు కలిసి పనిచేస్తే కీలక ఖనిజరంగంలో మనదే అగ్రస్థానం
- కీలక ఖనిజ రంగ అభివృద్ధికి తన వంతుగా సింగరేణి కృషి
- హైదరాబాద్ లో నీతి ఆయోగ్ కీలక ఖనిజ కమిటీ సమావేశంలో సభ్యుల అభిప్రాయాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 26 : నేటి ఆధునిక ప్రపంచంలో కీలక ఖనిజాలకు అధిక ప్రాధాన్యత ఉందని, కీలక ఖనిజ రంగంలో భారత్ ను స్వయం సమృద్ధి దేశంగా రూపుదిద్దడానికి దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ కమిటీ అభిప్రాయపడింది. హైదరాబాద్ సింగరేణి భవన్ లో గురువారం కమిటీ ఛైర్మన్ డాక్టర్ డీకే.సింగ్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో భారతదేశంలో కీలక ఖనిజాల ఆవశ్యకత, లభ్యత, కీలక ఖనిజాల అన్వేషణ, అందుకు గల అవకాశాలు, వివిధ ప్రభుత్వ మైనింగ్ సంస్థలు తీసుకోవలసిన చొరవ, బాధ్యతలు తదితర అంశాల పైన లోతుగా చర్చించారు. కమిటీ మెంబర్ సెక్రటరీ, నీతి ఆయోగ్, డిప్యూటీ అడ్వైజర్ మినరల్స్ ఆర్.శరవణభవన్, సభ్యులుగా ఉన్న సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, ఇంకా ఇతర సభ్యులు పాల్గొన్నారు. కేంద్ర నీతి ఆయోగ్ కమిటీ ఏర్పాటు చేసిన ఈ కమిటీలో సింగరేణి సంస్థ ఛైర్మన్ కూడా సభ్యులుగా ఉన్నారు. కనుక ఈసారి ఈ సమావేశాన్ని సింగరేణి ఆతిథ్యంలో నిర్వహించడం జరిగింది. సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సమావేశానికి స్వాగతం పలుకుతూ, దేశంలో గల ప్రాథమిక మరియు ద్వితీయ కీలక ఖనిజ వనరులను కనుగొనడానికి ఏర్పాటు చేసిన ఈ కమిటీ దేశ కీలక ఖనిజ అవసరాలు తీర్చడంలో తమ వంతు కృషి చేస్తుందని దీనికి సింగరేణి సంస్థ తన సంపూర్ణ సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ మట్టిలో, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ఫ్లై యాష్, బాటమ్ యాష్ లలో దాగి ఉన్న క్రిటికల్ మినరల్స్ ను వెలికితీయడానికి తమ వంతు కృషి చేస్తామని, జాతీయ కీలక ఖనిజ అవసరాలు తీర్చడంలో సింగరేణి సంస్థ తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, సోలార్ విద్యుత్తు, బ్యాటరీలతో నడిచే వాహనాలు, ఎలక్ట్రానిక్ రంగ విస్తరణ లో, రక్షణ రంగంలో కీలక ఖనిజాల అవసరం ఎంతో ఉందని, దేశంలో కీలక ఖనిజాల వనరులు ఉన్నప్పటికీ, వాటి మైనింగ్ జరగటం లేదని కాబట్టి ప్రస్తుతం విదేశాల నుండి కీలక ఖనిజాలను దిగుమతి చేసుకుంటున్నామని కమిటీ అభిప్రాయపడింది. రానున్న కాలంలో కీలక ఖనిజాల వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది కనుక దేశంలో గల కీలక ఖనిజ వనరులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడానికి ప్రభుత్వ మైనింగ్ సంస్థలు, ప్రైవేటు మైనింగ్ సంస్థలు కలిసి నడవాలని సూచించింది.

ఈ సమావేశంలో కమిటీ సభ్యులతో పాటు సింగరేణి సంస్థ నుండి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు, జీఎం (కో-ఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్, జీఎం (ఎక్స్ ప్లోరేషన్) బి.శ్రీనివాసరావు, ఐఎంఎంటీ, కోల్ ఇండియా, సీఎస్ఐఆర్-సీఈసీఆర్ఐ (కరైకుడి), గుజరాత్ మినరల్ డెవలప్మెంట్ కార్పోరేషన్, అదానీ, వేదాంత, లాయిడ్ మెటల్స్, హిందాల్కో, హిందుస్తాన్ జింక్, సన్ టెక్నాలజీస్ (చెన్నై) తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ రామగుండంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి

## రామగుండం మేయర్ మహంకాళి స్వామి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), ఫిబ్రవరి 26 :

స్వచ్ఛ రామగుండశీగా తీర్చి దిద్దడమే ప్రదాన లక్ష్యంగా కృషి చేస్తానని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. ఎన్నికైన తరువాత తొలిసారిగా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లోని పీఠం పై ఆశీనులై గురువారం పదవీ భాధ్యతలు స్వీకరించారు . ఇంటింటికీ ఉచితంగా పంపిణీ చేయడానికి అంచనా వ్యయశీ రూ 10.00 లక్షలతో చెత్త డబ్బాలు కొనుగోలు చేయడానికై ప్రవేశపెట్టిన ఫైలు పై తొలి సంతకం చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో సానిటేషన్ నిర్వహణలో లోపాలను గుర్తించి ప్రక్షాళన చేయడం చేయడం జరుగుతుందని అన్నారు. రామగుండం నగరంలో కొంతమంది తమ స్వస్థలం లో జనాభా వివరాలు నమోదు చేసుకుంటుండడంతో ఇక్కడ డేటా లో వారి వివరాలు ఉండడంలేదని అన్నారు. తద్వారా నిధుల మంజూరులో నివసిస్తున్న జన సంఖ్య ప్రాతిపదికన రామగుండం నగరానికి నిధులు దక్కడం లేదని అన్నారు. ఇక్కడ ఉంటున్న ప్రతి ఒక్కరు జన గణనలో ఇక్కడే నమోదు చేసుకోవాలని అన్నారు. అలాగే 1931 తర్వాత తొలిసారిగా జనాభా లెక్కల్లో భాగంగా కుల గణన కూడా జరుగుతున్న నేపధ్యంలో లెక్కలు సరిగా నమోదు అయ్యేలా పర్యవేక్షిస్తామని అన్నారు. అలాగే రామగుండం నగరానికి సానుకూలంగా ఉండేలా కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించడం జరుగుతుందని అన్నారు. సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించి రాబోయే 20 ఏండ్ల వరకు ఉపయోగపడేలా రూపొందిస్తామని అన్నారు. అంతేకాకుండా ఇప్పటి వరకు కొనసాగుతున్న 15 వ ఆర్థిక సంఘం గడువు ముగిసి ఏప్రిల్ 1 , 2026 నుండి 16 వ ఆర్థిక సంఘం అమల్లోకి వస్తున్న నేపధ్యంలో రామగుండం నగర పాలక సంస్థ కు ఈ ఐదేళ్ల నిధులు అధికంగా వచ్చేందుకు ఏమి చేయాలో అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా నివేదికలు పంపించడం జరుగుతుందని అన్నారు. సమగ్ర నగరాభివృద్ధి కొరకు ఒక డి పి ఆర్ రూపొందిశీచి ఎన్ ఎల్ ఎ , మంత్రి వర్యులు, ముఖ్యమంత్రి సహకారంతో నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయిస్తామని అన్నారు. తనను ఆశీర్వదించిన వారందరికీ మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు కుటుంబ సభ్యులతో కలసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం మేయర్ తన ఛాంబర్ లో పీఠం పై ఆశీనులయ్యారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వయంగా విచ్చేసి మేయర్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎం . ఎల్ ఎ. సతీమణి మనాలీ రాజ్ ఠాకూర్ , కాంగ్రెస్ నాయకులు దుద్దిళ్ల శ్రీను బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష , అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ, వివిధ ప్రభుత్వ సంస్థలు, విభాగాల అధికారులు, సిబ్బంది, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, పుర ప్రముఖులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రింట్ అండ్ ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు , వివిధ పార్టీల నాయకులతో పాటు డివిజన్ ప్రజలు తండోప తండలుగా నగర పాలక సంస్థ కార్యాలయానికి తరలివచ్చి మేయర్ కు అభినశీదనలు తెలిపారు.

# తారా ఆధ్వర్యంలో 'ఖని'లో ఉగాది కళోత్సవాలు

- జాతీయస్థాయి నృత్య పోటీలు
- నల్లవజ్రం పురస్కారాలు
- తారా బాధ్యులు సంకె రాజేష్, కే.స్వామి వెల్లడి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఫిబ్రవరి 26 : ఉగాది పండుగను పురస్కరించుకొని తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మార్చి 28, 29 తేదీలలో గోదావరిఖనిలో రెండు రోజులపాటు జాతీయస్థాయి నృత్య పోటీలు, ఉగాది పురస్కారాలు, నల్ల వజ్రం అవార్డ్స్ ఫంక్షన్ ఘనంగా నిర్వహించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు సంకె రాజేష్, ఇప్టా జాతీయ సమితి నాయకులు కే.స్వామి తెలిపారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తారా ఆర్ట్స్ అకాడెమీ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటుగా ఉత్తరాఖండ్, తమిళనాడు, అండమాన్ నికోబార్, అమెరికా, మలేషియా, సింగపూర్, స్విట్జర్లాండ్, తైవాన్ తదితర దేశాలలో సైతం కళోత్సవాలు నిర్వహించి, వివిధ రంగాలలో లబ్ధ ప్రతిష్టులైన వారిని సముచిత రీతిన సత్కరించడం జరిగిందన్నారు. గోదావరిఖని కేంద్రంగా 2021లో భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాలు, ఆజాదీకా అమృత్ మహోత్సవ్, 2024లో విభిన్న రంగాలలో రాణిస్తున్న సుమారు 125 మంది సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబాల పిల్లలను గుర్తించి, నల్ల వజ్రం జాతీయ పురస్కారాలను అందజేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని మార్చి 28, 29 తేదీలలో గోదావరిఖని ఆర్కే గార్డెన్స్ లో ఉగాది ఉత్సవాలు, జాతీయస్థాయి జానపద, శాస్త్రీయ బృంద నృత్యాల పోటీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే విద్య, వైద్యం, పాత్రికేయ, న్యాయవాద, ఉపాధ్యాయ, ఉద్యోగులు, అధికారులు తదితర రంగాలలో రాణిస్తున్న వారిని గుర్తించి ఉగాది పురస్కారాలు, నల్ల వజ్రం అవార్డులు ప్రదానం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, సినీ, టీవీ నటీనటులను అతిథులుగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. నృత్య పోటీలలో పాల్గొనదలచిన కళాకారులు మార్చి 10లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 6281252369 నెంబర్ లో సంప్రదించాలని కోరారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో కళోత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు దామెర శంకర్, మేజిక్ రాజా, దయా నర్సింగ్, కనకం రమణయ్య, పి.చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐటీయుసి లో చేరిన కాంట్రాక్టు కార్మికులు

- సిఎస్‌పి వన్‌ఇంచార్జీగా కే.వెంకటేష్ నియామకం
- కాంట్రాక్టు కార్మికులకు బి కేటగిరి వేతనాలు చెల్లించాలి
- సమస్యల పరిష్కారానికీ ఏఐటీయుసి కృషి
- ఏఐటీయుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), ఫిబ్రవరి 16 : సింగరేణిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్స్ పరిధిలోని అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు కేంద్ర ప్రభుత్వ కనీస వేతనాల జీ.వో.లోని బి కేటగిరి వేతనాలను చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియా లోని జిడికె వన్ సి.ఎస్.పి లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఏఐటియుసి లో చేరిన సందర్భంగా వారికి కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు గత కొన్నేళ్లుగా చాలీచాలని జీతాలతో తమ కుటుంబాలను పోషించారు కోవడం లో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికుల కు వేతనాలు పెంచుతామని, పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అధికారంలోకి వచ్చిన టిఆర్ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆయన పేర్కొన్నారు. సింగరేణి లో కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం కోసం వారి జీతాల పెంపు కోసం ఏఐటియుసి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కాంట్రాక్టు కార్మికుల ను పట్టించుకోకుండా వారిని కేవలం ఓటు బ్యాంకు గా వాడుకుంటూ తీవ్ర అన్యాయం చేస్తుందని ఆయన ఆరోపించారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం జీవో ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింగరేణి ఏరియా లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కు ప్రస్తుతం సి గ్రేడ్ వేతనాలు ఇస్తున్నారని ఇది చాలా అన్యాయమని వారికి బి గ్రేడ్ వేతనాలు చెల్లించేందుకు అట్టి జి.వో ను అమలు చేయాలని కోరుతూ గత కొద్ది రోజుల క్రితం కొత్తగూడెం లో డైరెక్టర్ ఆపరేషన్స్ కు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గౌరవ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. దీని పై మార్చిలో యాజమాన్యం తో జరిగే సమావేశంలో ఏఐటియుసి మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో మంచిర్యాల, రామగుండం, కొత్తగూడెం మున్సిపాలిటీలు కార్పొరేషన్స్ గా మారిన నేపథ్యంలో సింగరేణిలో కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు చెల్లిస్తున్న సి కేటగిరి వేతనాల స్థానంలో బి కేటగిరి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. దీని ప్రకారం అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.674 సెమీస్కిల్డ్ కార్మికులకు రూ.760 స్కిల్డ్ కార్మికులకు రూ 893, హైలీ స్కిల్డ్ కార్మికులకు రూ.981 సెక్యూరిటీ గార్డులకు రూ.893 చెల్లించవలసి ఉన్నదని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం ఎ గౌస్ మాట్లాడుతూ సి.ఎస్.పి వన్ లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల కు పని ముట్లు అందించాలని, వారికి బూట్లు, గ్లౌస్ లు, బెల్లం తవల్ ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా సి.ఎస్.పి వన్ కాంట్రాక్టు వర్కర్స్ ఏఐటియుసి ఇంచార్జీ గా కే.వెంకటేష్ ను నియమించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు బి.సమ్మయ్య, జానిమియా తో పాటు కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అందరి సమన్వయంతో నగరాన్ని అభివృద్ధి చేస్తా

## - రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్‌సిటి (గోదావరిఖని), ఫిబ్రవరి 26 : అందరి సమన్వయంతో నగరాన్ని అభివృద్ధి చేస్తానని, పాలక పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అన్ని డివిజన్లలో అందరి సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్. రాజ్ ఠాకూర్ అన్నారు. మేయర్‌గా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఛాంబర్‌లో గురువారం మహంకాళి స్వామి పదవీ భాధ్యతలు స్వీకరిం చిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన సతీ సమేతంగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా, యువజన నాయకుడిగా, కాంగ్రెస్ నాయకుడిగా, కార్పొరేటర్‌గా సుదీర్ఘ కాలంగా సేవలందించిన దళిత నాయకుడు మేయర్‌గా కార్మిక నాయకుడు, బిసి నాయకుడుగా ఉన్న సీనియర్ నేత డిప్యూటీ మేయర్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్యులు శ్రీధర్ బాబు ఆశీర్వాదంతో ఎంపికయ్యారని అన్నారు. బొందల గడ్డగా మారిన రామ గుండం నగరాన్ని పునర్నిర్మించాలనే సంకల్పంతో ముందుకు వెళ్తున్న తమ పై ఎంత దుష్ప్రచారం చేసినా సత్యదూరమైన మాటలను ప్రజలు నమ్మకుండా ఇటీవలి ఎన్నికల్లో అద్భుత ఫలితాలు ఇచ్చారని అన్నారు. త్రాగు నీరు, సాగు నీరు, మౌళిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తుండడంతో పాటు, 1+800 మెగా వాట్ల థర్మల్ ప్రాజెక్ట్ తదితర పరిశ్రమలతో పారిశ్రామిక ప్రగతి రామగుండం నగరంలో చురుగ్గా సాగుతున్నదని అన్నారు. సామాన్యులకు అందుబాటులో ఉండి నూతన పాలక వర్గశీ పని చేయాలని సూచించారు.



# బదిలీ అయినా మాట నిలబెట్టిన కలెక్టర్...

## భరత్ కుటుంబానికి ఇల్లు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26 :యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణ పురం మండలం కంకణాల గూడెం గ్రామానికి చెందిన భరత్ చంద్రా చారి కుటుంబానికి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అండగా నిలిచారు. బదిలీ అయినప్పటికీ తన వాగ్దానాన్ని నిలబెట్టుకుని ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. గతంలో భరత్‌ను దత్తత తీసుకున్న కలెక్టర్, అతని విద్య కోసం ప్రతి నెల రూ.5 వేల ఆర్థిక సహాయం అందిస్తూ కుటుంబానికి అవసరమైన సరుకులను కూడా సమకూరుస్తున్నారు. ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబ పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం తరఫున 225 గజాల స్థలం మంజూరు చేయించి, గృహ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. "నాకు బదిలీ అయినా నీకు ఎప్పుడైనా అవసరం ఉంటే సంప్రదించు" అని భరత్‌కు భరోసా ఇచ్చిన కలెక్టర్, ఇల్లు నాణ్యతగా, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శేఖర్ రెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి తదితర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యాదాద్రి భువనగిరికి కొత్త కలెక్టర్

## అనురాగ్ జయంతి బాధ్యతలు స్వీకారం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26 : 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అనురాగ్ జయంతి గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో భోధన్, ఖమ్మం జిల్లాల్లో సబ్ కలెక్టర్‌గా, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా సేవలందించిన ఆయన, జీహెచ్ఎంసీ పరిధిలో ఖైరతాబాద్, రాజేంద్రనగర్ జోన్లలో కమిషనర్‌గా పనిచేశారు. అక్కడి నుంచి బదిలీపై యాదాద్రి భువనగిరి జిల్లాకు నియమితులయ్యారు. జిల్లాలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమ పథకాలను అట్టడుగు వర్గాలకు చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమగ్ర అభివృద్ధి దిశగా జిల్లా ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు.




# వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఫిబ్రవరి 26 : వికసిత్ భారత్-2026 జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ పోటీల పోస్టర్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ఎమర్జెన్సీ అంశంపై తమ అభిప్రాయాలను రాజ్యాంగబద్ధ దృక్పథంతో, స్పష్టంగా, బాధ్యతతో వ్యక్తపరచాలని సూచిం చారు. "50 ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ: లెసన్స్ ఫర్ ఇండియన్ డెమోక్రసీ" అనే అంశంపై 18 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతకు మూడు నిమిషాల పాటు హిందీ, ఇంగ్లీష్, తెలుగు భాషల్లో మాట్లాడే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో నిర్వహించబడతాయని వెల్లడించారు. జిల్లాస్థాయి పోటీలు శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ తెలిపారు. పోటీలలో పాల్గొనదలచిన వారు ముందుగా మై భారత్ పోర్టల్ లో 'వికసిత్ భారత్' ఈవెంట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా టిజిసి జిటిఏ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఆలోచనలను ధైర్యంగా వ్యక్తపరచి జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మేరా యువ భారత్ జిల్లా అధికారి ఎం.వెంకట రాంబాబు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో విద్యార్థులు విస్తృతంగా పాల్గొని కరీంనగర్ జిల్లా ప్రతిష్టను జాతీయస్థాయికి చేర్చేలా తమ ప్రతిభను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ పి.నితిన్ పాఠక్, టి.రాజయ్య, వికసిత్ భారత్ జిల్లాస్థాయి పోటీల సమన్వయకర్త బి.ఎలిజబెత్ రాణి, ఎన్ఎస్ఎస్ పిఓలు శ్రీనివాస్ రెడ్డి, సత్యప్రకాశ్, డాక్టర్ కే.అర్జున్, వెంకటేశ్వర్లు, రాజేందర్, రాజేష్ తదితర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# మమతా బెనర్జీ కళ్లు తెరవాలి !

బెంగాల్లో సర్ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో అక్కడ జ్యుడిషియల్ అధికారుల అజమాయిషీలో జరగాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతోపాటే సర్ ప్రక్రియను అడ్డుకోరాదని మమతా బనర్జీకి సుప్రీం గట్టిగానే సూచించింది. నిజానికి సర్ ప్రక్రియ ద్వారా ఓట్లను సంస్కరించడం అవసరమే. తమిళనాట లక్షల్లో ఓట్లు తొలగించారు. గుజరాత్‌లోనూ తొలగించారు. ఇప్పుడు దక్షిణాదిలో కూడా సర్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ క్రమంలో ఓట్లు తొలగింపు వల్ల ఎవరైనా తమ ఓటు నిజంగానే కోల్పోతే వారి పక్షాన ప్రభుత్వం పోరాడాలి. అంతే తప్ప అడ్డుకోవడం సరికాదు. ఇదేదో రాజ్యాంగ విఘాతం కలిగించారన్న రీతిలో ప్రచారం చేయడం విపక్షాలకు తగదు. ఎన్నికల కమిషన్ ఏం చేసినా, ఎలా చేసినా విమర్శించే విపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకెపార్టీలు తీవ్రంగా అడ్డుపడుతున్నాయి. బ్యాలెట్ బాక్సులతో ఓటింగ్ విధానం ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతికి మారాక కొన్ని ఎన్ని కల వరకూ బాగా నడిచిందని ప్రశంసలు ఇచ్చిన పార్టీలు ఇప్పుడు ఆ విధానం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని ఘోషిస్తున్నాయి. పార్టీ ఏదైనా తమకు ఓటింగ్ అనుకూలంగా రాకపోయి ఓటమిపాలైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ పక్రి యలో లోటుపాట్లు ఉన్నందునే తాము ఓడిపోయామని విమర్శలు గుప్పిస్తున్నారు. విపక్ష పార్టీలు తమ స్థానాలు మారినా విమర్శలకు వెనుకాడడం లేదు. 'సర్' పేరెత్తితేనే విపక్షాల్లో అదీ అతి ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ అపచారం జరిగిందని అంటున్నారు. ఇలా కాకుండా ఎక్కడైనా ఓట్ల తొలగింపుతో ఎవరైనా నష్టపోతే దానిని ఆధారంగా చేసుకుని పోరాడాలి. కానీ మొత్తం ప్రక్రియనే వ్యతిరేకించడం ద్వారా రాజ్యాంగాన్ని తృణీకరిస్తు న్నాయని గుర్తించాలి. సుప్రీం ఇచ్చిన ఆదేశాలు లేదా సూచ నలు ఆయా రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. ఇంకా సర్ ప్రక్రియను అప్రతిష్టపాలు చేయాలనే ఆలోచన నుంచి రాజకీయ పార్టీలు బయటపడాలి. ఎన్నికల కమిషన్‌పై సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీపై తమ నిరసన ధ్వనులను పెంచుతున్నాయి. ఒకపక్క ఎన్నికల కమిషన్ త్వరలో ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళ నాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (సర్) కార్యక్ర మాన్ని చేపట్టగా కాంగ్రెస్ అధ్యక్షు డు రాహుల్గాంధీ, 'ఓట్ చోరీ' ప్రచార కార్యక్రమాన్ని బహుళ ప్రచారం చేస్తున్నారు. బీహార్ ఎన్నికల్లో చతికిలపడినా ఓటరు జాబితా విషయంలో రాజీ పడేది లేదనే ధోరణిలో ముందుకు కదులుతున్నారు. బీహార్లో 'సర్' కార్యక్రమం చేపట్టినప్పుడు ఎన్నికల కమిషన్ను కాంగ్రెస్ పార్టీ విపరీ తంగా ఆరోపణలు గుప్పించింది. ఎన్ని కల కమిషన్ తన ధోరణిలో తనప్రణాళిక ప్రకారం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టింది. ఎన్నికలు సజావుగానే నడిపించింది. బీహార్లో అప్పటికే అధికారంలో ఉన్న పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. అంటే విపక్షాల అభ్యంతరాలు ఎవరినీ కదిలించలేదన్నది సుస్పష్టం. అయినా కాంగ్రెస్ తదితర పక్షాలు తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లన్న ధోరణిలో తమ పిడివాదంతో విమర్శలు గుప్పిస్తున్నాయి. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించే నినాదంతో కాంగ్రెస్ సంతకాల సేకరణ చేస్తోంది. బీహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన ఆలోచనలో మార్పు తెచ్చుకోగలదని అందరూ భావించారు. కానీ అలా జరుగలేదు. కనీసం ఆది నుంచీ ఒకే మాటమీద వ్యవహా రాన్ని నడిపిస్తు న్నారు. బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడడం వంటివి ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీలు కలిసి కట్టుగా వ్యవహరిస్తున్నాయన్నది కాంగ్రెస్ ఆరోపణలు. బిజెపి ఓటర్లకు ఆయా నియోజక వర్గాల్లో నగదు పంచుతున్నా చర్యలు తీసుకోకుండా, ఇసి సహకరిస్తోందని విపక్షాలు గట్టిగా నమ్ముతున్నాయి. తాజాగా పశ్చిమ బెంగాల్లో ఓటర్ల జాబితా సవరణ మొదలైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఎన్నికల కమిషన్పై రుసరుసలాడుతున్నారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఒక ఉద్దేశపూర్వక కుట్రగా అభివర్ణించారు. బీహార్‌లో 'సర్' అమలులో విజయవంతమైన కార్యక్రమంగా రూపొందించి దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేప ట్టేందుకు ఇసి నిర్ణయం తీసుకుందంటే అది ఎంతోమంచి కార్యక్రమమేనను కోవాలి. అయినా బిజెపియేతర ఇండియా కూటమిలు ప్రధానపక్షమైన కాంగ్రెస్‌ఎన్నికల కమిషన్ వివవరణలను ఆకళింపు చేసుకోలేకపోయింది. దానికితోడు దేశవ్యాప్త 'సర్' విచారణ కోసం నియమితులైన 16మంది బిఎల్‌ఎలు ఒత్తిడి వల్లనే మరణించారన్న వార్తలను ఆసరాగా చేసుకుని ఇసి ఒత్తిడిలపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. పశ్చిమ బంగలోని ధులగోరి, బిరాటి, న్యూటేన్ ఘసురి వంటి ప్రాంతాల్లో ఎక్కు వగా ఉండే బంగ్లా దేశీయులు ఓటర్ల జాబితా ఏరివేతలో తగు పత్రాలు చూపలేక అక్రమంగా వలస వచ్చినట్లు తేలినవారంతా ఇప్పుడు బంగ్లాదేశ్ దారిపట్టారు. ఇప్పుడీ కార్య క్రమం వలన పశ్చిమ బెంగాల్లో సంక్లిష్ట పరిస్థితులేర్పడ్డా యి. బంగ్లాదేశ్ నుంచి వచ్చి బెంగాల్లో ఉండేవారి పత్రా లను చూసే పనిని బిఎస్‌ఎఫ్ జవాన్లకు అప్పగించారు. వెనక్కి వెళ్లే సమయంలోనూ వీరే వారిపత్రాలను పరిశీ లించి పోలీసు లకు పంపాల్సి ఉంటుంది. ఈ పక్రియ ఎంతో కష్టమైనది. సుదీర్ఘమైనది. బంగ్లాదేశీయుల రివర్స్ మైగ్రే షన్తో బెంగాల్ పోలీసులు సతమత మవుతున్నారు. సరైన పత్రాలు లేనివారిని నిర్బంధించి జైల్లోపెట్టే పరిస్థితి ఉంది. నిజానికి బంగ్లాదే శీయులు పశ్చిమ బెంగాల్లో ప్రవేశించినప్పుడు దళారీల ద్వారా ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, ఓటరు ఐడీలతో ప్రవేశించారు. ఇప్పుడు అలాంటి ఎన్నీ బయటపడి పత్రాలన్నీ నకిలీవని తేలుతున్నందున మమతా బెనర్జీ సిగ్గుపడాలి.

# చరమాంకంలో ఎర్రయుద్ధం

# లొంగుబాట్లు, ఎదురుకాల్పుల మధ్య

# క్షీణిస్తున్న మావోయిస్టు ప్రభావం



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



భారతదేశంలో సాయుధ వామ పక్ష ఉద్యమం చరిత్రను పరిశీలిస్తే అది ఒక్కసారిగా ఉద్భవించిన ప్రక్రియ కాదని, దీర్ఘకాలిక సామాజిక–ఆర్థిక అసమానతల నేపథ్యంలో రూపుదిద్దుకున్న రాజకీయ ప్రతిస్పందన అని స్పష్టమవుతుంది. 1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరి గ్రామంలో చోటుచేసుకున్న రైతాంగ తిరుగుబాటు ఈ ఉద్యమానికి చిహ్నాత్మక ఆరంభం. భూస్వామ్య దోపిడీ, భూమిలేని కౌలు రైతుల సమస్యలు, అధికార యంత్రాం గం నిర్లక్ష్యం... ఈ మూడు అంశాలు కలిసే అక్కడి సంఘటనలకు దారితీశాయి. "భూమి ఎవరిది? దున్నేవారిదే" అనే నినాదం కేవలం రాజకీయ నినాదం కాకుండా, గ్రామీణ భారతదేశంలో దశాబ్దాలుగా పేరుకు పోయిన అసంతృప్తికి ప్రతీకగా నిలిచింది. ఆ చిగురుటాకుల చప్పుడు కొద్ది కాలంలోనే అరణ్య ప్రాంతాల గుండా విస్తరించి, సాయుధ సిద్ధాంతపర ఉద్యమంగా మారింది.

1980ల నాటికి ఆంధ్రప్రదేశ్‌లో పీపుల్స్ వార్ గ్రూప్, బీహార్–ఝార్ఖండ్ ప్రాంతాల్లో మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ వంటి వర్గాలు గెరిల్లా యుద్ధాన్ని ప్రధాన వ్యూహంగా స్వీకరించాయి. గ్రామీణ ప్రాంతాల్లో 'జనతా కోర్టులు', 'లిబరేటెడ్ జోన్లు' వంటి ప్రయోగాలు ప్రారంభమయ్యాయి. 2004లో పీపుల్స్ వార్ గ్రూప్ మరియు మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ విలీనం చెంది సి పి ఐ మావోయిస్ట్‌గా ఏర్పడింది. ఈ విలీనంతో ఉద్యమం ఒకే కేంద్రీకృత నాయకత్వం కిందకి వచ్చింది. పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ముప్పాల లక్ష్మణ్ రావు (గణపతి) సిద్ధాంతపరంగా "దీర్ఘకాల ప్రజా యుద్ధం" మార్గాన్ని బలంగా ముందుకు నడిపించారు. ఆయన నాయకత్వంలో దళాలు దండకారణ్యం, బస్తర్ అరణ్యాలు, ఒడిశా–ఛత్తీస్‌గఢ్ సరిహద్దులు, ఆంధ్ర–ఒడిశా బోర్డర్ ప్రాంతాల్లో ప్రభావాన్ని విస్తరించాయి.

2000ల మధ్య నాటికి కేంద్ర హోంశాఖ అంచనాల ప్రకారం దేశంలోని సుమారు 200కు పైగా జిల్లాల్లో మావోయిస్టు ప్రభావం ఉందని పేర్కొన బడింది. 2010 సంవత్సరం ఈ ఉద్యమానికి ఒక కీలక మలుపు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ దాడిలో 76 మంది భద్రతా సిబ్బంది మరణించడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన తర్వాత కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు హింసను "అంతర్గత భద్రతకు అతిపెద్ద ముప్పు"గా అధికారికంగా పేర్కొంది. ఇదే సమయంలో సమగ్ర భద్రతా వ్యూహానికి రూపకల్పన జరిగింది. రాష్ట్ర పోలీసు బలగాలు, సిఆర్‌పిఎఫ్, కోబ్రా కమాండోలు, ప్రత్యేక దళాలు సంయుక్తంగా అరణ్య ప్రాంతాల్లో విస్తృత ఆపరేషన్లు ప్రారంభించాయి. మీడియా వర్గాల్లో "ఆపరేషన్ గ్రీన్ హంట్"గా ప్రాచుర్యం పొందిన చర్యల తరువాత మరింత లక్ష్య సాధనతో సాగిన సమన్వయ ఆపరేషన్లు కొన్ని ప్రాంతాల్లో "ఆపరేషన్ కగార్" పేరుతో కొనసాగాయి.

ఈ ఆపరేషన్ల ప్రధాన లక్ష్యం గెరిల్లా దళాల సరఫరా మార్గాలను తెగదెంపులు చేయడం, అరణ్యాల్లో వారి కదలికలను పరిమితం చేయడం, ఇంటెలిజెన్స్ నెట్వర్క్‌ను బలోపేతం చేయడం. డ్రోన్ పర్యవేక్షణ, శాటిలైట్ కమ్యూనికేషన్, ఆధునిక ఆయుధ సదుపాయాలు భద్రతా బలగాలకు సాంకేతిక ఆధిక్యతను ఇచ్చాయి. ఫలితంగా 2010లో నమోదైన సుమారు 2,000కు పైగా హింసాత్మక ఘటనలు 2022--23 నాటికి 500కు లోపుగా తగ్గినట్లు కేంద్ర గణాంకాలు సూచించాయి. మరణాల సంఖ్య కూడా గణనీయంగా పడిపోయింది. ఇది కేవలం సైనిక విజయమే కాకుండా ఉద్యమ నిర్మాణంలో ఏర్పడిన చీలికల సంకేతం.

లొంగుబాట్లు ఉద్యమ క్షీణతలో కీలక పాత్ర పోషించాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పునరావాస ప్యాకేజీలు, ఆర్థిక సహాయం, గృహ స్థలాలు, ఉపాధి శిక్షణలు కేడర్లను ఆకర్షించాయి. మధ్యస్థాయి నాయకులు, ఏరియా కమిటీ సభ్యులు కూడా లొంగిపోవడం వల్ల సంఘటిత నిర్మాణం దెబ్బతిన్నది. ఒకప్పుడు అడవుల్లో గెరిల్లా యుద్ధాన్ని నడిపిన నాయకులు ప్రజా ప్రధాన ప్రవాహంలోకి రావడం ఉద్యమానికి మానసిక దెబ్బ. లొంగుబాటు చేసిన పలువురు తమ అనుభవాలను బహిర్గతం చేయడంతో అంతర్గత విభేదాలు, కఠిన నియమాలు, జీవన కష్టాలు వెలుగులోకి వచ్చాయి. ఎదురుకాల్పులు కూడా పెరిగాయి. బస్తర్, సుక్మా, బీజాపూర్ ప్రాంతాల్లో జరిగిన సంయుక్త ఆపరేషన్లలో పలువురు కీలక నాయకులు మృతి చెందారు. అడవుల్లో సురక్షిత ఆశ్రయాల కొరత, స్థానిక మద్దతు తగ్గుదల, ఆర్థిక వనరుల లోపం---ఇవన్నీ కలసి గెరిల్లా వ్యూహాన్ని బలహీన పరిచాయి. ఒకప్పుడు "రెడ్ కారిడార్"గా పేర్కొనబడిన విస్తీర్ణం ఇప్పుడు భౌగోళికంగా సంకుచితమైంది. కేంద్ర హోంశాఖ ప్రకటనల ప్రకారం ప్రభావిత జిల్లాల సంఖ్య 90కు లోపుగా తగ్గింది.

ఈ పరిణామాల్లో గణపతి పాత్ర విశ్లేషణీయ అంశం. 2004 నుంచి దాదాపు పదిహేనేళ్లకు పైగా పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన ఆయన సిద్ధాంతపర దిశానిర్దేశం ఉద్యమాన్ని సమన్వయ పరిచింది. అయితే వయసు, ఆరోగ్య సమస్యలు, భద్రతా ఒత్తిడి కారణంగా 2018 తర్వాత ఆయన క్రియాశీలక పాత్ర తగ్గిందని అధికార వర్గాలు సూచించాయి. నాయకత్వ మార్పు, అంతర్గత పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలు సాగినట్లు సమాచారం. గణపతి ప్రజా దృష్టికి దూరమవడం ఉద్యమానికి ఒక ప్రతీకాత్మక మలుపు. ఒక యుగం ముగింపు భావన కేడర్లలో కూడా స్పష్టమైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అయితే ఉద్యమం పూర్తిగా అంతరించి పోయిందని చెప్పడం తొందరపాటు. సామాజిక అసమానతలు, భూహక్కుల వివాదాలు, గనుల అనుమతులపై స్థానిక ప్రజల ఆందోళనలు, ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి లోపాలు ఇంకా పూర్తిగా పరిష్కార మవ్వలేదు. అరణ్య హక్కుల చట్ట అమలు, మౌలిక సదుపాయాల విస్తరణ, విద్య–ఆరోగ్య సేవల మెరుగుదల వంటి చర్యలు కొంతమేర ప్రభావం చూపుతున్నప్పటికీ, అసంతృప్తి విత్తనాలు పూర్తిగా నశించలేదు. సాయుధ పోరాటం బలహీన పడినా భావజాలం మౌనంగా కొనసాగవచ్చని కొందరు విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యం ఒక చరమాంక దశలా అనిపిస్తోంది. గెరిల్లా దళాల సంఖ్య తగ్గింది; నాయకత్వం శూన్యంగా మారింది; లొంగుబాట్లు పెరిగాయి; ఎదురుకాల్పుల్లో నష్టం అధికమైంది; భద్రతా బలగాల ఆధిక్యం పెరిగింది. గణపతి యుగం ముగింపు దశలోకి వెళ్లగా ఉద్యమం కూడా సంక్షోభ దశను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించిన ఎర్రచరిత్ర ఇప్పుడు కొన్ని అరణ్య ప్రాంతాలకు మాత్రమే పరిమితమైంది.

అంతిమంగా ఈ పరిణామం భారత ప్రజాస్వామ్యానికి ఒక పాఠం. సాయుధ ఉద్యమం క్షీణత భద్రతా విజయమే అయినప్పటికీ, దీర్ఘకాలిక శాంతి కోసం అభివృద్ధి, సామాజిక న్యాయం, రాజకీయ సంభాషణ సమానంగా అవసరం. నక్సల్బారి నుంచి దండకారణ్యం వరకు సాగిన ఈ ప్రయాణం ఒక యుగాన్ని నిర్వచించింది. ఇప్పుడు ఆ యుగం చరమాంకం లోకి చేరినట్టు కనిపిస్తున్నా, దాని మూల కారణాలపై సమగ్ర పరిష్కారం కనుగొనడమే స్థిరశాంతికి మార్గం.

**వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.**

# పెన్షన్ల హామీ గుదిబండ కానుందా?

**- పెంచితే ఖజానాపై బారీగా భారం - పెంచకుంటే విపక్షాల నుంచి విమర్శలు**
**- మల్లగుల్లాలు పడుతున్న అధికార పక్షం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 26 : ఆరు గ్యారెంటీలు, పెన్షన్ల పెంపు, తులం బంగారంపై విపక్ష బిఆర్‌ఎస్ ఎక్కడిక్కడ నిలదీస్తోంది. దీనికితోడు వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సర్కార్‌ను నిలదీసేందుకు సన్నద్ధం అవుతోంది. బడ్జెట్ లెక్కలు వేసుకుంటున్న ప్రభుత్వం ఈ మొత్తాలకు మరింత వెచ్చించాలంటే జంకుతోంది. ఇప్పటికే వేలకోట్లు అప్పులకు గాను వడ్డీలు చెల్లిస్తోంది. 2024 సామాజిక సర్వే లెక్కల ప్రకారం ప్రస్తుతం 42.7 లక్షల మందికి పింఛను అందుతోంది. ఇందుకోసం ప్రతి నెలా రూ.950 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఈ పింఛన్‌ను ప్రస్తుతానికి రూ.500 చొప్పున పెంచితే.. నెలకు సుమారు రూ.210 కోట్లు అదనంగా అవసరమవుతాయి. అంటే ఏడాదికి రూ.2500 కోట్లకు పైగా భారం ప్రభుత్వంపై పడనుంది. దీనిపై తుది నిర్ణయానికి వచ్చాక బ్జడెట్‌లో కూడా ప్రస్తావించే అవకాశాలున్నాయి. తొలి విడతలో పెంచాలని భావిస్తున్న మొత్తాన్ని కూడా కలిపి బ్జడెట్‌లో కేటాయింపులు చేయన్నుట్లు తెలుస్తోంది. కాగా, దివ్యాంగుల పింఛను పొందేవారు తక్కువ సంఖ్యలోనే ఉన్నారని, వీటి వరకు కొంత ఎక్కువ మొత్తం పెంచాలన్న విజ్ఞప్తులు కూడా ఉన్నాయి. అయితే అందరికీ ఒకే విధంగా, సమ స్థాయిలోనే పెంచాలని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. చేయూత ఫించన్లను ఇలా విడతల వారీగా పెంచుతూ ఎన్నికల నాటికి రూ.4 వేలకు తీసుకెళ్లాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారుల స్థాయిలో మాత్రం చర్చలు మొదలుకాలేదు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్నాకే తమకు సమాచారం చేరుతుందని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేయూత పథకం కింద ఇస్తున్న పింఛన్‌ను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా.. పింఛను మొత్తాన్ని విడతల వారీగా పెంచాలన్న అభిప్రాయంతో ఉంది. ప్రస్తుతం చేయూత పథకం ద్వారా వృద్ధులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ రోగులు, చేనేత, గీత కార్మికులు, బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2016 చొప్పున, దివ్యాంగులకు రూ.4016 చొప్పున పింఛను ఇస్తోంది. కానీ, ఎన్నికల సమయంలో చేయూత పింఛన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం వంటి హామీలను అమలులోకి తెచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఇప్పుడు పింఛన్ల పెంపుపై దృష్టి సారించింది. అయితే ఈ హామీని కొంతకాలం ఆగాక నెరవేర్చడమా? లేదంటే ఇప్పటి నుంచే విడతల వారీగా పింఛను పెంచుతూ వెళ్లడమా? అని ఉన్నత స్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. విడతలవారీగా పెంచితే.. తొలి విడతలో రూ.500 పెంచాలన్న అభిప్రాయంతో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.

# ఆసియా పారా గేమ్స్ జట్టు ఎంపిక కమిటీ సభ్యుడిగా సింగారపు బాబు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఫిబ్రవరి 26 : తెలంగాణ రాష్ట్రానికి మరో విశిష్ట గౌరవం దక్కింది. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి గ్రామానికి చెందిన అంతర్జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ కోచ్ సింగారపు బాబు 2026 ఆసియా పారా గేమ్స్‌కు భారత జట్టు ఎంపిక కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. జపాన్ దేశంలోని ఐచి–నగోయా నగరంలో నిర్వహించనున్న ఆసియా పారా గేమ్స్–2026 కోసం భారత జట్టును ఎంపిక చేసే సాంకేతిక పరిశీలకుడు, ఎంపిక కమిటీ సభ్యుడిగా పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా ఆయనను అధికారికంగా నియమించింది. ఈ నియామకం రాష్ట్ర క్రీడా రంగానికి గౌరవాన్ని తీసుకు వచ్చింది. 2026 ఫిబ్రవరి 26 నుండి 28 వరకు నిర్వహించనున్న 14వ జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ (పురుషులు, మహిళలు) సందర్భంగా ఆసియా పారా గేమ్స్‌కు భారత జట్టు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రతిభ కనబరిచే క్రీడాకారులను గుర్తించి, సమర్థమైన భారత జట్టును రూపొందించే కీలక బాధ్యతను ఎంపిక కమిటీకి అప్పగించారు. తెలంగాణ రాష్ట్రంలోని మారుమూల గ్రామం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి దేశానికి సేవలందిస్తున్న సింగారపు బాబు నియామకం రాష్ట్ర క్రీడా రంగానికి గర్వకారణంగా నిలిచింది. యువ క్రీడాకారులకు ఇది ప్రేరణగా మారనుంది. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియాకు బాబు కృతజ్ఞతలు తెలిపారు.





# ప్రధాని నరేంద్రమోడీ అరుదైన రికార్డు

**ఇన్‌స్టాలో వంద మిలియన్లు దాటిన ఫాలోవర్లు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 :భారత ప్రధాని నరేంద్ర మోదీ మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. ప్రపంచంలో 100 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు కలిగిన తొలి రాజకీయ నేతగా సరికొత్త రికార్డును నెలకొల్పారు. 2014లో ప్రధాని మోదీ తొలిసారిగా ఇన్‌స్టాగ్రామ్‌లో చేరారు. యువతరానికి కనెక్ట్ కావడంతో ఆయన ఫాలోవర్ల సంఖ్య నాటి నుంచీ పెరుగుతూనే ఉంది. ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని మోదీ తరువాతి స్థానంలో అమెరికా అధ్య క్షుడు డొనాల్డ్ ట్రంప్ నిలిచారు. ఆయనను ఇన్‌స్టాలో ఫాలో అయ్యే వారి సంఖ్య 43.2 మిలియన్‌లు. ఆ తరువాతి స్థానాల్లో ఇండో నేషియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో (15 మిలియన్ ఫాలో వర్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డిసిల్వా (14.4 మిలియన్ ఫాలో వర్లు), తుర్కియే అధ్యక్షుడు ఎర్డొగాన్ (11.6 మిలియన్ ఫాలోవర్లు), అర్జెంటీనా ప్రెసిడెంట్ జేవియర్ (6.4 మిలియన్ ఫాలోవర్లు) ఉన్నారు. ట్రంప్‌తో పాటు ఆ తరువాత నాలుగు స్థానాల్లో ఉన్న నేత ల ఫాలోవర్లు సంఖ్యను కూలిపి చూసినా ప్రధాని మోదీ కంటే తక్కువగానే ఉండటం గమనార్హం. ఇక భారతీయ నేతల్లో కూడా ఫాలోవర్ల సంఖ్యాపరంగా ప్రధాని నెం.1గానే ఉన్నారు. ప్రధాని తరువాతి స్థానంలో ఉన్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు 16.1 మిలియన్ ఇన్‌స్టా ఫాలోవర్లు ఉండగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉన్న ఫాలోవర్ల సంఖ్య 12.6 మిలియన్లు. సోషల్ మీడి యాలో నిత్యం యాక్టివ్‌గా ఉండే ప్రధాని ఇన్‌స్టా వేదికగా వివిధ అధికారిక కార్యక్రమాలు, అంతర్జాతీయ పర్యటనలు, రాజకీయ కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు వివరాలను పంచుకుంటూ ఉంటారు. తన మనసులోని భావాలను కూడా ఫాలోవర్లతో షేర్ చేసుకుంటుంటారు.

# ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలి

## - 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కు ఏర్పాట్లు చేయాలి
## - కలెక్టర్ గరిమ అగ్రవాల్
## - ఆయిల్ పామ్ సాగు, వ్యవసాయ యాంత్రీకీకరణ, రైతుల వివరాల నమోదు, ఫెర్టిలైజర్ యాప్‌పై సమీక్ష



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26 : ఆయిల్ పామ్ పంట సాగు ద్వారా అధిక దిగుబడితో పాటు దీర్ఘకాలంపాటు అధిక ఆదాయాన్ని పొందవచ్చని, పంట సాగుకు రైతులు ముందుకు రావాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ఆయిల్ పామ్ సాగు, ఫెర్టిలైజర్ యాప్, వ్యవసాయ యాంత్రీకీకరణ, రైతుల వివరాల నమోదు, క్రాప్ బుకింగ్ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం వ్యవసాయ, ఉ ద్యానవన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. జిల్లాలో క్రాప్ బుకింగ్ కోసం ఏఈఓలకు సహాయం అందించేందుకు 165 మంది వాలంటీర్లను నియమిం చామని కలెక్టర్ దృష్టికి జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. క్రాప్ బుకింగ్ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఫార్మర్స్ రిజిస్ట్రీ కింద జిల్లాలోని అందరు రైతుల వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. చనిపోయిన, డబుల్ ఎంట్రీ వివరాలు జాబితాలో లేకుండా పకడ్బందిగా చేయాలని స్పష్టం చేశారు. ఏవోలు, ఏఈవోలు సంయుక్తంగా ఈ ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయ యాంత్రీకీకరణ కింద జిల్లాకు మంజూరు అయిన పరికరాలకు రైతులు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఫెర్టిలైజర్ యాప్ వినియోగం, రైతులకు అందుతున్న సేవలపై మండలాల వారీగా కలెక్టర్ సమీక్ష చేశారు. ప్రతి ఎరువుల షాప్, పీఏసీఎస్, ప్రైవేట్ షాప్స్ వద్ద హెల్ప్ డెస్క్, సహాయకులు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

**ఆయిల్ పామ్ సాగు పెంచాలి**

జిల్లాలోని రైతులకు ఆయిల్ పామ్ సాగుతో అధిక దిగుబడి, లాభాలు తదితర అంశాలు వివరించి సాగు విస్తీర్ణం పెంచేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. త్వరలో 100 ఎకరాల్లో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులను వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు నేరుగా కలిసి మాట్లాడాలని, వారిని క్షేత్ర స్థాయి పర్యటనకు తీసుకువెళ్లాలని ఆదేశించారు. ప్రతి ఏవో, ఏఈవో 10 ఎకరాల చొప్పున ఆయిల్ పామ్ సాగు కు డీడీలు రైతులు చెల్లించేలా చూడాలని సూచించారు. రైతు వేదికల్లో కనీస వసతులు కల్పించాలని జడ్పీ సీఈవో వినోద్ కుమార్ ను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు తదితరులు ఉన్నారు.



# పార్టీలకు అతీతంగా నగరాభివృద్ధి పాటు పడదాం

## - బిఆర్ఎస్ కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం
## - రామగుండం మేయర్ మహంకాళి స్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), ఫిబ్రవరి 26 : పార్టీలకు అతీతంగా నగరాభివృద్ధికి పాటుపడదామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. బిఆర్ఎస్ సభ్యులచే గురువారం మేయర్ ఛాంబర్ లో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి వార్డు సభ్యుడు పని చేయాలని అన్నారు. రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ నగర అభివృద్ధికి అవసరమైన నిధులు తెస్తున్న తరుణంలో ప్రజా సమస్యలు గుర్తించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిద్దామని అన్నారు. సుమారు 800 కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి కొనసాగుతున్నదని అన్నారు. కాగా ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సభ్యులు ఆకారపు రేఖ (51వ డివిజన్), కర్ర పద్మజ (55 వ డివిజన్), తాళ్ల చిన్న రాజయ్య (20వ డివిజన్), దారంగుల కుమార్ (28వ డివిజన్), నిమ్మరాజుల రజిని (29వ డివిజన్), బదావత్ సర్వమ్మ (26వ డివిజన్), బుర్ర శశికళ (15వ డివిజన్), మేకల శారద (60వ డివిజన్) మేకల సమ్మయ్య (58వ డివిజన్), రమ మందల (16వ డివిజన్), శ్యామణి అవుల (6వ డివిజన్) ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పివి రామన్, ఏసిపి శ్రీహరి,టిపిఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.







# అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలి

## - పదో తరగతి విద్యార్థులు చదవాలి.. రాయాలి - కలెక్టర్ గరిమ అగ్రవాల్
## - పీఎంశ్రీ కింద ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ జడ్పీ హై స్కూల్‌లో పనులు,
## - ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26 : పీఎంశ్రీ కింద ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలోని జడ్పీ హై స్కూల్ లో అదనపు తరగతి గదులు, సైన్సు ల్యాబ్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పీఎంశ్రీ కింద బొప్పాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత విద్యాలయంలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు, సైన్సు ల్యాబ్ నిర్మాణ పనులను కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను పరిశీలించి, అధికారులు, కాంట్రాక్టర్ కు పలు సూచనలు చేశారు. పనుల్లో మరింత వేగం పెంచాలని, రానున్న 20 రోజుల్లో పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రస్తుతం విద్యాలయంలో విద్యార్థులు సంఖ్య, ఎన్ని తరగతి గదులు ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అన్ని సబ్జెక్టులు చదవాలి... రాయాలి

అనంతరం పదో తరగతి విద్యార్థుల క్లాసు రూమ్ కు వెళ్లి వారితో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థికి పదో తరగతి కీలకమని తెలిపారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు చదవాలని, సమాధానాలు రాయాలని సూచించారు. ఆ సమాధానాలు మరోసారి సమీక్ష చేసుకొని, ఏమైనా తప్పులు ఉంటే సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలి

ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. బొప్పాపూర్ గ్రామంలో మంద స్వరూప ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటుండగా, కలెక్టర్ పరిశీలించి, లబ్దిదారుతో మాట్లాడారు. నిర్మాణం ఎప్పుడు మొదలు పెట్టారు? రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం అందిందా అని ఆరా తీశారు. మూడు విడుతల్లో కలిపి తనకు మొత్తం రూ. నాలుగు లక్షలు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయని కలెక్టర్ దృష్టికి మంద స్వరూప తీసుకువెళ్లారు. మిగతా నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని లబ్దిదారుకు కలెక్టర్ సూచించారు. తుది దశ పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. కార్యక్రమాల్లో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి అఫ్జల్ బేగం, హౌసింగ్ డీఈ ముజఫర్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ సత్తయ్య, టీజీఈడబ్ల్యూఐడీసీ డీఈ సత్యనారాయణరావు, ఎంఈఓ, ఏఈలు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారుహొ



# కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణి చేసిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, ఫిబ్రవరి 26 : రాష్ట ప్రభుత్వం ఆర్థికంగా లోటులో ఉన్నా ప్రజా సంక్షమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని భద్రాద్రి జిల్లా ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. టేకులపల్లి మండలంలోని ముత్యాలంపాడు ఎక్స్ రోడ్ లోని రైతు వేదికలో గురువారం టేకులపల్లి తహసిల్దార్ వీరభద్రం ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఒక కోటి 45 లక్షలు రూపాయల విలువైన చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుతో పాటు, అన్ని రంగాలలో పురోగతి దిశగా పయనిస్తుందని పేర్కొన్నారు. మండలంలో అనేక రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం చేపట్టగా ఇంకా మిగిలిపోయిన రోడ్లు, బ్రిడ్జిలను త్వరలోనే నిర్మించి మండలాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తా మన్నారు. పేదల కోసం ఆలోచన చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ళు అర్హులందరికి ఇస్తున్నామని, ఏప్రిల్ నెలలో రెండోసారి మరలా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజా ప్రభుత్వ పనితీరుకు సర్పంచ్ ఎన్నికలు, మున్సిపాలిటి ఎన్నికల ఫలితాలే నిదర్శనం అని తెలిపారు. నియోజకవర్గం కేంద్రం ఇల్లందులో ఈనెల 28వ తేదిన జరిగే సంతు సేవాలాల్ జయంతి ముగింపు వేడుకల గోడ పత్రిక ఎమ్మెల్యే ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భుక్యా దేవా నాయక్,నాయకులు ఇది గణేష్, సర్ధార్ మండలంలోని పలు గ్రామల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గోన్నారు.



# సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు బాధ్యత యుతంగా పని చేయాలి

## స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, ఫిబ్రవరి 26 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు బాధ్యత యుతం గా పని చేయాలని స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇరిగేషన్ అంశాల మీద సంబంధిత అధికారులతో కలెక్టర్, శాసనసభ్యులు గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో రివ్యూ నిర్వహించారు

ఈ సందర్భంగా శాసనసభ్యులు కడియం శ్రీహరి మాట్లాడుతూ.... ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ లో... జనగామ జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడం, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానంలో నిలవడం పట్ల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,అధికారులకు శాసనసభ్యులు అభినందనలు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు మండలాల వారీగా మార్క్ అవుట్ ఇచ్చి పనులు ప్రారంభం కానీ, ఇప్పటి వరకు మార్క్ అవుట్ కూడా చేయని ఇండ్ల వివరాలను సేకరించి వాటిపై ఎంపీడివోలు సమీక్షా చేయాలని తెలిపారు. లబ్ధిదారులు వారం రోజులలో పనులు ప్రారంభించేలా.... ఎంపీడివోలు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమంలో ఒక్క ఇల్లు కూడా ల్యాప్స్ కావద్దని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవాలని ఆ దిశగా అధికారులు పని చేయాలని తెలిపారు. ఏప్రిల్ లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు వచ్చే అవకాశం ఉందని మళ్ళీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు అవుతాయాని అన్నారు. మెదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు సొంత స్థలం ఉన్న వారికి మాత్రమే ఇచ్చామని ఇప్పుడు రెండో విడతలో ఇంటి స్థలం లేని వారికీ ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు కూడా ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. తహసీల్దార్లు మండలంలోని ఏ ఏ గ్రామాలలో ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందో, ఇళ్ల నిర్మాణం కోసం భూ సేకరణ జరిగిందో ఆ వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఉన్న స్థలంలో ఇప్పుడు ఉన్న నిబంధనల ప్రకారం ఒక ఎకరంలో ఎంత మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వవచో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిబంధనల ప్రకారం లే అవుట్ సిద్ధం చేయాలని అన్నారు. మార్చి 15 న ఆర్డివోలు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం ఉంటుందని ఈ సమావేశానికి పూర్తి స్థాయి వివరాలతో హాజరు కావాలని ఆదేశించారు. సాగు నీరు అందక ఒక్క ఎకరం కూడా ఎండిపోవడానికి వీలు లేదని ఒక్క ఎకరం ఎండిన అధికారులదే బాధ్యత అని స్పష్టం చేశారు. గోదావరి లో సరిపడా నీటి లభ్యత ఉంది కాబట్టి మార్చి చివరి వరకు నీటిని లిఫ్టింగ్ చేయాలని తెలిపారు. మార్చి చివరి వరకు కూడా వ్యవసాయానికి నీరు ఇవ్వాల్సి ఉంటుందని కావున రిజర్వాయర్ లలో నీటి నిలువలు తగ్గకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఒకటి, రెండు రోజులు పంపింగ్ లో ఏమైనా సమస్యలు వచ్చినా నీటి విడుదలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు. బొమ్మకూరు కాలువలో పూడికతీత, చెట్ల తొలగింపు పనులను వారం రోజుల్లో పూర్తిచేసి మంగలి బండ తండా వరకు నీరు అందించాలని తెలిపారు. జఫర్ గడ్ మండలం హిమ్మత్ నగర్ వరకు నీరు చేరాలని అందుకు కాలువ పూడిక తీత పనులకు ఎస్ డిఎఫ్ నుండి 5లక్షలు మంజూరు చేస్తానని వెంటనే పనులు ప్రారంభించి వారం రోజుల్లో నీరు అందించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే మనందరి బాధ్యత అని అన్నారు. మనం చేసే పనిలో మనకు సంతృప్తి ఉండాలని ఆ దిశగా పాజిటివ్ గా ఉ ండాలని సూచించారు. చట్ట పరిధిలోకి లోబడి పేద ప్రజలకు ఏ విధంగా సహాయం చేయగలం, గ్రామాలను ఏ విధంగా అభివృద్ధి చేయగలం అని ఆలోచించాలని వెల్లడించారు. ఈజీఎస్ నిధులకు సంబందించిన పనులను మార్చి 21నాటికి పూర్తి చేసి అందుకు సంబందించిన బిల్లులు ప్రభుత్వానికి పంపించాలని అప్పుడే పనులు చేసిన వారికి సకాలంలో బిల్లులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ.... ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం లో అధికారుల పర్యవేక్షణ మరింత మెరుగవ్వలన్నారు మంజూరు అయిన ప్రతీ ఇల్లు నిర్మాణ దశ కి వెళ్లాలన్నారు జనగామ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో జిల్లాను మొదటి స్థానం నిలపడానికి విశేష కృషి చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ లకి శాసనసభ్యులు అభినందన లు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ గా బదిలీ అయిన రిజ్వాన్ భాషా షేక్ ని, అలాగే జిహెచ్ఎంసీకి జోనల్ కమిషనర్‌గా బదిలీ పైన వెళ్తున్న అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ లను శాసనసభ్యులు శాలువాతో సత్కరించి పూల మొక్కను బహుకరించారు.



# కోయగూడెం ఓసితో కిష్టారం గ్రామం నష్టపోతోంది కాపాడండి

## సింగరేణి అధికారులకు గ్రామస్తుల వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, ఫిబ్రవరి 26 : భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఉ పరితల గని (ఓసి) కిష్టారం పంచాయతీలో కిష్టారం గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వారి సమస్యలను పరిష్కరించాలని సింగరేణి ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ కు కిష్టారం గ్రామస్తులతో ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఓ సి.బొగ్గు రవాణాతో రైతుల పంట పొలాలు దుమ్ముతో నిండిపోయి పంటల దిగుబడి తగ్గిపోయి రైతులు నష్టపోతున్నారని, ఓ.సి. వలన నీటి సమస్య వంటి పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, దుమ్ము ధూళి వలన అనారోగ్యాలు ఏర్పడుతున్నాయి అని వాటిని వెంటనే పరిష్కరించి,గ్రామస్థులను ఆదుకోవాలని ఆయన పి ఓ.ను కోరారు.సానుకూలంగా స్పందించిన కేఓసి పిఓ సమస్యలను పరిష్కరిస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కిష్టారం సర్పంచ్ కొర్స రామకృష్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# "మాటలే కాదు... మైదానంలోనే మార్పు!"

## ఇస్నాపూర్ మున్సిపల్ 12వ వార్డులో కిషోర్ రెడ్డి స్పీడ్ యాక్షన్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పటాన్‌చెరు, ఫిబ్రవరి 26 : ఇస్నాపూర్ మున్సిపాలిటీ 12వ వార్డులో మార్పు గాలి వీచుతోంది. చాలాకాలంగా పేరుకుపోయిన సమస్యలకు చెక్ పెట్టేందుకు వార్డు కౌన్సిలర్ మచ్చ కిషోర్ రెడ్డి దూకుడుగా ముందుకు సాగుతున్నారు. "చూస్తూ ఉండడం చాలూ... ఇప్పుడు చేయాల్సిందే!" అన్నట్టుగా కార్యాచరణ మొదలుపెట్టారు.

**సమస్యల మధ్య నుంచి పరిష్కారాల దిశగా**

ప్రముఖ్ నగర్ కాలనీలో చెత్త కుప్పలు, మూసుకుపోయిన డ్రైనేజీలు, నిల్వ మురుగునీరు... ఇవి అక్కడి ప్రజల నిత్య సమస్యలు. వర్షం పడితే పరిస్థితి మరింత దయనీయంగా మారేది. ఈ నేపథ్యంలో కాలనీ వాసుల ఆవేదనను స్వయంగా పరిశీలించిన కిషోర్ రెడ్డి వెంటనే యాక్షన్ ప్లాన్ అమలు చేశారు.అధికారులను, మున్సిపల్ సిబ్బందిని సమన్వయం చేస్తూ క్షేత్రస్థాయిలో పనులు వేగవంతం చేశారు. ఏసీ గదుల్లో సమీక్షలకే పరిమితం కాకుండా, స్వయంగా వీధుల్లోకి వెళ్లి పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు.

**నినాదం కాదు... నిర్వాహణే నమ్మకం**

"చిత్తశుద్ధితో చెత్తశుద్ధి" అనే భావనతో కాలనీలో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. చెత్త తొలగింపు, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు, తాగునీటి సరఫరా సమస్యల పరిష్కారం, వీధి దీపాల మరమ్మత్తులు... ప్రతి అంశంపైనా ప్రత్యేక దృష్టి సారించారు.రోడ్లను పరిశుభ్రంగా మార్చడమే కాకుండా, భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నారు.

# కుమ్మెర ఘటనపై స్పందించిన ఎన్‌హెచ్ఆర్‌సి

## నాలుగు వారాల్లో నివేదిక అందించాలని ఆదేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26 : నాగర్‌కర్నూల్‌లో జరిగిన కుల వివక్ష దాడి , పోలీసుల నిర్లక్ష్యంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఘటనపై నాలుగు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. న్యాయవాది వినోద్ హిందుస్థానీ దాఖలు చేసిన ఫిర్యాదుపై స్పందిం చిన కమిషన్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీకి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై తీసుకున్న చర్యల నివేదికను నాలుగు వారాల్లోగా సమర్పించాలని ఆదేశించింది. ఈనెల 18న కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా చిలుకేశ్వరం చంద్రకళ కుటుంబాన్ని ఆలయంలోకి ప్రవేశాన్ని నిరాకరించడంతో పాటు రెండు నెలల పసికందును ఉద్దేశపూర్వకంగా తొక్కడంతో ఆ శిశువు మరణించింది. నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులు నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపడుతూ న్యాయవాది కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు నాగర్‌కర్నూల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినప్పుడు, నిందితులకు ఉన్న రాజకీయ పలుకుబడి కారణంగా ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడానికి అధికారులు నిరాకరించారని ఆరోపించారు. పోలీసులు రాజ్యాంగ రక్షణలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సైతం ఉల్లంఘించారని కమిషన్ గుర్తించిందన్నారు. నిందితులను అరెస్టు చేయడం, విధి నిర్వహణలో విఫలమైన పోలీసు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, బాధితులకు రక్షణతో పాటు పరిహారం అందించాలని కమిషన్ పేర్కొందని వివరించారు.. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరిగే ప్రక్రియలో రాజకీయ పలుకుబడి అడ్డంకి కాకూడదని నిర్ధారించడానికి కమిషన్ జోక్యం ఒక కీలక ముందడుగు అన్ని వినోద్ హిందుస్థానీ పేర్కొన్నారు




# డిసెంబర్ నాటికి 1937.21 కోట్ల రుణాలు అందించగలిగాం : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 26 : ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యత రంగాలకు 2971.20 కోట్లు రుణాలు అందించడం లక్ష్యం కాగా డిసెంబర్ మాసం నాటికి 1937.21 కోట్ల రుణాలు అందించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడీఓసి కార్యాలయంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా కన్సల్టేటివ్, జిల్లా స్థాయి రివ్యూ కమిటీ మరియు జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కమిటీ సమావేశంలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. మున్సిపల్, గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించేందుకు కార్యాచరణ తయారు చేయాలని సూచించారు. రుణ లక్ష్య సాధనలో మరింత ప్రగతి సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. జిల్లాలో పంట రుణాలు, ఎం.ఎస్.ఎం.ఈ, హౌసింగ్, విద్య, వ్యవసాయ రుణాలను సమీక్షించారు. ప్రభుత్వ పథకాల అమలులో లబ్ధిదారులకు ఎలాంటి జాప్యం లేకుండా రుణాలను అందించాలని అన్నారు. ఆయా బ్యాంకుల్లో పెండింగ్ లో ఉన్న యూనిట్లను బ్యాంకు అధికారులను సంప్రదించి రుణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రికవరీ శాతాన్ని పెంచేందుకు అధికారులు గ్రామ స్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులు బ్యాంకర్లు నీడలా చేయొద్దని అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో పాడి పరిశ్రమకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అదే విధంగా కోళ్ల ఫారాలు నెలకొల్పుకునేందుకు సెరికల్చర్ చేపట్టేందుకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు. ప్రాధాన్యతా రంగాలకు సకాలంలో రుణాలు అందించాలని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. పంట రుణాలు చెల్లించిన రైతులకు తిరిగి రెన్యూవల్ చేయడం లేదని, ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయాన్ని ఆపుతున్నారని అన్నారు. రెన్యూవల్ కాకుండా ఇబ్బందులు పడే 100 మంది రైతులను చూపిస్తానని అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, రుణాలు చెల్లించని వారికి అవగాహన కల్పించి వసూలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కానీ ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు. బ్యాంకర్లు రుణాలు ఇచ్చి పుచ్చుకునే ధోరణితో ప్రజలు, రైతులతో మంచిగా ఉండాలని, అప్పుడే లావాదేవీలు బాగా జరుగుతాయని స్పష్టం చేశారు. మొండి కేసులు వివరాలు నాకు చెప్పండి నేను వసూలు చేసే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. బ్యాంకర్లు రైతులను ఇబ్బంది పెట్టకుండా రిలేషన్ మెయింటైన్ చేయాలని సూచించారు. కొంతమంది బ్యాంకర్ల వల్ల మంచి రైతులు సైతం ఇబ్బంది పడుతున్నారని ... సక్రమంగా చెల్లించని వారు మంచిగా రుణాలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో డైరీ యూనిట్ కు మంచి అవకాశం ఉందని, డైరీ యూనిట్ ఏర్పాటు కు రుణ సదుపాయం కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, ఆర్.బి.ఐ. ఎల్.డి.ఓ యశ్వంత్ సాయి, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, యూబీఐ డిజిఎం, టిజిబి ఆర్ ఎం, ఎల్.డి.ఎం. ఎ.తిరుపతి, జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 26 : విద్యార్థులు క్ర మశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానా లనుఅధిరోహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్ర మ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని అమలు తీరును సమగ్రంగా పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా తనిఖీ చేసి, అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వ హించాలని తెలిపారు.పో షకాహారం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబో మని స్పష్టం చేశారు. వంట సిబ్బందిపరిశుభ్రతనుపాటించడంతోపాటు, ఆహార పదా ర్థాలుతాజావిగాఉండేలా చూడాలని,గడువు ముగిసిన పదార్థాలను వినియోగిం చొద్దని ఆదేశించారు.భోజ నం బావుంది ప్రతి రోజు ఇలానే చేయాలని వంట సిబ్బందినిఅభినందించారు. పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దే శించిన మెనూ ప్రకారం పోష కాహారంఅందించడంతో పాటు,విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తరచుగా పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా సమతుల ఆహారం అందించడంప్రధానలక్ష్యమని పేర్కొన్నారు.విద్యతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని, విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, విద్యార్థులు మంచి అలవాట్లు అలవరచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు.అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, భద్రతా పర మైన చర్యలపై దృష్టి సారించాలని, సీసీ కెమెరాల ఏర్పాటుచేయడంతోపాటు, ప్రహరీ గోడ పైభాగం లో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, పాఠశాల ప్రిన్సిపాల్ జీవర త్నం,పాఠశాల ఉపాధ్యా యులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలి

## - మెదక్ జిల్లా నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, ఫిబ్రవరి 26 :ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. నూతన కలెక్టర్ కలెక్టరేట్ కు చేరుకోగానే జిల్లా అదనపు కలెక్టర్ నగేష్,డిఆర్ ఓ భుజంగ రావు,మెదక్ ఆర్డీవో రమాదేవి పూలమొక్క అందించి స్వాగతం పలికారు. గురువారం మెదక్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ కు జిల్లా అధికారులు పూల మొక్కల తో స్వాగతం పలికి మర్యాదగా కలిశారు.

ఈ సందర్భంగా జిల్లా నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను నెరవేర్చుతూ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానన్నారు. ఇంటర్,పదోతరగతి పరీక్షల గురించి డీఈఓను,ఇంటర్ విద్యార్థిని అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జెడ్పి సీఈఓ ఎల్లయ్య,డిఆర్ఓ భుజంగరావు, జిల్లా అధికారులందరూ పాల్గొన్నారు.

# మహనీయుల స్తూపాభివృద్ధికి నిధులు కేటాయించండి

## 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26 : భువనగిరి పట్టణంలోని మహనీయుల స్తూపం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత – జహంగీర్ కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నూతన చైర్మన్ బాధ్యత స్వీకరణ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం సమర్పించారు. పట్టణంలోని మహనీయుల స్తూపం వద్ద స్థలాలను సుందరీకరణ చేసి, అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని వారు తెలిపారు. ఏప్రిల్ నెలలో వరుసగా జరుగనున్న బాబు జగ్జీవన్ రామ్ జయంతి (ఏప్రిల్ 5), మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి (ఏప్రిల్ 11), డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14) ఉత్సవాలను పురస్కరించుకుని భారీగా కార్యక్రమాలు నిర్వహించనున్నందున స్తూపం పరిసరాలను అభివృద్ధి చేయాలని కోరారు. అదే విధంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసి "అంబేద్కర్ సర్కిల్"గా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ వినతిపై ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించి, అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ బర్రె పూజిత–జహంగీర్ తెలిపారు.

# కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన గరిమ అగ్రవాల్

## శుభాకాంక్షలు తెలియజేసిన అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా అధికారులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 26 : జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో జిల్లా కలెక్టర్ గా గరిమ అగ్రవాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇంచార్జి కలెక్టర్ గా గరిమ అగ్రవాల్ అక్టోబర్ 23 వ తేదీ 2025 న బాధ్యతలు స్వీకరించారు. గరిమ అగ్రవాల్ గారిని కలెక్టర్ గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ కు అర్చకులు ఆశీర్వచనం అందించారు.అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పలువురు జిల్లా అధికారులు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏవో రామ్ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రావణ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం కార్పొరేషన్ మేయర్ ఆత్మీయ సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, ఫిబ్రవరి 26 : రామగుండం కార్పొరేషన్ మేయర్గా పదవి బాధ్యతలు స్వీకరించిన మహంకాళి స్వామికి రామగుండం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈదునూరి హరిప్రసాద్ అనుబంధ సంఘాల నాయకులు గురువారం పట్టు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రామగుండం ఎమ్మెల్యే అభివృద్ధి ప్రదాత మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మనాలి దంపతులు ఆశీస్సులతో నేరుగా పదవి బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా కార్పొరేషన్ 28వ డివిజన్ పక్షాన శుభాకాంక్షలు అందిస్తున్నామని హరి ప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో సాధుల శివ బోరిగం శ్రీనివాస్ ఎండి ఇమ్రాన్ హగ్గు అజయ్ పాకాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ చెరువు భూమి కబ్జా

## మట్టి దందా పై విచారణ ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26 : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వేల్పుపల్లి గ్రామంలోని పెద్దమ్మ చెరువు శిఖం భూమి కబ్జా వ్యవహారం కలకలం రేపుతోంది. సర్వే నంబర్ 80లోని సుమారు 7 ఎకరాల చెరువు భూమిని అక్రమంగా ఆక్రమించి, ఫెన్సింగ్ చేసి మట్టి తవ్వకాలు చేపట్టి విక్రయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై తుర్కపల్లి మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎరుకల వెంకటేష్ గౌడ్ కలెక్టర్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు చేయగా, ఇరిగేషన్ అధికారులు రంగంలోకి దిగారు. గురువారం ఏఈఈ బిక్కు నాయక్, బాల్ నర్సయ్య చెరువును పరిశీలించి మట్టి తవ్వకాలపై వివరాలు సేకరించారు. స్థానికుల సమాచారం మేరకు మట్టి విక్రయాలు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. గతంలోనే 2023లో ఎఫ్‌టీఎల్ పరిధిలోని చెరువు శిఖం భూమిని ఆక్రమించి పొలాలుగా మార్చిన ఘటనపై కేసులు నమోదైనట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ ఆస్తిని కబ్జా చేసి మట్టి దందా కొనసాగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

# నేటి సమాజంలో విద్యతో పాటు క్రీడలు చాలా ముఖ్యం

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, ఫిబ్రవరి 26 : జగిత్యాల పట్టణంలోని ఈషా, గౌతమ స్కూల్ వారి పవర్ ప్లే 2026 స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గురువారం పాల్గొని స్పోర్ట్స్ మీట్ జెండా ఆవిష్కరణ చేసి, స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... నేటి సమాజంలో విద్యతో పాటు క్రీడలు చాలా ముఖ్యం అని అన్నారు. గ్రౌండ్ లో ఆడాల్సిన పిల్లలు ఫోన్ లో గేమ్స్ ఆడుతున్నారని, 16 ఏండ్ల వయసు వరకు పిల్లలకు సోషల్ మీడియా అకౌంట్స్ నిషేధించే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిసిందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడ వైపు ప్రోత్సహించాలని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసం ప్రశాంత కల్పిస్తాయని, పోటీ తత్వం పెంపొందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, కౌన్సిలర్ చీటి లక్ష్మీ నారాయణ, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డా.ఆకుతోట శ్రీనివాస్, కోశాధికారి డా.సుధీర్, నాయకులు కొలగని సత్యం, కరస్పాండెంట్ కంది అన్నపూర్ణ కైలాసం, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

## ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఫిబ్రవరి 26 : మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవనీ ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం నార్సింగి ప్రధాన చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాలన్నారు.ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ తో పాటు సరైన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు.మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు,వాహనదారులకు రోడ్డు భద్రత నియమాల గురించి అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో కానిస్టేబుళ్లు ప్రవీణ్, వెంకటేష్, తదితరులున్నారు.



# మంద కృష్ణన్న పోరాటం

## కర్ల లలితమ్మకు ప్రభుత్వ ఉద్యోగం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సూర్యాపేట, ఫిబ్రవరి 26 : కోదాడ పట్టణానికి చెందిన మాదిగ సామాజిక యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ గురైన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ గత 100 రోజులుగా అనేక దశల వారీగా నడిపిన ఉద్యమం అలాగే రాజ్యాంగ బద్ధంగా ఉన్న అనేక వ్యవస్థలను కదిలించిన ఫలితంగా కర్ల లలితమ్మకి ప్రభుత్వ లభించింది. నేడు కోదాడ రెవిన్యూ డివిజనల్ అధికారి సూర్యనారాయణ, ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ దయానందరాణి, తాహసిల్దార్ వాజిద్ అలీ, కర్ల లలితమ్మకి ఎమ్మార్పీఎస్ నాయకుల సమక్షంలో ఉద్యోగ నియామక పత్రం అందజేశారు. లలితమ్మకి షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖలో ఉద్యోగం ఇవ్వడం జరిగింది. ఉద్యోగ నియామకం పత్రం అందించిన ఉన్నతాధి కారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.గోవిందు నరేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి సూర్యాపేట జిల్లా ఇన్చార్జి ఏపూరి రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ సూర్యాపేట జిల్లా కన్వీనర్, రాష్ట్ర నాయకులు కొండపల్లి ఆంజనేయులు, యలమర్తి రాము, వడ్డేపల్లి కోటేష్ , ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎం ఎస్ ఎఫ్ జిల్లా, మండల అధ్యక్షులు, పట్టణ నాయకులు పాతకోట్ల నాగరాజు, బచ్చలకూరి ప్రసాద్, సిద్దెల శ్రీను, లంజపల్లి శ్రీను, పిడమర్తి చిన్న వెంకట్రావు, మల్లెపంగు సూరి, గుడిపాటి కనకయ్య, కొండపల్లి సూర్య ప్రకాష్, ఆకారపు కొండలు, పందింటి నవీన్ కుమార్, యలమర్తి ఉపేందర్, కర్ల శివ , కర్ల ప్రేమ్ , కర్ల కమల్, దాసరి రవి, కందుకూరి ఉపేందర్, రోహిత్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడపడుచులకు పుట్టింటి సారే అందించిన 13 వార్డ్

## కాంగ్రెస్ కౌన్సిలర్ బొడ్డుపల్లి పరుశరామ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



వనపర్తి, ఫిబ్రవరి, 26 : వనపర్తి పట్టణం రాంనగర్ 13వ వార్డులోని గర్భిణిలకు పుట్టింటి సారే కార్యక్రమం కన్నుల పండుగగా జరిగింది. వార్డులో పురుడు పోసుకున్న ఆడపడుచులకు పౌష్టికాహారం, క్యాల్షియం, ఐరన్ వంటి మందులు సక్రమంగా ఇవ్వాలని అంగన్వాడీ సిబ్బందిని కౌన్సిలర్ కోరడం జరిగింది. కౌన్సిలర్ బొడ్డుపల్లి పరుశరామ్ మాట్లాడుతూ13 వార్డులో ఉన్న ప్రతి ఆడపడుచు మా ఇంటి ఆడపడుచే అన్ని అయన అన్నారు.పురుడు పోసుకున్న పదిమందిహో ఆడపడుచులకు ప్రత్యేకంగా కార్యక్రమం ఏర్పాటు చేసి వారికీ తమ వంతు బాధ్యత గా ఇది ఆడపడుచు పట్ల పుట్టింటివారి ప్రేమను, గౌరవాన్ని, వారికి ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటామనే నమ్మకాన్ని కలిగిస్తూ స్థానిక కౌన్సిలర్.బొడ్డుపల్లి పరశురాం ఆయన సతీమణి మాజీ కౌన్సిలర్ పద్మ పరశురాం పుట్టింటి సారెను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్ సతీమణి సరిత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యం సతీమణి,అంగన్వాడి సూపర్వైజర్ అంగన్వాడి టీచర్ ఆయమ్మ కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఫిబ్రవరి 26 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు 2026–27 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్ లో 4వ తరగతి ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ జిల్లాలో చదువుతున్న ఆసక్తి గల బాలబాలికలు ఫిబ్రవరి 26 నుంచి మార్చి 4, 2026 వరకు [https://tgss.telangana.gov.in](https://tgss.telangana.gov.in) వెబ్‌సైట్‌లో ముందుగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఎంపిక పరీక్షల్లో పాల్గొనవచ్చన్నారు. 4వ తరగతిలో ప్రవేశం కోరుకునే విద్యార్థులు 01-09-2017 నుంచి 31-08-2018 మధ్య జన్మించి ఉండాలన్నారు. మార్చి 13 నుండి 17 వరకు మండల స్థాయి, మార్చి 28 నుండి ఏప్రిల్ 1 వరకు జిల్లా స్థాయి, ఏప్రిల్ 27 నుండి మే 1 వరకు రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహించబడతాయని తెలిపారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల పరుగుపందెం, 6ఇ10 మీటర్ల షటిల్ రన్, మెడిసిన్ బాల్ త్రో, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, ఎత్తు, బరువు తదితర మొత్తం 9 విభాగాల్లో 27 మార్కులకు ఫిజికల్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. వయస్సు ధృవీకరణ పత్రం, 3వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ప్రోగ్రెస్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, 5 ఫోటోలు దరఖాస్తుతో సమర్పించాలని, మరిన్ని వివరాలకు 9704061725, 8008326913, 9640967943 సంప్రదించాలని సూచించారు.

# ప్రకృతి రక్షణ తోనే భవిష్యత్ భద్రం

## ప్రజాకవి డాక్టర్ జయరాజ్, విజ్ఞానదర్శిని వ్యవస్థాపకులు రమేష్




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26 : ప్రకృతి పరిరక్షణతో పాటు వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ప్రజాకవి డాక్టర్ జయరాజు, విజ్ఞాన దర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్ పిలుపునిచ్చారు. గురువారం 'ప్రకృతి రక్షించుకుందాం' నినాదంతో విజ్ఞాన దర్శిని, నెహ్రూ సెంటర్, నేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి విజ్ఞాన యాత్ర యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు, మేధావులు ఘనంగా స్వాగతం పలికారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడారు. ప్రకృతి ధ్వంసం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, శాస్త్ర విజ్ఞానం ద్వారానే మానవ ప్రగతి సాధ్యమని పేర్కొన్నారు. యువత శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని సూచించారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా జీవించే హక్కుతో పాటు ప్రకృతి వనరులపై హక్కును కల్పించిందన్నారు. మూఢనమ్మకాలపై పోరాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడాలని పిలుపునిచ్చారు. ముక్కెర్ల యాదయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బట్టు రామచంద్రయ్య, బర్రె సుదర్శన్, సామ మల్లారెడ్డి, శ్రీనివాస చారి, జిట్ట భాస్కర్ రెడ్డి, కొడారి వెంకటేష్, భాస్కర్ నాయక్, రాజేష్ నాయక్, కొండమడుగు నరసింహ, మాటూరు బాలరాజు, దాసరి పాండు, మాయ కృష్ణ, లావుడియా రాజు, బొల్లు యాదగిరి, గడ్డం వెంకటేష్, ఈర్లపల్లి ముత్యాలు, వనం ఉపేందర్, గంధమల్ల మాతయ్య, సిహెచ్. లక్ష్మి, కొండమడుగు నాగమణి, రాహుల్, బాలయ్య, మల్లేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ పై అవగాహన కార్యక్రమం

## - మద్యం తాగి డ్రైవ్ చేయొద్దు
## - ప్రమాదాల గురై కుటుంబాలను రోడ్డుపాలు చేయొద్దు
## - ఖని వన్ టౌన్ ఎస్సై రమేష్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), ఫిబ్రవరి 26 : రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారుల సురక్షితమైన ప్రయాణం తో గమ్యస్థానాలు చేరాలనే ప్రధాన ఉద్దేశంతో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్ పెక్టర్ ఇంద్రసేన రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై రమేష్, రాజయ్య లు 5 ఇంక్లైన్ లో డ్రంక్ అండ్ డ్రైవింగ్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ. రమేష్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రతి వాహనదారుడు సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రాణనష్టం, ఆర్థిక నష్టం మాత్రమే కాకుండా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని తెలిపారు. "మద్యం తాగితే వాహనం నడపకండి -- సురక్షితంగా ఇంటికి చేరండి" అని ప్రజలకు తెలియజేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజల సహకారం ఉంటేనే ప్రమాదాలను పూర్తిగా నివారించగలమని పోలీసులు సూచించారు.






# తమిళ గాంధీ నల్లకన్ను మరణం తీరనిలోటు

## సిపిఐ నాయకుల నివాళులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి, ఫిబ్రవరి 26 : ప్రముఖ స్వతంత్ర సమరయోధుడు, సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు, 101 సంవత్సరాలు జీవించిన తమిళ గాంధీ నల్ల కన్ను మరణించడం, తమిళ ప్రజలకే కాకుండా దేశంలోని అట్టడుగు వర్గాల వారికి తీరనిలోటని వారి మృతికి జోహార్లు అర్పిస్తూ సిపిఐ కుత్బుల్లాపూర్ మండల ఆధ్వర్యంలో, షాపూర్ నగర్ కార్యాలయం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సమావేశానికి మండలం కార్యదర్శి కె స్వామి అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ, 1925 డిసెంబర్ 26న తమిళనాడులో నిరుపేద కుటుంబంలో జన్మించి అనేక అవమానాలకు గురై తన 17వ ఎటలో సిపిఐ సభ్యత్వాన్ని తీసుకొని స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని సుమారు 7 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి విడుదలై ,ప్రజల కోసమే నిత్యం పోరాటం చేశారని దానికి గుర్తింపుగా తమిళనాడులో ప్రజలు వారిని తమిళ గాంధీ గా పిలుచుకుంటారని అన్నారు. అంతేకాకుండా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అందరూ నల్ల కన్ను ని ఎంతో గౌరవించేవారు అని, ముఖ్యంగా కరుణానిధి నల్ల కన్నును తన కన్నుగా అభివర్ణించారని, అదేవిధంగా స్టాలిన్ నల్లకన్ను ని ముఖ్యమంత్రి అయ్యాక ఆశీర్వాదం తీసుకున్నారని, ఇలా తమిళ ప్రజలు మొత్తం నల్ల కన్ను ని ఒక గొప్ప నాయకుడిగా భావించే వారిని కానీ వారు నేడు అనారోగ్య కారణాలతో చనిపోవడం తమిళ ప్రజలకు, ముఖ్యంగా అట్టడుగు వర్గాల ప్రజలకు తీరని లోటని అన్నారు. జీవించి ఉన్నప్పుడే కాకుండా మరణించాక కూడా వారి మృతదేహాన్ని వైద్య విద్యార్థుల శిక్షణ కోసం గవర్నమెంట్ మెడికల్ హాస్పిటల్ కి రాసి ఇచ్చి, మరణాంతరం కూడా ప్రజల కోసమే జీవించిన వ్యక్తి అని కొనియాడారు. అలాంటి వారు నడిచిన మార్గంలో సిపిఐ కార్యకర్తలు నడిచి వారు కలలు కన్నా సమ సమాజం కొరకు పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలిలు ఘటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, మండల కార్యదర్శి కే స్వామి, సహాయ కార్యదర్శులు వి హరినాథ్ రావు, డి రాములు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు, యువజన సమైక్య అధ్యక్షులు సంతోష్, సిపిఐ మండల నాయకులు నరసింహ రెడ్డి, మహేందర్, శ్రీనివాస్, భీమేష్, గుర్రప్ప తదితరులు పాల్గొనడం జరిగింది.

# సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత-సంతోష్ తూర్పు నిర్మల జగ్గారెడ్డిని సన్మానించిన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం సభ్యులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సంగారెడ్డి, ఫిబ్రవరి 26 : సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్‌గా నూతన ఎన్నికైన సందర్భంగా చైర్ పర్సన్ నివాసంకి టిజిఐఐసి చైర్ పర్సన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డితో పాటు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం సభ్యులు, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పార్వతి నరసింహులు మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్ప గుచ్చాలు ఇచ్చి పురపాలక సంఘం నూతన కొలువుతీరిన కూన వనిత సంతోష్, తూర్పు నిర్మల జగ్గారెడ్డిలను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్వతి నర్సింలు మాట్లాడుతూ సంగారెడ్డి, సదాశివపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల సామర్థ్యాన్ని గుర్తించి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి బలపరిచిన అభ్యర్థులందరూ రెండు మున్సిపాలిటీలు కైవసం చేసుకోవడం జరిగిందనని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం గెలిపించినందుకు ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ గెలుపు కోసం పూర్తి బాధ్యత వహించిన టిజిఐఐసీ తూర్పు నిర్మల జగ్గారెడ్డి, మండల ఇన్చార్జి, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కష్ట ఫలితమేనన్నారు. రెండు మున్సిపాలిటీలను కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ముందే తేల్చి చెప్పిన పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి అలాగే ఇచ్చిన మాట ప్రకారంగా కాంగ్రెస్ పార్టీ ఏజెండాపై గెలుపొందిన అభ్యర్థులందరికీ ఒక్కొక్క వాడికి 8 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వంచే మంజూరు చేయిస్తానని మాట ఇచ్చిన సంగతి సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలందరికీ తెలిసిన విషయమేనని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జనరల్ సెక్రెటరీ పార్వతి నర్సింలు గుర్తు చేశారు. సంగారెడ్డి పట్టణములో పాత బస్తీలని గత పాలకులు పట్టించుకోక అభివృద్ధి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా కొలువుతీరిన వార్డు కౌన్సిలర్లు, చైర్ పర్సన్‌తో చర్చించి సూచనలు సలహాలు ఇస్తూ అవసరమైతే పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, తూర్పు నిర్మల జగ్గారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి రవి, కౌన్సిలర్లతో కలిపి ప్రతి వార్డు మాసానికి కనీసం ఐదు సార్లు వార్డు ప్రజల సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆయన అన్నారు. ప్రతి వార్డ్ కౌన్సిలర్లు, చైర్ పర్సన్ వనిత సంతోష్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సంగారెడ్డి పట్టణం రాష్ట్రంలోనే అభివృద్ధి బాటలో ముందుండాలని సూచించారు." సంగారెడ్డి అంటే జగ్గారెడ్డి " జగ్గారెడ్డి అంటే సంగారెడ్డి " కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరూ ఇచ్చిన మాట ప్రకారం నిధులు ఇప్పించే బాధ్యత నా వంతు అని జగ్గారెడ్డి మాట ఇచ్చారు. సంగారెడ్డి పట్టణాన్ని తీర్చిదిద్దే బాధ్యత వారికే వదిలేసారని మరొక్కసారి గుర్తుచేసిన పార్వతి నరసింహులు తమ అభిప్రాయాన్ని తెలియపరిచారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల, పట్టణ ప్రజలకు, మరొక్కసారి పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, శ్రీమతితూర్పు నిర్మల జగ్గారెడ్డి అభిమానులకు గెలుపొందిన కౌన్సిలర్లకు, మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనిత సంతోష్ గారికి నా హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# టేకులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా సామూహిక శ్రీమంతాలు

## చిన్నారులకు అక్షరాభ్యాసం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



టేకులపల్లి, ఫిబ్రవరి 26 : భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండల కేంద్ర గ్రామ పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రం వేదికగా గురువారం మాతృత్వానికి గౌరవం, విద్యా వికాసానికి ప్రాధాన్యతనిస్తూ ఒక అద్భుతమైన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బోడ బాలు నాయక్, సెక్టార్ సూపర్వైజర్ కె.అనురాధ ఆధ్వర్యంలో ఆరుగురు గర్భిణీ స్త్రీలకు వైభవంగా సామూహిక శ్రీమంతాలు, ఐదుగురు చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మాతృత్వానికి మంగళ హారతులు పడుతూ శ్రీమంతాల వేదికపై ఆరుగురు గర్భిణీలకు సాంప్రదాయబద్ధంగా గాజులు తొడిగి,పసుపు కుంకుమలు ఇచ్చి,పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ కె.అనురాధ మాట్లాడుతూ..గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పథకాలపై అవగాహన కల్పించారు. విద్యకు తొలి అడుగు అయినా అక్షరాభ్యాసన్ని పాఠశాల వయస్సు వచ్చిన ఐదుగురు చిన్నారులకు సర్పంచ్ బాలు, హెడ్ మాస్టర్ సమక్షంలో అక్షరాభ్యాసం చేయించారు. చిన్నారుల చేత పలకపై ఓనమాలు దిద్దించి, విద్యా రంగంలో వారు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి అంటే రోడ్లు,డ్రైనేజీలు మాత్రమే కాదని టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్ అన్నారు. అంగన్వాడి కేంద్రంలో జరిగిన శ్రీమంతాలు, చిన్నారుల అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ అభివృద్ధి అంటే కేవలం రోడ్లు,డ్రైనేజీలే అభివృద్ధి పరచటమే కాదని, గ్రామంలోని తల్లులు, పిల్లల ఆరోగ్యం మరియు చదువు కూడా అభివృద్ధిలో భాగమేనని అన్నారు. ప్రధానమంత్రి మాతృ వందన యోజన ద్వారా మొదటిసారి గర్భం దాల్చిన మహిళలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం గురించి వివరించారు. అలాగే పోషణ్ అభియాన్ కింద అందిస్తున్న పౌష్టికాహార ప్రాముఖ్యతను, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లి, శిశు ఆరోగ్య కిట్ (కెసిఆర్ కిట్) ప్రాముఖ్యతను, గర్భిణీలకు అందించే ఆర్థిక భరోసాను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న "ఆరోగ్య లక్ష్మి" పథకం కింద గర్భిణీలకు మరియు బాలింతలకు అందించే పౌష్టికాహారం, పాలు, గుడ్లను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. అంతేకాకుండా చిన్నారులకు వేయాల్సిన టీకాలు, మిషన్ ఇంద్రధనుస్సు వంటి కార్యక్రమాల ద్వారా బిడ్డ ఆరోగ్యానికి ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ గురించి అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యక్రమాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నిర్వహించడం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, పాఠశాల హెడ్ మాస్టర్, అంగనవాడి టీచర్లు భద్రమ్మ, పద్మ, ఇందిరమ్మ, ఆశా కార్యకర్త మజహరి ,గర్భిణీ స్త్రీల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.






# సేవ, సమానత్వమే సేవాలాల్ సందేశం

## భువనగిరి ఎమ్మెల్యే కుంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26 : సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు భువనగిరి పట్టణంలోని రావి భద్రా రెడ్డి గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై మాట్లాడారు. శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ బోధించిన సేవాభావం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను అందరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ ఆవేజ్ చిస్తీ, మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబు రావు, వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్, మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్, ఆర్డీవో కృష్ణారెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి, ఎంఆర్ఓ అంజిరెడ్డి, బంజారా గాయకుడు బిక్షు నాయక్ పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బానోత్ నర్సింహా నాయక్ ఆధ్వర్యంలో రాములు నాయక్, రమేష్ నాయక్ తదితరులు ఏర్పాట్లు నిర్వహించారు.

# సత్తుపల్లి నియోజకవర్గం కందుకూరులో ఉచిత వైద్య శిబిరం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సత్తుపల్లి, ఫిబ్రవరి 26 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో, సాయి రామ్ హాస్పిటల్స్ వారి సహకారంతో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాటాడుతూ గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, వారికి మెరుగైన వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. శిబిరానికి వచ్చిన రోగులకు సాధారణ పరీక్షలతో పాటు రక్తపోటు (బీపీ), చక్కెర వ్యాధి (షుగర్) పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యులు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొల్ల ప్రభాకర్ రెడ్డి, వార్డ్ నెంబర్లు పంచాయతీ కార్యదర్శి పి.సునీత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.




# మౌనిక హంతకులను కఠినంగా శిక్షించాలి

## జగతగిరిగుట్టలో కోవత్తుల ర్యాలీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి, ఫిబ్రవరి 26 : నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మేర గ్రామంలో మల్లన్న జాతరలో చాకలి కుటుంబానికి చెందిన వారు గుడిలోకి వచ్చి ఇచ్చిన డబ్బులకు రసీదు అడిగితే మమ్మలనే అడుగుతారా అని దాడి చేసి 2 నెలల పాపం మౌనిక మరణానికి కారణమయ్యారని దానికి కారణమైన వారిని నేటి వరకు అరెస్ట్ చెయ్యకపోవడం దారుణమని అన్నారు. కుల దూరహంకారంతో రెచ్చిపోవడం అనాగారికమని, రేవంత్ రెడ్డి బీసీ బంధువు అని చెప్పి ప్రగల్బాలు పల్కడం తప్ప నిజాం కాదని దానిని నిరూపించుకోవాలంటే వెంటనే అరెస్ట్ చేసి జైలు కు పంపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి రజక సంఘం నాయకులు విట్టల్ నాయకత్వం వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,సీనియర్ నాయకులు ఏసురత్నం,రజక సంఘం నాయకులు భాస్కర్, నాగరాజు, చంద్రిమౌళి, సత్యనారాయణ, రాజు, శ్రీనివాస్ సతీష్ మండల సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు, ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబులు పాల్గొన్నారు.




# భువనగిరి అభివృద్ధికి కొత్త ఆరంభం...

## - ఎస్ఎస్ఏ ఫౌండేషన్ చైర్మన్ ఎస్ఎస్ సాయి
## - చైర్మన్‌కు ఘన సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26 : భువనగిరి పురపాలక సంఘం చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్‌కు ఎస్ఎస్ఏ ఫౌండేషన్ చైర్మన్ ఎస్ఎస్ సాయి గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ ఎన్నో రోజులుగా ఎదురుచూసిన ఈ క్షణం నెరవేరడం ఆనందదాయకమన్నారు. భువనగిరి పట్టణంలోని 35 వార్డులు సమగ్ర అభివృద్ధి సాధించాలని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశయాలను నెరవేర్చేలా నూతన చైర్మన్ కృషి చేస్తారనే విశ్వాసం వ్యక్తం చేశారు. పట్టణ అభివృద్ధిలో పారదర్శకత, సేవాభావం ప్రధానంగా ఉండాలని, ప్రతి వార్డు అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించే పాలన అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుర్వి సంపత్ కుమార్ తదితర నాయకులు పాల్గొని చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# వీరస్వామి కుటుంబానికి ఆర్థిక సహకారం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సూర్యాపేట, ఫిబ్రవరి 26 : కామ్రేడ్ కాసాని వీరాస్వామి ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలిసిందే, పెద్దకర్మ శుక్రవారం 27 వ తారీఖున జరుగనుంది, ఈ కార్యక్రమానికి నడిగూడెం మండలం బృందావనపురం సిపిఎం గ్రామ శాఖ తరపున 5000 రూపాయలు మృతుడు వీరాస్వామి కుటుంబానికి చేయూతగా పార్టీ ఆలోచన చేసి ఇవ్వడం జరిగిందని సిపిఎం మండల కార్యదర్శి బెల్లకొండ సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్ లు తెలిపారు, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం కుటుంబానికి ఎంతో కొంత ఆర్థిక భారం తగ్గించినట్లు ఉంటుందని, పార్టీ పెద్దల నిర్ణయం అభినంద నీయమని పలువురు అభినందించారు.



# అందరం కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం

**- కలెక్టర్‌ను కలిసి వెల్కమ్ చెప్పిన జర్నలిస్టులు**

**- శాలువాతో సన్మానించి పూల మొక్కతో స్వాగతం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఫిబ్రవరి 26 : మీడియా ప్రతినిధులు,జిల్లా అభివృద్ధికి సహకరించాలని, మనం అందరం కలిసి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు.కలెక్టర్ ఛాంబర్ లో తనను కలసిన మెదక్ జర్నలిస్టులతో కలెక్టర్ ప్రతిమా సింగ్ కొద్ది సేపు మాట్లాడారు.జిల్లా సబ్ కలెక్టర్ గా ఇక్కడ పనిచేసిన అనుభవం తో జిల్లా అధికారుల టీం వర్క్ తో జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా ఉంచుతా నాని దీమావ్యక్తం చేశారు. సమస్యలు ఉంటే నేరుగా తనదృష్టికి తీసుకురావాలని జర్నలిస్టులను కలెక్టర్ కోరారు. జర్నలిస్టులు శాలువాతో సన్మానించి,పూల మొక్కతో స్వాగతం పలికారు. జర్నలిస్టులు, కంది శ్రీనివాస్ రెడ్డి,నాగరాజు, రాజశేఖర్,సురేందర్ రెడ్డి, ఊశయ్య,తదితరులు పాల్గొన్నారు.

# జనగామ జిల్లా నూతన కలెక్టర్‌గా సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా కలెక్టర్‌గా సందీప్ కుమార్ ఝా బాధ్యతల స్వీకరణ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామా, ఫిబ్రవరి 26 : జనగామ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రిజ్వాన్ బాషా షేక్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ, కుత్బుల్లాపూర్, జోనల్ కమిషనర్ (2014 కేడర్ ఐఏఎస్ అధికారి) సందీప్ కుమార్ ఝా నూతన కలెక్టర్‌గా నియమితులయ్యారు. జనగామ జిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝా గురువారం మధ్యాహ్నం బాధ్యతలను స్వీకరించారు

# హైదరాబాద్ షాపింగ్ మాల్‌లో అగ్నిప్రమాదం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 26 : జూబ్లీహిల్స్‌లోని మంగళగౌరి షాపింగ్ మాల్‌లో గురువారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. సకాలంలో ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పింది. ఈ విషయంపై హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ రాందాస్ మాట్లాడారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై ఇంకా నిర్ధారణకు రాలేదని చెప్పుకొచ్చారు. బిల్డింగ్ లోపల రెన్యువేషన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రమాద సమయంలో షాపులో సిబ్బంది ఎవరూ లేరని స్పష్టం చేశారు. రెన్యువేషన్ పనులు జరుగుతుండటంతో మెటీరియల్స్ వేరే ప్రాంతానికి తరలించారని తెలిపారు. ఈ ఘటన షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా..?, లేక వెల్డింగ్ పనుల జరిగిందా.. అనే విషయం దర్యాప్తులో తేలాల్సి ఉందని అన్నారు. ఈ ఘటన సమయంలో ఐదుగురు మాత్రమే షాపులో ఉన్నారని.. అంతా సురక్షితంగా బయటపడ్డారని పేర్కొన్నారు. షాపులో మెటీరియల్ లేకపోవడంతో ప్రమాద తీవ్రత తక్కువగా ఉందని చెప్పారు. అగ్ని ప్రమాదంపై దర్యాప్తు జరుగుతోందని అన్నారు. వేసవి సమీపించింది కాబట్టి అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. షాపుల్లో ఫైర్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని రాందాస్ ఆదేశించారు.

# గిరిజన కళపై ఐదు రోజుల శిక్షణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 26 : గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ సూచనల మేరకు గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా వినూత్నంగా 20 మంది క్రాఫ్ట్ టీచర్స్ మరియు 10 మంది గిరిజన ఆర్టిజన్స్ మొత్తం 30 మందికి గిరిజన సంప్రదాయక కళల పైన ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ అనే అంశంపై ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాదులో 26వ తేదీ నుండి 2 మార్చ్ వరకు నిర్వహిస్తున్నారు.శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులు ఐటిడిఏ ఉట్నూర్, ఎటునాగారం, భద్రాచలం, ప్లెయిన్ ఏరియా నుండి సంబంధిత ఐటిడిఏ అధికారుల ద్వారా నామినేట్ చేయబడి రావడం జరిగింది. వీరందరికీ భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా పదిమంది గిరిజన ఆర్టిజన్స్ కు ప్రతిరోజు వెయ్యి రూపాయల చొప్పున ఆనరోరియం కూడా ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో టిఆర్ఐ సంచాలకులు డాక్టర్ వి సముజ్వల, టిఆర్ఐ సంగ్రహాలయ సంరక్షకులు డాక్టర్ డి.సత్యనారాయణ, శిక్షణనిస్తున్న డైరెక్టర్ డా.సునీతా ప్రసాద్ బృందం, ట్రైనింగ్ కోఆర్డినేటర్ శ్రీమతి అజ్మీరా శైలజ, టిఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

# అప్పుడు అన్న...ఇప్పుడు చెల్లి

**- స్కూల్‌లో గుండెపోటుతో బాలిక మృతి**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

జయపుర, ఫిబ్రవరి 26 : తొమ్మిదేళ్ల బాలిక స్కూల్‌లో ఆడుకుంటూ కార్డియాక్ అరెస్ట్‌తో కుప్పకూలి పోయింది. రాజస్థాన్‌లో ఈ విషాద కర ఘటన చోటు చేసుకుంది. కార్డియాక్ అరెస్ట్ కారణంగానే ఆ బాలిక చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మరో విషాదకర విషయం ఏంటంటే.. ఆ బాలిక అన్న కూడా కొన్ని నెలల కిందట కార్డియాక్ అరెస్ట్ కారణంగానే ప్రాణాలు కోల్పోయాడు. రాజస్థాన్ లోని నాగౌర్ జిల్లాకు చెందిన రాజేంద్ర బపేడియా అనే వ్యక్తి తొమ్మిదేళ్ల కూతురు దివ్య స్థానికంగా ఉన్న ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతోంది. ఈనెల 23వ తేదీన ఎప్పటి లాగానే దివ్య స్కూల్‌కు వచ్చింది. ఉదయం ప్రేయర్ సమయానికి ముందు తోటి పిల్లలతో కలిసి స్కూల్ గ్రౌండ్‌లో ఆడుకుంది. ఆ సమయంలో ఉన్నట్టుండి దివ్య కుప్పకూలిపోయింది. పాఠశాల సిబ్బంది వెంటనే ఆ బాలికను హాస్పిటల్‌కు తరలించారు. హాస్పిట ల్‌కు తీసుకెళ్లే సమయానికే ఆ బాలిక ప్రాణాలు కోల్పోయింది . బాలిక శరీరంపై ఎలాంటి గాయాలూ లేవు. దీంతో ఆ బాలిక కార్డియాక్ అరెస్ట్ కారణంగానే చనిపోయి ఉంటుందని వైద్యులు తెలిపారు. దివ్య అన్న అభిషేక్ కూడా కొన్ని నెలల కిందట ఇంట్లో ఆడుకుంటూ కుప్పకూలిపోయాడు. హాస్పిటల్‌కు తీసుకెళ్లే సరికే ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా దివ్య కూడా అదే తరహాలో ప్రాణాలు కోల్పోయింది. నెలల వ్యవధిలోనే రాజేంద్ర కుటుంబం ఇద్దరు పిల్లలనూ కోల్పోవడం విషాదకరం.

# కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి కృపా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలి

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి, ఫిబ్రవరి 26: కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి కృపా కటాక్షాలు భక్తులందరిపై ఉండాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీవారి "పంచదశ" (15వ) వార్షిక బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ముఖ్య అతిథిగా హాజరై వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆపదలను తొలగిస్తూ కొలిచిన వారి కొంగు బంగారం గా నిలుస్తున్న కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కరుణా కటాక్షాలు భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు తిరుమల రావు, ప్రధాన



కార్యదర్శి మాధవరెడ్డి, కోశాధికారి రామాచారి, సభ్యులు ఎస్.వెంకటేశం, కొండా మురళి, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, స్థానిక నాయకులు నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, విజయ్ హరీష్, బాల మల్లేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో సూర్య భగవాన వాహన సేవ

**ఊరేగింపును ప్రారంభించిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

భూపాలపల్లి/రేగొండ, ఫిబ్రవరి 26 : భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కొడవటంచ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నిర్వహించిన సూర్య భగవాన వాహన సేవ ఊరేగింపు ఘనంగా జరిగింది. గురువారం జరిగిన ఈ వాహన సేవ ఊరేగింపు కార్యక్రమాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఈరోజు నుండి కొడవటంచ జాతర బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు". జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. అనంతరం ఆర్య వైశ్యులు ఏర్పాటు చేసిన వాసవి ఆర్య వైశ్య నిత్యాన్న సత్రంను ప్రారంభించి భక్తులకు అన్నదానం సేవలు ప్రారంభించారు. తదుపరి రాయపల్లి గ్రామంలో బత్తిన అనిత గారికి చెందిన నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుతోజ్ కిష్టయ్య, కొడవటంచ ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావు, మండల అధ్యక్షులు ఎప్పకాయల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

**టేకుమట్లలో నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజ:**

టేకుమట్ల మండలం కేంద్రంలో భక్తుల ఆధ్యాత్మిక ఆకాంక్షలను నెరవేర్చే దిశగా శ్రీ శివ రామాంజనేయ స్వామి నూతన ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయ నిర్మాణం గ్రామ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ ఆలయానికి 30 లక్షల రూపాయల నిధులు మంజూరి చేయిస్తానని హామీ ఇచ్చారు. దేవాలయ అభివృద్ధికి తాము సంపూర్ణ సహకారం అందిస్తామని కూడా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గడువుతో నిమిత్తం లేకుండా రిటైర్డ్ సింగరేణి కార్మికులకు వైద్య సౌకర్యం కల్పించాలి

**సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోషియేషన్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 26 : సింగరేణి సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన నాన్-ఎగ్జిక్యూటివ్ కార్మికులకు ఎటువంటి కట్-ఆఫ్ తేదీ నిబంధన లేకుండా కంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీమ్ (సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ)లో చేరే అవకాశం కల్పించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోషియేషన్ కోరింది. ఈ మేరకు కోల్ ఇండియా లిమిటెడ్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ విషయమై అసోసియేషన్ అధ్యక్షులు డి. రామచందర్ రావు గురువారం కోల్ ఇండియా చైర్మన్‌కు లేఖ రాశారు. ఆ లేఖలో రిటైర్డ్ నాన్-ఎగ్జిక్యూటివ్ కార్మికులకు సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ లో చేరేందుకు గడువు నిబంధనలను సడలించాలని కోరారు.

**అవగాహన లేక కోల్పోయిన అవకాశం:**

1990కు ముందు సింగరేణిలో చేరిన మెజారిటీ కార్మికులకు సంస్థ అందించే వైద్య పథకాలపై సరైన అవగాహన లేదని అసోసియేషన్ పేర్కొంది. అనారోగ్య పరిస్థితుల్లో వారు కార్మిక సంఘాలు లేదా స్థానిక అధికారులను మాత్రమే ఆశ్రయించారని, శాశ్వత వైద్య పథకాలపై సమాచారం లేక అవకాశాన్ని కోల్పోయారని తెలిపింది.

**వివక్ష తొలగించాలని డిమాండ్:**

రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ అధికారులకు వారి సౌలభ్యం ప్రకారం ఎప్పుడైనా మెడికల్ స్కీమ్‌లో చేరే వెసులుబాటు (సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ) ఉన్నప్పుడు, అదే తరహా సౌలభ్యాన్ని నాన్-ఎగ్జిక్యూటివ్ కార్మికులకు కూడా కల్పించాలని అసోషియేషన్ డిమాండ్ చేసింది. కేవలం గడువు ముగిసిందనే కారణంతో వేలాది కార్మికులను ఈ పథకానికి దూరం చేయడం సరికాదని అభిప్రాయపడింది.

**మానవీయ కోణంలో నిర్ణయం తీసుకోవాలి:**

పదవీ విరమణ అనంతరం కార్మికులకు అందే పెన్షన్ స్వల్పమని, వృద్ధాప్యంలో పెరిగే వైద్య ఖర్చులను భరించడం వారికి భారంగా మారిందని అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. మానవీయ కోణంలో ఆలోచించి, కార్మికుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని సిపిఆర్ఎంఎస్-ఎన్ఈ లో చేరేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది. ఈ లేఖ ప్రతిని కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శికి, సింగరేణి సంస్థ సీఎండీకి, అలాగే డైరెక్టర్ (పా)కు కూడా పంపినట్లు అసోషియేషన్ ప్రతినిధులు తెలిపారు.

# భవన నిర్మాణ కార్మికులకు శుభవార్త

**ఎన్.ఏ.సి. ఆధ్వర్యంలో శిక్షణ, పరీక్షలు-సర్టిఫికేషన్**

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)

భూపాలపల్లి, ఫిబ్రవరి 26 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్థాపించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసి) ఆధ్వర్యంలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు శుభవార్త వెలువడింది. నైపుణ్యం ఉన్నప్పటికీ అధికారిక గుర్తింపు పత్రాలు లేని కార్మికుల కోసం రికగ్నైజేషన్ ఆఫ్ ప్రియర్ లర్నింగ్ (ఆర్.పి.ఎల్.) పథకం కింద ఒక్క రోజు ప్రత్యేక శిక్షణ, పరీక్షలు నిర్వహించి సర్టిఫికేట్లు అందించనున్నట్లు ఎన్ఏసి జయశంకర్-భూపాలపల్లి జిల్లా భాద్యులు డి.గోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకునే వారు 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి, సంబంధిత పనిలో కనీస అనుభవం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు మార్చి 6, 2026న అధికారికంగా సర్టిఫికేట్లు ప్రధానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రిషియన్, ప్లంబర్ (జనరల్), మేషనరీ (మేస్త్రీ పని), టైల్ మేషనరీ, పెయింటింగ్ అండ్ డెకరేషన్, బార్ బెండింగ్ అండ్ స్టీల్ ఫిక్సింగ్ విభాగాలలో శిక్షణ అందించి సర్టిఫికేషన్ చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. ఆసక్తి, అనుభవం కలవారు రూ.1200 రుసుముతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్



ఫోటోలు, పని అనుభవానికి సంబంధించిన పత్రాలను 5 మార్చి, 2026 లోపు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం భూపాలపల్లి జయశంకర్ విగ్రహం సమీపంలోని సింగరేణి ఏరియా వర్క్ షాప్ దారిలో ఉన్న సింగరేణి నైపుణ్యాభివృద్ధి కేంద్రం కార్యాలయంలో సంప్రదించవచ్చని, అలాగే వివరాల కోసం 99496 84763, 99890 47306 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని భవన నిర్మాణ కార్మికులు తమ నైపుణ్యానికి అధికారిక గుర్తింపు పొందాలని ఆయన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# ఇంటర్మీడియట్ ద్వితీయ భాషా పరీక్ష ప్రశాంతంగా నిర్వహణ

**భద్రాద్రి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఫిబ్రవరి 26 : భద్రాద్రి జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు-మార్చి 2026లో భాగంగా గురువారం నిర్వహించిన ద్వితీయ భాషా (తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, జీఎఫ్‌సీ) థియరీ పరీక్ష ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించబడినట్లు భద్రాద్రి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. భద్రాద్రి జిల్లాలో మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా సాధారణ విభాగంలో 6,743 మంది, వృత్తి విద్యా విభాగంలో 1,895 మంది విద్యార్థులు కలిపి మొత్తం 8,638 మంది విద్యార్థులకు ఉండగా, అందులో సాధారణ విభాగంలో 6,622 మంది, వృత్తి విద్యా విభాగంలో 1,822 మంది కలిపి మొత్తం 8,444 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు వెల్లడించారు. సాధారణ విభాగంలో 121 మంది, వృత్తి విద్యా విభాగంలో 73 మంది కలిపి మొత్తం 194 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. ఒక మాల్ ప్రాక్టీస్ కేసు భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నమోదు చేయబడినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు, తదుపరి రోజు పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి తెలిపారు. ప్రశ్నాపత్రాల భద్రత, సీసీ కెమెరా పర్యవేక్షణ, పోలీసు బందోబస్తు, ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు క్రమబద్ధంగా నిర్వహించబడినట్లు తెలిపారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన డాక్టర్ మట్టా దయానంద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, ఫిబ్రవరి 26 : ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజక వర్గం వేంసూరుమండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో గురు వారం నిర్వహించిన నిశ్చితార్థ వేడుక సందడిగా సాగింది. గ్రామానికి చెందిన ఏసు వెంకటేశ్వరరావు కుమార్తె నిశ్చితార్థ మహోత్సవానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులను ఆయన పుష్పగుచ్ఛం అందించి, ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మట్టాతో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు పుచ్చకాయల సోమి రెడ్డి, జంగా శ్రీనివాస్ రెడ్డి, వేంసూరు మండల కాంగ్రెస్ నాయకులు, వెంకటాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




# ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు

**తొక్కాపురం గ్రామాభివృద్ధికి సేవా జ్యోతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 26 : భువనగిరి లక్ష్మీనరసింహ స్వామి కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం-1 ఆధ్వర్యంలో నిర్వహించిన శీతాకాల ప్రత్యేక శిబిరం 7వ రోజు ముగింపు కార్యక్రమం భువనగిరి మండలం తొక్కాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తొక్కాపురం గ్రామ సర్పంచ్ జనగాం పాండు మాట్లాడుతూ తమ గ్రామాన్ని శిబిరానికి ఎంపిక చేయడం ఆనందదాయకమని తెలిపారు. వారంరోజుల పాటు వాలంటీర్లు పచ్చదనం, పరిశుభ్రత, చెట్ల తొలగింపు, వైద్య శిబిరం, రహదారి చెట్లకు రంగులు వేయడం, విద్యా-ఆరోగ్య సర్వేలు వంటి కార్యక్రమాలు చేపట్టి గ్రామాభివృద్ధికి దోహదపడ్డారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాసాల లింగ స్వామి యాదవ్, గ్రామపంచాయతీ కార్యదర్శి లోకేష్, ప్రోగ్రాం అధికారి తోటకూరి రామకృష్ణ, పాలక మండలి సభ్యులు రత్నపురం శ్రీకాంత్, జనగాం మహేష్, కృష్ణవేణి రమేష్, ఎలకొండ దేవేందర్, అలివేలు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎన్ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.



# ఆపదలను తొలగించే దైవం ఆంజనేయస్వామి

**- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మేడ్చల్ మల్కాజిగిరి, ఫిబ్రవరి 26 : గాజుల రామారం డివిజన్ పి.పి.నగర్‌లో నూతనంగా నిర్మించిన సంజీవ ఆంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన, ధ్వజస్తం భన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆపదలను తొలగిస్తూ అభయానిచ్చే దైవం ఆంజనేయస్వామి ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలన్నారు. దేవాలయ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయడానికి కృషి చేసిన ఆలయ కమిటీ సభ్యులకు నా అభినందనలు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్ రావు, పి.శ్రీనివాస్ రెడ్డి, చంద్రకాంత్, వివేక్, వెంకట్ రెడ్డి, భీమేశ్వర్ రావు, బాబా, నాయుడుస్ శ్రవణ్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, ఇమ్రాన్ బేగ్, తెలంగాణ సాయి, సుంకరి చందు, మూసా ఖాన్, చెట్ల వెంకటేష్, దూలప్ప, ఆంజనే యులు, బోయిని మహేష్, రాములు గౌడ్, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, దండుగుల నవీన్, శ్రవణ్, సయ్యద్ రంజాన్, ప్రసాద్, శివా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా

**- ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఇల్లందు, ఫిబ్రవరి 26: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా గడ్డం వెంకటేశ్వర్లు (ఆంధ్రప్రభ), ప్రధాన కార్యదర్శి గా బండి రామారావు (ఐన్యూస్)ను గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన అద్యక్ష కార్యదర్శులును ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు అబినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగం వేణుగోపాల్, గుడివాడ శ్రీనివాస్, దుద్దుకూరి సుమంత్, మాదాసు నర్సి, కసోజుల రాజు, ఎల్. శ్రీనివాస్, దేవి రెడ్డి సువర్ణపాక శోభన్ బాబు, తంగెళ్ళపల్లి శ్రీనివాస్ చారి, మహేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం





## మీ నాలుకపై ఇలా కనిపిస్తున్నాయా?

## బీ కేర్ ఫుల్..క్యాన్సర్ సంకేతమే!

మనకు ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చి డాక్టర్ దగ్గరకి వెళ్లాక ఫస్ట్ నాలుక చూపించండి అని డాక్టర్ అడగటం మనకు తెలిసిందే. అయితే వేర్వేరు సమస్యలు ఉన్నాయని మీరు డాక్టర్ దగ్గరకి వెళ్లే నాలుక చూపించమంటారేంటబ్బా అని ఎప్పుడైనా ఆలోచించారా? వాస్తవానికి మీ నాలుక మీ ఆరోగ్యానికి అద్దం లాంటిది. నాలుక రంగు, ఆకారం,ఉపరితలంపై కనిపించే మార్పులు కొన్నిసార్లు మీ శరరం లోపల ఏదో తీవ్రమైన వ్యాధి గురించి హెచ్చరించే సంకేతాలు కావచ్చు. డాక్టర్లు తరచుగా మీ నోరు తెరిచి నాలుకను పరిశీలించడం వెనుక దాగిన కారణం ఇదే. మీ నాలుకలో కనిపించే కొన్ని మార్పులు,అవి ఏ ప్రమాదకర వ్యాధులను సూచిస్తాయో ఇప్పుడు చూద్దాం.

నల్లగా,చిన్న వెంటుక్రల్లా కనబడితే కొన్నిసార్లు మన నాలుక మీద నల్లగా,చిన్న చిన్న వెంటుకల్లా కనిపిస్తే కొందరు కంగారు పడిపోతారు. వాస్తవానికి దీనికి కారణం ఏంటంటే మన నాలుక మీద చిన్న చిన్న మొగ్గల్లాంటి నిర్మాణాలుంటాయి. వీటినే పాపిల్లే అంటారు. కొన్ని సమయాల్లో ఈ పాపిల్లేలు ఎక్కువగా పెరిగిపోతాయి. అప్పుడు వాటి మధ్యలో బ్యాక్టీరియా, ఈస్ట్ వంటి సూక్ష్మజీవులు పేరుకుపోతుంటాయి. ఇవే ఆ నలుపు రంగు,వెంట్రుకల వంటి రూపాన్ని కలిగిస్తాయి. దీనికి చాలా కారణాలుంటాయి. అయితే ప్రధానంగా నోటి పరిశుభ్రత సరిగ్గా లేకోవడం వల్లనే ఇలా అవుతుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా స్మోకింగ్ చేసేవారిలో, ఎక్కువ కాలం యాంటీబయాటిక్స్ వాడిన వారిలో లేదా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో కూడా ఇది కనిపించవచ్చు. దీని గురించి ఎక్కువగా భయపడాల్సిన అవసరం లేదని..ఇది సాధారణంగా ప్రమాదకరమైన పరిస్థితి కాదని.. కానీ ఇలా ఉంటే మాత్రం మీ నోటిని మరింత శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఒకసారి డెంటిస్ట్ ని సంప్రదించడం బెటర్. అంతేకాకుండా స్మోకింగ్ చేసేవారిలో, ఎక్కువ కాలం యాంటీబయాటిక్స్ వాడిన వారిలో లేదా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో కూడా ఇది కనిపించవచ్చు. దీని గురించి ఎక్కువగా భయపడాల్సిన అవసరం లేదని..ఇది సాధారణంగా ప్రమాదకరమైన పరిస్థితి కాదని.. కానీ ఇలా ఉంటే మాత్రం మీ నోటిని మరింత శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఒకసారి డెంటిస్ట్ ని సంప్రదించడం బెటర్. ఎర్రగా,ఉబ్బెత్తుగా మచ్చ కనిపిస్తే నాలుక మీద చాలా కాలంగా ఒక ఎర్రటి, నునుపైన లేదా కొద్దిగా ఉబ్బెత్తుగా ఉన్న మచ్చ కనిపిస్తే కొంచెం జాగ్రత్తగా ఉండాలి. దీనిని వైద్య పరిభాషలో 'ఎరిత్రోప్లాకియా' అంటారు. ఇది అంత ప్రమాదకరమైనది కాకపోయినా.. కొన్నిసార్లు ఇది క్యాన్సర్ ప్రారంభ లక్షణం అవొచ్చు. కాబట్టి దీన్ని తేలికగా తీసుకోకూడదు. వెంటనే డాక్టర్‌ను కలవడం చాలా ముఖ్యం. సకాలంలో సరైన ట్రీట్మెంట్ తీసుకుంటే భవిష్యత్తులో వచ్చే పెద్ద ప్రమాదాలను తప్పించుకోవచ్చు.

నునుపుగా,మెరిసేలా కనబడుతుంటే నాలుక మీద నునుపుగా,మెరిసేలా అనిపించవచ్చు. నాలుపై ఉండే చిన్న గరుకుదనం తగ్గిపోయి ఒక విధమైన మెరుపు వస్తుంది. మీ శరీరంలో ఐరన్, ఫోలేట్, విటమిన్ %దీ%12 వంటి ముఖ్యమైన పోషకాల కొరత ఉండొచ్చు. మెడికల్ బాషలో ఈ పరిస్థితిని 'ఆట్రోఫిక్ గ్లోసిటిస్' అంటారు. ఇలా మారిన నాలుక ఎర్రగా, కొద్దిగా బాధాకరంగా కూడా ఉండొచ్చు. అంతేకాకుండా ఇది మీ శరీరంలో అలసట, నాడీ సంబంధిత సమస్యలు లేదా రక్తహీనత వంటి ఇతర ఇబ్బందులు కూడా ఉన్నాయని తెలియజేస్తుంది. కాబట్టి వెంటనే ఇలా కనిపిస్తే డాక్టర్ ని సంప్రదించాలి.

## అమృతాన్ని తలపించే దూద్ దులారి..ఈజీగా ఇలా చేసుకోండి






కడుపులో చాలా చల్లగా,మృదువుగా,చూస్తేనే నోరూరిపోయేలా ఉండే దూద్ దులారి ఎప్పుడైనా తిన్నారా? ఇది పాలతో తయారుచేసే ఒక తీపి వంటకం. బాదం, పిస్తా, కిస్ మిస్ డ్రై ఫ్రూట్స్,పండ్లు దీనికి ప్రత్యేకమైన రుచిని,ఆకర్షణీయతను తీసుకొస్తాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే అమృతంలా ఉంటుంది. సాధారణంగా ఈ డెజర్ట్ ని నార్త్ ఇండియాలో ఎక్కువగా పండుగలు,ప్రత్యేక సందర్భాల్లో తయారుచేస్తుంటారు. అయితే దూద్ దులారిని మీ ఇంట్లో సులభంగా ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

దూద్ దులారి తయారీకి కావాల్సిన పదార్థాలు -సేమియా -పాలు -ఆయిల్ -ఫ్రెష్ క్రీమ్ -మొక్కజొన్న పిండి -రోజ్ వాటర్ -వెన్నీలా ఎసెన్స్ -బాదం -పిస్తా

-కిస్ మిస్ -ఫ్రూట్ కాక్ టెయిల్ లేదా తాజా పండ్లు

దూద్ దులారి తయారీ విధానం -ముందుగా స్టవ్ మీద ఓ పెద్ద గిన్నె పెట్టి అందులో ఓ లీటరు బఱ్రెపాలు పోసి కలుపుతూ మరిగించుకోవాలి. -పాలు రెండు పొంగులు రాగానే అందులో అరకప్పు సేమియా వేసి సేమియాని మెత్తగా ఉడకనివ్వాలి. -సేమియా ఉడికిన తర్వాత అందులో ముప్పావు కప్పు నెస్లే మిల్క్ మెయిడ్( %చీవర్శ్రీవ వీఅశ్రీ/నెమిఖుఅఃస%)వేశాక మళ్లీ రెండు పొంగులు వచ్చాక అందులో 1 టీస్పూన్ రోజ్ వాటర్, 1 టీస్పూన్ వెన్నీలా ఎసెన్స్ వేసి బాగా కలపండి. -తర్వాత ఒక చిన్న బౌల్ లో 1 టేబుల్ స్పూన్ మొక్కజొన్న పిండి , పావు కప్పు వేడి పాలు పోసి ఉండలు లేకుండా కలిపాక దీనిని స్టవ్ మీద ఉన్న పాలలో పోస్తూ కలుపుకోవాలి.

-4 నిమిషాలకు పాలు చిక్కబడిన తర్వాత అందులో అర కప్పు ఫ్రెష్ క్రీమ్ వేసి బాగా కలపాలి. చిలికిన చిక్కటి పెరుగు మాదిరి ఉండాలి.

-తర్వాత ప్రెజర్ కుక్కర్ ని స్టవ్ మీద నుంచి దించేసి ఓ బౌల్ లో పోసి ఫ్రిడ్జ్ లో కనీసం 2 గంటలు చల్లారనివ్వండి. -ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 250%ఎశ్రీ% నీళ్లు పోసి మరిగించాలి. సగం మరిగాక ఇందులో మీకు నచ్చిన ఫ్లేవర్ మార్కెట్ లో దొరికే రెడీమేడ్ జెల్లీ మిక్స్.. అర ప్యాకెట్ వేసి కలపాలి. -జెల్లీ మిక్స్ కరిగిన తర్వాత దాన్ని ఓ ప్లేట్ లోకి తీసుకొని 2 గంటలు పక్కనపెట్టుకోవాలి. తర్వాత దీన్ని మీకు నచ్చిన షేపులో కట్ చేసుకొని పక్కన ఉంచుకోండి. -ఇప్పుడు ఓ చిన్న జల్లెడలో రెడీమేడ్ గా దొరికే 1 కప్పు ఫ్రూట్ కాక్ టెయిల్ లేదా తాజా పండ్ల ముక్కలు(ద్రాక్ష, అరటి, యాపిల్,దానిమ్మ గింజలు) వేసి నీరు దిగాక దీన్ని ఫ్రిడ్జ్ లో ఉంచి దూద్ దులారీ మిశ్రమంలో వేసి కలపాలి. -తర్వాత అందులో కట్ చేసిన బాదం,పిస్తా పలుకులు వేసి కలపండి. తర్వాత ఇందులో జెల్లీలు, అంగూరీ రసగుల్లాలు 15 వేసి బాగా కలపాలి. అంతే దూద్ దులారీ రెడీ. సర్వ్ చేసే ముందు ఇందులో కొద్దిగా కుంకుమ పువ్వు నానబెట్టిన పాలను దానిమీద చల్లితే మరింత ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

## వాసనకే కడుపు నిండిపోయే కరివేపాకు పులావ్..ఇలా చేసుకుంటే సూపర్ టేస్ట్



పులావ్ పేరు వింటే నే కొందరికి నోట్లో నీళ్లూరుతుంటాయి. ఇక వాసన వస్తే ప్లేటు పట్టుకొని పరిగెత్తా ల్సిందే. అయితే మీరెప్పుడైనా కరివేపాకు పులావ్ తిన్నారా? ఉల్లిపాయ. వెల్లుల్లి లేకుండానే తయారుచేసే కరివేపాకు పులావ్.. సౌతిండియాలో చాలా ఫేమస్,టేస్టీ వంటకం. తక్కువ సమయంలో తయారయ్యే ఈ పులావ్ లో కరివేపాకు ప్రత్యేకమైన సువాసన,రుచి ఉంటాయి. ఇది అందరికీ నచ్చుతుంది. కరివేపాకు పులావ్ ని మీ ఇంట్లోనే సులభంగా ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి.

కరివేపాకు పులావ్ తయారీకి కావాల్సిన పదార్థాలు -శెనగపప్పు -మినపప్పు -ఆయిల్ -ఆవాలు -ఎండుమిర్చి -మిరియాలు -జీడిపప్పు -ఇంగువ -బాస్మతి రైస్.

-నీళ్లు -జీలకర్ర -కరివేపాకు -గరం మసాలా.

కరివేపాకు పులావ్ తయారీ విధానం -ముందుగా ఒకటిన్నర కప్పు బాస్మతి బియ్యాన్ని శుభ్రంగా రెండుసార్లు కడిగి కనీసం 20 నిమిషాలు నానబెట్టుకోవాలి.

-ఇప్పుడు పులావ్ చేసే గిన్నెను లేదా ప్రెజర్ కుక్కర్ ని స్టవ్ మీద పెట్టి అందులో కొద్దిగా ఆయిల్ వేసి వేడయ్యాక ఇందులో ఒకటిన్నర టేబుల్ స్పూన్ పచ్చి శెనగపప్పు, ఒకటిన్నర టేబుల్ స్పూన్ మినపప్పు వేసి అవి బంగారు గోధుమ రంగులోకి వచ్చేదాకా వేయించాలి. -తర్వాత అందులో 1 టీస్పూన్ ఆవాలు, 4 ఎండుమిర్చి, కొద్దిగా మిరియాలు, 1 టీస్పూన్ జీలకర్ర,చిటికెడు ఇంగువ వేసి వేయించాక ఇందులో 1 కప్పు కరివేపాకు, 15 జీడిపప్పు వేసి 1 నిమిషం పాటు వేయించుకోవాలి. జీడిపప్పు బంగారు రంగులోకి మారేదాకా వేయించాలి. కరివేపాకును నూనెలో వేయించడం వల్ల దాని సువాసన పులావ్ కి పట్టుకుంటుంది. -తర్వాత ఇందులో శుభ్రంగా కడిగిన ఒకటిన్నర కప్పు బాస్మతి బియ్యం,కొద్దిగా గరం మసాలా,రుచికి సరిపడా ఉప్పు,3 కప్పుల నీళ్లు పోసి బాగా కలిపి మంటను మీడియంలో పెట్టి 2 విజిల్స్ వచ్చేదాకా ఉడికించుకోవాలి. -తర్వాత మూతీసి అందులో కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం,కొత్తిమీర తరుగు వేసి కలుపుకోవాలి. అంతే కరివేపాకు పులావ్ రెడీ. దీనిని పెరుగు,రైతా లేదా మీకు నచ్చిన కూరతో కలిపి తింటుంటే ఆ మజానే వేరే లెవల్ లో ఉంటుంది.

## గుజరాత్ స్పెషల్ 'ఖఖ్రా' ఎప్పుడైనా తిన్నారా?

## భలే ఉంటదబ్బా..ఎలా చేసుకోవాలంటే..



మనదేశంలోని గుజరాత్ పరిశ్రమలకే కాదండోయ్ వంటకాలకు కూడా ప్రసిద్ధే. కొన్ని గుజరాతీ వంటకాలు వరల్డ్ వైడ్ గా పాపులారిటీ సంపాదించుకున్నాయి. అలాంటి వాటిల్లో ఖాఖ్రా ఒకటి. దీనిని రోటీ,చపాతీ మాదిరి తయారుచేస్తారు..కానీ చాలా పల్చగా కాల్చి,క్రిస్పీగా చేస్తారు. ఖఖ్రా చాలా సులభంగా జీర్ణమయ్యే ఆహారం కూడా. దీనిని బ్రేక్ ఫాస్ట్ లోకి లేదా ప్రయాణాల్లో తినడానికి అనువుగా ఉంటుంది. గుజరాతీ స్టైల్ లో ఖఖ్రాని మీ ఇంట్లోనే తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

ఖఖ్రా తయారీకి కావలసిన పదార్థాలు ధనియాల పొడి - 1 టీస్పూన్ జీలకర్ర పొడి - 1/2 టీస్పూన్ నువ్వులు - 1 టేబుల్ స్పూన్ గోధుమ పిండి - 2 కప్పులు శెనగ పిండి (బేసన్) - 1/4 కప్పు నూనె - తగినంత ఉప్పు - రుచికి తగినంత నీరు - పిండి కలపడానికి తగినంత పసుపు పొడి - 1/4 టీస్పూన్ కారం పొడి - రుచికి తగినంత వాము - 1/2 టీస్పూన్ కసూరి మేథీ- 1 టేబుల్ స్పూన్ నలిపినది.

ఖఖ్రా తయారీ విధానం -ఖఖ్రా తయారీకోసం ముందుగా ఒక పెద్ద గిన్నెలో గోధుమ పిండి, శెనగ పిండి వేయండి. ఇందులో కొద్దిగా నూనె, పసుపు, కారం, ధనియాల పొడి, జీలకర్ర పొడి, నువ్వులు, వాము, కసూరి మేథీ,ఉప్పు వేసి అన్నీ బాగా కలిసేలా చేతితో కలపాలి. -కొద్ది కొద్దిగా నీరు పోస్తూ మెత్తని పిండి ముద్దలా కలపండి. పిండి మరీ మెత్తగా లేదా గట్టిగా ఉండకూడదు. చపాతీ పిండిలా ఉండాలి.

-పిండిని తడి గుడ్డతో కప్పి 15-20 నిమిషాలు నాననివ్వండి. -నానిన పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకోండి. నిమ్మకాయ పరిమాణంలో ఉండలు చేస్తే సరిపోతుంది. -ఒక ఉండను తీసుకొని పొడి పిండిలో అద్ది చపాతీ కర్రతో వీలైనంత పలుచగా రోటీలా ఒత్తండి. ఖఖ్రా ఎంత పలుచగా ఉంటే అంత క్రిస్పీగా వస్తుంది.-తర్వాత స్టవ్ మీద పెనం వేడి చేసి ఒత్తిన ఖాఖ్రాను వేడి పెనం మీద వేయండి. ఒక వైపు కొద్దిగా కాలిన తర్వాత దానిని తిప్పి రెండో వైపు కూడా కొద్దిగా కాల్చండి. -ఇప్పుడు ఒక గుడ్డ లేదా కాటన్ క్లాత్ తీసుకొని ఖఖ్రాను నెమ్మదిగా నొక్కండి. ఇలా చేయడం వల్ల ఖఖ్రా సమానంగా కాలుతుంది, క్రిస్పీగా మారుతుంది. -రెండు వైపులా బంగారు రంగు వచ్చే వరకు, క్రిస్పీగా మారే వరకు కాల్చి దించేయాలి. అంతే గుజరాత్ స్పెషల్ ఖఖ్రా రెడీ. దీనిని మీకు నచ్చిన పచ్చడి, పెరుగు, వెన్నతో కలిపి తింటే అద్భుతంగా ఉంటుంది.

# సినిమా న్యూస్



## గీత-గోవింద్ ఒక్కటైన వేళ ఇది..!



రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ మరియు నేషనల్ క్రష్ రష్మిక మందన్న లవ్ స్టోరీ ఎట్టకేలకు ఒక అందమైన ముగింపుకు చేరుకుంది. ఈ రోజే (26 ఫిబ్రవరి 2026) వీరిద్దరూ రాజస్థాన్-ఉదయ్ పూర్ లోని ఒక ప్రయివేట్ వెన్యూలో వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఈ సందర్భంగా ఈ జంట కెరీర్ జర్నీలో 'గీత గోవిందం' మొదలు 'రణబలి' వరకూ ప్రయాణంలో సరిగమల్ని పరిశీలిస్తే...కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇక్కడ ఉన్నాయి.2018లో వచ్చిన 'గీత గోవిందం' వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన మొదటి సినిమా. గోవింద్, గీతల మధ్య కెమిస్ట్రీ అప్పట్లో ఒక సెన్సేషన్. ఆ ఇద్దరి మధ్యా ఏదో మొదలైందన్న సంకేతం అప్పుడే అందింది. ఆ తర్వాత డియర్ కామ్రేడ్ సినిమా వీరి స్నేహాన్ని మరింత బలపరిచింది. కష్టకాలంలో విజయ్ తనకు ఒకకామ్రేడ్ లాఅండగా నిలిచారని రష్మిక స్వయంగా చెప్పు కొచ్చారు. అయితే ఈ జంట కలిసి నటించే చివరి సినిమా (ప్రస్తుతానికి) ఏది? అంటూ గూగుల్ లో సెర్చ్ మొదలైంది. పెళ్లి తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న సినిమా 'రణబలి'. ఇది వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న మూడవ సినిమా. రణబలి విశేషాలు.. విజయ్- రష్మిక జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇది ఒక గ్రిట్టీ యాక్షన్ డ్రామా. సెప్టెంబర్ 2026లో విడుదలయ్యే అవకాశం ఉంది. పెళ్లి తర్వాత ఈ జంట వెండితెరపై కనిపించబోతున్న మొదటి సినిమా ఇదే కావడం విశేషం. 'డియర్ కామ్రేడ్' తర్వాత వీరిద్దరూ కలిసి నటించడానికి చాలా సమయం తీసుకున్నారు. దానికి ప్రధాన కారణాలు..ఈ జంట వ్యక్తిగత జీవితం గురించి వచ్చే వార్తలు సినిమాలను ఓవర్‌షాడో (మరుగున పడేయడం) చేయకూడదని భావించారు. ఎవరికి వారు ఇండివిడ్యువల్ కెరీర్ పై దృష్టి సారించారు. రష్మిక బాలీవుడ్‌లో పాన్ ఇండియా స్టార్‌గా ఎదుగుతుంటే, విజయ్ తనదైన శైలిలో వైవిధ్యమైన సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. మళ్ళీ ఇద్దరూ కలిసి నటించాలంటే 'గీత గోవిందం' రేంజ్ మ్యాజిక్ రిపీట్ చేసే కథ కావాలని వేచి చూశారు. ఆ అవకాశం 'రణబలి'తో దక్కింది.

## 15 నిమిషాల తిరుమల దర్శనంపై హీరోయిన్ క్లారిటీ



తిరుమల శ్రీవారి దర్శనం కోసం వెళ్లే దేవుడిని చూసేలోపు దేవుడు కనిపిస్తాడని సామాన్య భక్తులు వ్యాఖ్యానిస్తుంటారు. ఐతే సెలబ్రెటీల కోసం ఏర్పాటు చేసే వీఐపీ బ్రేక్ దర్శనం అయితే త్వరగా.. ప్రశాంతంగా జరిగిపోతుందన్న సంగతి తెలిసిందే. ఐతే జనం తోపులాట, హడావుడి లేకపోవడం సంగతి ఎలా ఉన్నా.. బ్రేక్ దర్శనాల్లో కూడా దైవదర్శనం కొన్ని క్షణాలే ఉంటుందన్నది వాస్తవం. ఐతే తాను దర్శనానికి వెళ్తే 15 నిమిషాల పాటు ఎవ్వరూ టచ్ చేయలేదని.. ఆ పావుగంట ఓవైపు గోవింద నామాలు వినిపిస్తుంటే.. ఇంకోవైపు 'కాత్యాయనీ భోంచేశావా' అని తాను నటించిన 'లిటిల్ హార్ట్స్' సినిమా పాట పల్లవిని కొందరు వినిపిస్తూ ఉన్నారని హీరోటయిన్ శివాని నాగారం ఒక పాడ్ కాస్ట్‌లో చెప్పడం చర్చనీయాంశమైంది. సామాన్య భక్తులను కొన్ని క్షణాలు కూడా ప్రశాంతంగా దర్శనం చేసుకోనివ్వని టీటీడీ.. సెలబ్రెటీలకు మాత్రం పావుగంట అవకాశం ఇవ్వడం ఏంటి అంటూ సామాజిక మాధ్యమాల్లో జనాలు మండిపడ్డారు. తన వీడియో వైరల్ అయిన నేపథ్యంలో శివాని నాగారం ఒక వీడియో రిలీజ్ చేసింది. తన వ్యాఖ్యలు జనాల్లోకి వేరేలా వెళ్లాయని.. వాస్తవంగా తన ఉద్దేశం వేరని ఆమె వివరణ ఇచ్చింది. తాను రేణిగుంట ఎయిర్‌పోర్టులో దిగి తన తల్లితో కలిసి రూ.10,500తో శ్రీవాణి ప్రత్యేక టికెట్ తీసుకున్నానని ఆమె చెప్పింది. తాను గుడిలోకి వెళ్లాక.. దేవుడిని దర్శనం చేసుకునే వరకు కలిపి 15 నిమిషాలు అని చెప్పానే తప్ప.. దేవుడిని 15 నిమిషాల పాటు దర్శనం చేసుకుంటే తనను ఎవ్వరూ తోయలేదని ఆమె వెల్లడించింది. అందరు భక్తుల్లాగే ఐదారు క్షణాలే దేవుడిని దర్శించుకున్నట్లు శివాని చెప్పింది. తాను ఈ ఇంటర్వ్యూలో తన ఆధ్యాత్మిక ప్రయాణం గురించి మాట్లాడానని.. 13 ఏళ్ల తర్వాత శ్రీవారిని దర్శనం చేసుకున్నపుడు కలిగిన ఉద్వేగం గురించి తాను మాట్లాడానని ఆమె గుర్తు చేసుకుంది. శ్రీవాణి టికెట్ తీసుకున్న ఎవ్వరికైనా తన లాగే మంచి దర్శనం అవుతుందని పేర్కొంటూ తన టికెట్‌ను కూడా ఆమె ఈ వీడియోలో పంచుకుంది.

## ఛార్మినార్ వీధుల్లో షాపింగ్ చేస్తున్న బిగ్ బాస్ బ్యూటీ!



బిగ్ బాస్ సీజన్ 4లో తన సైలెంట్ పర్ఫార్మెన్స్‌తో, మెస్మరైజ్ చేసే లుక్స్‌తో రాత్రికి రాత్రే పాపులర్ అయిన బ్యూటీ దివి వద్యా. కేవలం రియాలిటీ షోకే పరిమితం కాకుండా, మెగాస్టార్ చిరంజీవి వంటి స్టార్ల ప్రశంసలు అందుకుని టాలీవుడ్‌లో తనదైన ముద్ర వేస్తోంది. దివి వద్యా తన అందంతో, చమత్కారంతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటుంది. తాజాగా హైదరాబాద్ నగరంలోని పాతబస్తీ వీధుల్లో ఆమె చేసిన సందడి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. బ్లాక్ కలర్ మిడ్డీలో మెరిసిపోతూ ఛార్మినార్ పరిసరాల్లో షాపింగ్ చేస్తూ కనిపించిన దివి, ఆ ఫోటోలను 'హైదరాబాద్ థింగ్స్' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. పక్కా హైదరాబాదీ అమ్మాయిలా ఆమె అచ్చమైన నగర సొగసులను ఎంజాయ్ చేస్తున్న తీరు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోందిపాతబస్తీ వీధుల్లో దివి సందడి: సాధారణంగా సెలబ్రిటీలు పెద్ద పెద్ద మాల్స్‌లో షాపింగ్ చేస్తుంటారు, కానీ దివి మాత్రం హైదరాబాద్ అసలైన రుచిని, సంస్కృతిని ఆస్వాదించడానికి ఇష్టపడుతుంది. తాజాగా ఛార్మినార్ వద్ద ఉన్న లాడ్ బజార్ వీధుల్లో దివి షాపింగ్ చేస్తూ కెమెరాకు చిక్కింది. ఇక నలుపు రంగు ఫుల్ మిడ్డీ ధరించి, ఎంతో క్యూట్ లుక్ తో కనిపిస్తున్న ఆమెను చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. ఆ పాతబస్తీ బ్యాక్‌గ్రౌండ్‌లో దివి ఇస్తున్న ఫోజులు చూస్తుంటే, ఒక అందమైన పెయింటింగ్‌లా ఉన్నాయంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. దివి షేర్ చేసిన ఈ ఫోటోలకు 'హైదరాబాద్ థింగ్స్' అని క్యాప్షన్ ఇచ్చింది. ఇందులో కేవలం తన ఫోటోలు మాత్రమే కాకుండా, పాతబస్తీలోని గాజుల దుకాణాలు, అక్కడి ఇరుకైన వీధులు, నగర సందడిని కూడా చూపించింది.ఇక తన సొంత నగరమైన హైదరాబాద్‌ను ఎంతగా ప్రేమిస్తుందో ఈ పోస్ట్ ద్వారా మరోసారి నిరూపించుకుంది. ఒక సాధారణ అమ్మాయి లా అందరితో కలిసిపోయి ఆమె షాపింగ్ చేస్తున్న తీరు చూస్తుంటే, ఆమె సింప్లిసిటీకి ఎవరైనా హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.

## 'లార్డ్ మార్కో' లో టాలీవుడ్ స్టార్!



హనీఫ్ అదేనీ దర్శకత్వంలో తెరకెక్కిన మాలీవుడ్ చిత్రం -మార్కో- ఎంత పెద్ద విజయం సాధించిందో తెలిసిందే. భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ చిత్రంగా తెరకెక్కిన చిత్రం ఏ సర్టిఫికెట్ చిత్రంగా రిలీజ్ అయి ఇండియన్ సినిమా హిస్టరీ లోనే సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ స్థాయి హింసాత్మక చిత్రం రావడం అదే తొలిసారి. భారీ హింస.. రక్తపాతం తో ఒళ్లు గగుర్లు పొడిచే సన్నివేశాలెన్నో ఉన్నాయి. క్లైమాక్స్ లోనే ఈ కథకు ఇంకా కొనసాగింపు ఉంటుందని అర్దమైంది. దీంతో -మార్కో 2- ఎప్పుడు ఉంటుందని యాక్షన్ ప్రియులంతా నెట్టింట అడుగుతున్నారు. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్ గా -లార్డ్ మార్కో- కూడా రెడీ అవుతోంది. -మార్కో-ని ఎక్కడ నుంచి ముగించారో -లార్డ్ మార్కో- అక్కడ నుంచే మొదలవుతుంది. ఇందులో ఉన్నిముకుందన్ మార్కో డి పీటర్ (మార్కో జూనియర్) పాత్రలో నటించాడు. యుక్తి తరేజా అనే మరియా అనే పాత్రలో హీరోయిన్‌గా కనిపించింది. సిద్దిఖ్ జార్జ్ డి పీటర్ (అడాట్టు జార్జ్ పాత్రలో అలరించగా, జగదీష్ టోనీ ఐజాక్ పాత్రలో ఆకట్టుకున్నాడు. ఇంకా కబీర్ దుహాన్ సింగ్ సైరస్ ఐజాక్ పాత్రలో (విలన్) లో అదరగొట్టాడు. అభిమన్యు శమ్మి తిలకన్ రస్సెల్ ఐజాక్ పాత్రలో నటించాడు. అన్సన్ పాల్ దేవరాజ్ (దేవ్) పాత్రలో, ఇషాన్ శౌకత్ విక్టర్ డి పీటర్ (హీరో తమ్ముడి) పాత్రలోనూ ఆద్యంతం ఆకట్టుకున్నారు. ఈ పాత్రలన్నీ లార్డ్ మార్కోలో కొనసాగింపు కొనసాగుతాయి. వీటితో పాటు అదనంగా మరికొన్ని పాత్రలు యాడ్ అవుతాయి. అయితే ఇందులో ఓ తెలుగు హీరో కూడా నటిస్తున్నాడనే ప్రచారం జరుగుతోంది. పాన్ ఇండియాలో రిలీజ్ చేస్తున్న నేపథ్యంలో ఓ తెలుగు హీరోను పెట్టుకుంటే మార్కెట్ పరంగా మరింత కలిసొస్తుంది. దీనిలో భాగంగా యూత్ స్టార్ నితిన్ ని నిరంగంలోకి దించుతున్నారుట. ఓ కీలక పాత్రలో నితిన్ నటించే అవకాశాలున్నాయంటున్నారు. అదే జరిగితే నితిన్ కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకుంటుంది. కొంత కాలంగా నితిన్ కు సక్సెస్ లు లేని సంగతి తెలిసిందే. ఏ సినిమా చేసినా నష్టాలు తప్ప రూపాయి లాభం రావడం లేదు. పైగా రొటీన్ చిత్రాలు గా తేలిపోతున్నాయి. నితిన్ కెరీర్ మొత్తంలో చేసిన ప్రయోగాలు చాలా తక్కువే. ఈ నేపథ్యంలో లార్డ్ మార్కో లాంటి చిత్రంలో సరైన రోల్ పడితే? కెరీర్ పరంగా కలిసొస్తోంది. ఈ విషయంలో నిర్మాత దిల్ రాజు సహకరించే అవకాశం ఉంది. ఇప్పటికే హనీఫ్ అదేనితో దిల్ రాజు కు కమిట్ మెంట్ ఉన్న సంగతి తెలిసిందే. మార్కో విజయం చూసి అతడితో సినిమా నిర్మించేందుకు అడ్వాన్స్ చెల్లించారు. రాజుగారుకి ఎలాగూ నితిన్ బంధువు. కాబట్టి ఆయన మాటను నితిన్ కాదనలేదు.

## రాజమౌళిపై గురి పెట్టిన నవ నాయిక!



దర్శకధీరుడు రాజమౌళి చిత్రంలో హీరోయిన్ గా నటించాలన్నది ప్రతీ నటి కల. టాలీవుడ్ నుంచి మొదలు బాలీవుడ్ వరకూ అన్ని పరిశ్రమల స్టార్ హీరోయిన్లు జక్కన్న చిత్రంలో భాగమవ్వాలని ఆశపడుతున్నారు. కానీ ఆ అవకాశం అందరికీ దక్కదు. కొందరికే సాధ్యమవుతుంది. రాజమౌళి సృష్టించిన పాత్రకు ఎవరైతే సరితూగుతారో వారినే ఎంపిక చేస్తారు. -మగధీర-లో మిత్ర విందగా అరుదైన అవకాశం కాజల్ అగర్వాల్ కు దక్కింది. ఆ తర్వాత -బాహుబలి-లో దేవసేన పాత్రలో కనిపించే అవకాశం స్వీటీ అనుష్కకు లభించింది. ఈ రెండు సినిమాలు రాజమౌళి కెరీర్ లో ఐకానిక్ చిత్రాలు కావడంతో? వాటిలో హీరోయిన్ పాత్రలు తెలుగు సినిమా చరిత్రలో చిరస్మరణీయమైనవి. రాజమౌళికి పాన్ ఇండియాలో అంతటి గుర్తింపునిచ్చినవి ఆ రెండు చిత్రాలు కావడంతోనే సాధ్యమైంది. ప్రస్తుతం తెరకెక్కిస్తోన్న -వారణాసి-లో నటించే అవకాశం గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రాకు దక్కింది. ఆ రకంగా కాజల్ అగర్వాల్, అనుష్క, తర్వాత స్థానం ప్రియాంక చోప్రాదే అయింది. రాజమౌళి తర్వాత తెరకెక్కించే సినిమాలో హీరోయిన్ అవకాశం ఎవరికి దక్కుతుంది? అన్నది రాజమౌళికి కూడా తెలియదు. ఆయన కథ సిద్దం చేసే వరకూ ఎదురు చూడటం తప్ప చేసేదేం లేదు. కానీ ఆ సినిమాలో తానే హీరోయిన్ అయితే బాగుండని ఆశపడే హీరోయిన్లు మాత్రం కోకొల్లలు. ఇండియాను దాటి హాలీవుడ్ నటిమణులు సైతం జక్కన్న చిత్రంలో భాగమవ్వాలనుకుంటున్నారు? అన్నది కాదనలేని నిజం. అలాంటి లెజెండరీ డైరెక్టర్ పైనే గురి పెట్టింది యువ నాయిక నయన్ సారిక. ఈ భామ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. -మిస్టేక్- చిత్రంలో పార్వతి పాత్రతో తెలుగులో లాంచ్ అయింది. అటుపై -గం గం గణేశా- లో ఆనంద్ దేవరకొండ సరసన శృతి పాత్రలో కనిపించింది.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్న బిఆర్ఎస్

మొదటిపేజీ తరువాయి

ఆయన గణాంకాలతో వివరించారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరినప్పటికీ, బీఆర్ఎస్ , బీజేపీల మధ్య ఉన్న అంతర్గత 'ఫెవికల్' బంధం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని మంత్రి ఆరోపించారు. కేంద్ర సంస్థల నివేదికల ఆధారంగానే తాము జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, కానీ దీనిపై అసెంబ్లీలో చర్చ జరిగే సమయంలో ప్రతిపక్ష సభ్యులు పారిపోయారని దుయ్యబట్టారు. సభలో చర్చకు రమ్మంటే కుంటిసాకులు చెప్పే బావబావమరుదులు బయట మాత్రం అచ్చోసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తున్నారని పొంగులేటి ఘాటుగా విమర్శించారు. నిత్యం పెయిడ్ ఆర్టిస్టులతో సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ, శవాల మీద చిల్లర ఏరుకునే రకంగా ప్రతిపక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజలు వీరి నిజస్వరూపాన్ని చూశారు కాబట్టే అన్ని ఎన్నికల్లో ఓడగొట్టారని గుర్తు చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీ పడదని మంత్రి స్పష్టం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంత నీటిని నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ వాసులకు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ స్వార్థ నిర్ణయాల వల్ల రాష్ట్రం 15 ఏళ్లు వెనక్కి పోయిందని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని మరో 15 ఏళ్లు ముందుకు తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పనులపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతిపక్షం దమ్ముంటే అసెంబ్లీకి రావాలని ఆయన సవాల్ విసిరారు.

# జూబ్లీహిల్స్ వెంకన్నకు పుష్పయాగం





విజయవంతంగా ముగిసిన సంగతి తెలిసిందే. నిత్యకైంకర్యాలు, బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్చకులు, పరిచారకులు, అధికారులు, భక్తులవల్ల తెలియకుండానే ఏవైనా లోపాలు సంభవించి ఉంటే, వాటి నివృత్తి కోసం పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో ఉదయం 5.00 గంటల నుండి 6.30 గంటల వరకు యాగశాలలో వేదపండితులు వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 9.00 నుండి 11.00 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం వంటి దివ్య ద్రవ్యాలతో అభిషేకం చేసి స్వామివారిని శోభాయమానంగా అలంకరించారు. మధ్యాహ్నం 3.00 నుండి 5.00 గంటల వరకు పుష్పయాగం కన్నులపండువగా జరిగింది. 12 రకాల పుష్పాలు, 6 రకాల పవిత్ర ఆకులతో స్వామివారికి పుష్పార్చనలు నిర్వహించారు అర్చకులు. చామంతి, రోజా, గన్నేరు, సంపంగి, మల్లె, కనకాంబరం, తామర, కలువ, మాను సంపంగి తదితర పుష్పాలతో పాటు తులసి, దవనం, మరువం, బిల్వం, పన్నీరాకు వంటి ఆకులను వినియోగించారు. ఈ మహోత్సవం కోసం సుమారు 2 టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా సమర్పించినట్లు తెలిపారు ఆలయ అధికారులు. బెంగళూరు నుండి ప్రత్యేకంగా పుష్పాలు తెప్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఎల్.ఏ.సీ చైర్మన్ ఏ.వి.రెడ్డి, ఏఈవో రమేశ్, ఆలయ అర్చకులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ కుమార్, శ్రీహరి తదితర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేస్తాం

## - వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదే
## - మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఫిబ్రవరి26 : ఖమ్మం వెలుగుమట్ల ఘటనపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందించారు. పేదలు కాంగ్రెస్ పేటెంట్ అని వ్యాఖ్యానించారు. తమది పేదల ప్రభుత్వమని తెలిపారు. తెలంగాణ హైకోర్టు ఆర్డర్ మేరకు వెలుగుమట్లలో భూదాన్ భూములని కులగొట్టింది వాస్తవమేనని చెప్పుకొచ్చారు. వెలుగుమట్లలో 2023లో బీఆర్ఎస్ కూడా అక్కడ ఇళ్లు కూలగొట్టిందని ప్రస్తావించారు. ఖమ్మంలో నష్టపోయిన నిరుపేదలందరికీ న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని మాటిచ్చారు. ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. కేటీఆర్ అండ్ కో చేసే గ్లోబల్ ప్రచారాన్ని ఎవరు నమ్మొద్దని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి రమ్మంటే రారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తెలంగాణ హక్కులు వదులుకోమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని అన్నారు. అయినా వారి యూట్యూబులతో వంకర మాటలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ హయాంలో కమిషన్ వచ్చే పనులు మాత్రమే చేశారని.. అయినా ఆ ప్రాజెక్టులను తాము సరిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. వచ్చే నెల 16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభం అవుతోందని.. పారిపోకుండా రండి అన్ని అంశాలపై చర్చిద్దామని సవాల్ విసిరారు. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా రావాలని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్ స్వార్థం వల్ల రాష్ట్రం 15ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆగ్రహించారు.

# ఇజ్రాయెల్-భారత్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

## - యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఎవోయూ - ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు - ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని మోడీ ప్రకటన - త్వరలోనే ఇండియా వస్తానన్న నెతన్యాహు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,ఫిబ్రవరి26 : ఇజ్రాయెల్-భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 27 రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయి. మరోవైపు గాజాపై ప్రధాని మోదీ మరోసారి భారత్ వైఖరిని స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ సంఘర్షణకు బలికాకూడదని అన్నారు. ప్రస్తుతం శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. ఃూగా, త్వరలోనే భారత పర్యటనకు రావాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ఆహ్వానించారు. అంతకు ముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు ప్రశంసించారు. ఆయన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని అన్నారు. భారత్‌కు రుణపడి ఉన్నామని అన్నారు. మోదీ తమకు స్నేహితుడు కంటే ఎక్కువని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి నాంది పలికింది. విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్ పార్లమెంట్ వరకు మోడీకి లభించిన ఘన స్వాగతం ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది. పర్యటనలో భాగంగా నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన వ్యక్తిగత విషయాన్ని ఒకటి పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు మాట్లాడుతూ.. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ భోజనం అద్భుతంగా ఉండటం వల్లే వారి బంధం బలపడిందని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే ప్రధాని మోడీ నవ్వు ఆపుకోలేక పోయారు. భారతదేశంలోని అపారమైన ప్రతిభను, ఇజ్రాయెల్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని కలపడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ప్రధానంగా కచ్చితమైన వ్యవసాయం, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, అభివృద్ధికి సంబంధించి రెండు దేశాల మధ్య 16 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి. రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే భారత్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. 'మా వ్యక్తిగత స్నేహం, ప్రభుత్వాల మధ్య సహకారం, ప్రజల మధ్య అనుబంధం నానాటికీ బలపడుతోంది' అని నెతన్యాహు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దీనిని కొనసాగించేందుకు సాధ్యమైనంత త్వరగా భారతదేశంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన కేవలం దౌత్యపరమైన ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఇద్దరు దేశాధినేతల మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత స్నేహాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.

# కలెక్టర్ బదిలీలో పండగ చేసుకున్న జనం

## మానుకోటలో బాణాసంచా కాల్చి...స్వీట్లు పంపిణీ

మహబూబాబాద్,ఫిబ్రవరి26 : జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌ను ప్రభుత్వం బదిలీ చేయడంతో మానుకోట జిల్లాలో పండగ వాతావరణం నెలకొంది. గత కొంతకాలంగా కలెక్టర్ పనితీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్న గిరిజన ప్రజా సంఘాలు, ఈ బదిలీ వార్త తెలియగానే రోడ్లపైకి వచ్చి సంబరాలు చేసుకున్నాయి. బాణసంచా కాల్చి, ఒకరికొకరు స్వీట్లు పంచుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు.గత రెండు సంవత్సరాలుగా కలెక్టర్‌గా పనిచేసిన అద్వైత్ కుమార్, జిల్లా అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని గిరిజన నాయకులు ఆరోపించారు. ఒక గిరిజన జిల్లాగా ఉన్న మహబూబాబాద్‌ను ఆయన తన నిర్ణయాలతో పదేళ్ల పాటు వెనక్కి నెట్టేశారని వారు విమర్శించారు. రైతుల భూ సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాల జాప్యం వంటి కీలక అంశాలను ఆయన గాలికి వదిలేశారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్‌కు వచ్చే ప్రత్యేక నిధులను పేద వర్గాల ప్రజల సంక్షేమం కోసం లేదా అభివృద్ధి పనుల కోసం వినియోగించలేదని బాధితులు పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేయాల్సిన నిధులను తిరిగి ప్రభుత్వానికి పంపించేశారన్నారు.

# తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం







మొదటిపేజీ తరువాయి

ధైర్యంగా ఉండాలని అంటూ బాధితులకు కేటీఆర్ మాటిచ్చారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలేనని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీ చూశానని.. ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల మీద కన్నుబడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలిసికట్టుగా ఈ దుర్మార్గం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ తాము అన్యాయం చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని.. మీ అందరికీ అదే ప్రాంతంలో అక్కడే ఇళ్ల స్థలాలు ఇల్లు ఇస్తామని మాటిచ్చారు. ఇక్కడి వారందరికీ అండగా నిలబడాలని తాను వచ్చానని చెప్పుకొచ్చారు. ఇళ్ల కూల్చివేతపై కోర్టుకి కూడా వెళ్దామని.. మీకెవరికీ ఒక రూపాయి ఖర్చు లేకుండా మీ తరఫున తమ లీగల్ టీం పోరాడుతుందని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్నఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. రేవంత్ సర్కార్ కనికరం లేకుండా ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలో వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను కలిశారు. ఇళ్లు కోల్పోయిన వెలుగు మట్ల బాధితులను కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మిమ్మల్ని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుస్తరు. మీకు అది చేస్తం.. ఇది చేస్తం.. అది చేస్తమని.. మీ 900 కుటుంబాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తాడు. మీరు ఐక్యంగా ఉంటేనే విజయం సాధిస్తరు.. లేదంటే వీళ్లు ఏం చేస్తరు. ఏ 100 మందితో వేలి ముద్రలు తీసుకొని మీకు అన్నన్నో ఇస్తరు.. కేసీఆర్ 2000 డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించారు. వాటిలో కొన్ని మిగులున్నయట. ఆ ఇండ్లలో కొంతమందికిస్తమని చెప్పి వారిని లాక్కెళతారని కేటీఆర్ హెచ్చరించారు. ఓపీడీఆర్ వాళు గతంలో ఎప్పుడో చేసిన పని. పాపం వాళ్లేం తప్పు చేయలేదు.. మీకు పట్టాలిప్పించారు. వాళ్లు తప్పు చేసిందేమి లేదు.. ఇప్పుడు వాళ్లను పట్టుకుని ప్రభుత్వం నానా మాటలు అంటోంది. ల్యాండ్ మాఫియానట.. ఎవడమ్మా ల్యాండ్ మాఫియా.. ఎవడైతే ఇవాళ మీ చుట్టూ వందల ఎకరాలు కొన్నాడో.. ఎవడైతే పేదవాడి ఇల్లు కట్టుకున్నడో వాడు మాఫియానా..? మీకు జరిగిన కష్టం.. మీ ఏడుపులు రాష్ట్రం మొత్తం చూసింది. మీ పిల్లలు, మీరు పడుతున్న అవస్థలు చూసే కేసీఆర్ సార్ మమ్మల్ని పంపించారు. దయచేసి ధైర్యంగా ఉండండి.. మీకు అన్ని రకాలుగా అండగా అజయ్ అన్న, మా ఎంపీ గాయత్రి రవిచంద్ర ఉంటారన్నారు. ఏ తప్పూ జరుగకపోతే ఆర్డీవోను ఎందుకు వెంటనే బదిలీ చేశారు. సమాధానం చెప్పాలే ప్రభుత్వం. మంత్రులు తప్పు చేయకపోతే.. నిజంగా ధైర్యముంటే వాళ్లెందుకు రావడం లేదు.. ఇక్కడికి.. వాళ్లొచ్చి మాట్లాడాలి కదా.. అందుకే మీరు ధైర్యంగా ఉండండి. మీ వెంబడి కేసీఆర్ అన్న ఉన్నడు.. కేటీఆర్ అన్న ఉన్నడు. మేమంతా ఉన్నం. ఎట్టి పరిస్థితుల్లో మీకు న్యాయం జరిగేదాకా వేము అండగా ఉంటామని హామీనిచ్చారు. మీకు అన్ని కాగితాలున్నాయి.. కోర్టుకు పోదాం.. కోర్టుకు కూడా మీరు రూపాయి ఖర్చు పెట్టుకునే పని లేదు. పార్టీ తరఫున మేం కొట్లాడుతాం.. మీకు మేం అండగా ఉంటాం. మళ్లీ వస్తాం మిమ్మల్ని కాపాడుకుంటాం. న్యాయపరంగా పట్టాలిప్పించే ప్రయత్నం చేస్తాం. దయచేసి ఐకమత్యాన్ని కోల్పోకండి.. సంఘటితంగా, ఒక్కటిగా ఉండండిని సూచించారు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

మొదటిపేజీ తరువాయి

(జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది.పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియమించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. విజయేంద్ర - మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం అయ్యారు. అద్వైత్ కుమార్ సింగ్ - మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ అయ్యారు. సిక్తా పట్నాయక్ - నారాయణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సందీప్ కుమార్ ఝా - జనగాం కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ముషారఫ్ అలీ ఫారూఖీ - టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం అయ్యారు. జితేష్ వి.పాటిల్ - టీఎస్‌జీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ - మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. గరిమా అగర్వాల్- రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం జరిగింది. ప్రతిమ సింగ్ - మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనికేత్ - భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ,చాహత్ బజ్పాయి - హనుమకొండ కలెక్టర్‌గా,ఖుష్బూ గుప్తా - మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా , పమేలా సత్పతి - లేబర్ కమిషనర్‌గా, అనురాగ్ జయంతి - యాదాద్రి కలెక్టర్‌గా ,ప్రదీప్ జైన్ - నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం జరిగింది.

# విహెచ్, జెట్టిలకు రాజ్యసభ ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

కుటుంబం నుంచి అంతా కాంగ్రెస్‌లోనే ఉన్నారని గుర్తుచేశారు. హనుమంతరావు తెలంగాణలో అనేక మంది ముఖ్యమంత్రులతో పని చేశారని వెల్లడించారు. మూడుసార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారని చెప్పుకొచ్చారు. ఆయనకు రాజీవ్ గాంధీ , సోనియాగాంధీ అవకాశాలు ఇచ్చారని తెలిపారు. వి.హనుమంతరావు చురుకైన వ్యక్తి అని, ఆయనకు మరోసారి రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని ఖర్గేను కోరానని అన్నారు. కమిటీలో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని తెలిపారు. రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# చిన్నారి మృతి కారకులను శిక్షించాలి

మొదటిపేజీ తరువాయి

ఆయన మాట్లాడుతూ 15 రోజులలో దోషులపై చర్యలు తీసుకోకుంటే హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అభం శుభం తెలియని చిన్నారి మృతికి కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితు లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్స రాలు అవుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల కొనసాగుతున్న వివక్ష, దాడులు, దౌర్జన్యాలు, ఆలయాల్లో ప్రవేశంపై ఆంక్షలు కొనసాగడం బాధాకరమని అన్నారు.దేవుడిని దర్శించుకునే అర్హత బలహీన వర్గాలకు లేదా? అని ప్రశ్నించారు. కుమ్మెర దోషులను రక్షించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# రాష్ట్రంలో అభివృద్ధిపై వందరోజుల కార్యక్రమాలు

మొదటిపేజీ తరువాయి

చర్చనీయాంశాలు వెంటనే రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు రాష్ట్ర మంత్రులు ప్రారంభిస్తారని ఇందుకు గాను ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను సిద్ధం చేయాలనీ అన్నారు. ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్, పంచాయితీ రాజ్, వ్యవసాయం, రెవెన్యూ, పర్యాటక, పరిశ్రమలు, మహిళా శిశు సంక్షేమం, గృహనిర్మాణం, రెవెన్యూ, విద్యుత్, కార్మిక తదితర అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సి.ఎస్ పేర్కొన్నారు. ముఖ్యంగా, పారిశుధ్యం గ్రామీణాభివృద్ధి ఆరోగ్య తదితర కార్యక్రమాలపై నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లకు అవగాహన చైతన్య కార్యక్రమాల మాదిరిగా కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సచివాలయం తోపాటు హెచ్ఓడిలలో ఈ-ఆఫీస్ ను అమలు చేయాలని ఆదేశించారు.

# రెండో పెళ్లి కోసం దారుణం

## నిండుగర్భిణిని హత్య చేసిన భర్త

నిజామాబాద్, ఫిబ్రవరి 26 : నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం గన్నారంలో దారుణం జరిగింది. నిండు గర్భిణీని గొంతు నులిమి చంపాడు భర్త. ఈ నెల 22వ తేదీ రాత్రి నిద్రిస్తున్న భార్య సుమలతను చంపాడు భర్త నాగేష్. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భార్యను చంపి రెండో పెళ్లి చేసుకోవాలని నాగేష్ ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిపోయాక సహజ మరణంగా చిత్రీకరించే యత్నం చేశాడు. అల్లుడు ప్రవర్తనపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది సుమలత తల్లి. ఈ మేరకు పోలీసులు నాగేష్?ను అదుపులోకి తీసుకుని తమదైన శైలీలో విచారించారు. పోలీసుల విచారణలో తానే చంపినట్లు ఒప్పుకున్నాడు నాగేష్. ఈ మేరకు నాగేష్?పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత మీదే

మొదటిపేజీ తరువాయి

మీరే చాలా ముఖ్యం. బాధ్యతాయుతమైన పదవుల్లో చేరుతున్నారు. ఉద్యోగవిరమణ రోజు వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలి' అని దిశానిర్దేశర చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న 271 మంది గ్రూప్-1, 171 మంది గ్రూప్-2 అధికారులు, 51 మంది మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# భారతీయ విద్యాభవన్ తరహాలో స్కూళ్లు

మొదటిపేజీ తరువాయి

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా , కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు అందజేయాలని నిర్దేశిరచారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీని వినియోగించాలని దిశానిర్దేశర చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక మండలంలో ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యాయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# సనాతన సాంప్రదాయాల సిరి ధర్మపురి

## ధర్మపురి క్షేత్రంలో ఫిబ్రవరి 27 నుండి మార్చి 11వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు





**(రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్)**

కోరిన కోర్కెలు తీర్చే ధర్మపురి లక్ష్మీ సమేత నారసింహ (యోగ, ఉగ్ర), శ్రీ వేంకటేశ్వర బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 27నుండి మార్చి 11వరకు సాంప్రదాయ రీతిలో జరుగనున్నాయి. సర్వ దేవతా మూర్తులను కలిగి 'ధర్మపురిని దర్శిస్తే యమపురి ఉండదు' అని విఖ్యాతి నందిన ప్రాచీన చరిత్ర, పౌరాణిక ప్రాధాన్యత కలిగిన ధర్మపురి క్షేత్రంలో ఏటా ఫాల్గుణ శుక్ల ఏకాదశి నుండి 13రోజులు వరుసగా స్థానిక దైవాల వార్షిక ఉత్సవాలు సాంప్రదాయ రీతిలో నిర్వహించడం అనాదిగా ఆచరణలో ఉంది.

"భూషణ వికాస శ్రీ ధర్మపుర నివాస దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరుడు శేషప్ప (కాకుస్తం శేషా చలదాసు) రచించిన నరసింహ శతకంలోని పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది... సుప్రసిద్ధ ప్రాచీన ధర్మపురి పుణ్యతీర్థం. అవిభక్త కరీంనగర్ జిల్లా కేంద్రానికి క 71 కిలోమీటర్ల ఉత్తరాన, ప్రస్తుత జగిత్యాల జిల్లా కేంద్రానికి 27 కిలోమీటర్ల ఈశాన్యన, తెలంగాణలోని సుప్రసిద్ధ పుణ్యక్షే త్రంగా, దక్షిణ కాశీగా, నవనారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, పౌరాణిక, ఐతిహాసిక, చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకున్నది క్షేత్ర రాజం. ప్రధానంగా శివకేశవుల నిలయమై, అపురూపమైన బ్రహ్మ, యమ ధర్మరాజు దైవాలతో త్రైమూర్త్య క్షేత్రంగా, శ్రీలక్ష్మీనర సింహ, రామలింగేశ్వర ఆలయాలు, మసీదు అనాదిగా పక్కపక్కనే కలిగి, పలు క్రైస్తవ ప్రార్థనా మందిరాలతో... వైష్ణవ, శైవ ముస్లిం, క్రైస్తవ మత సామరస్యానికి ప్రతీకగా నిలచి ఉన్నదీ గోదావరీ తీరస్త పుణ్యతీర్థం. బ్రహ్మాండ, స్కంధ పురాణాలలో, మడికి సింగన పద్మ పురాణంలో, చెరికొండ ధర్మన్న చిత్ర భారతంలో, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో, ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రలో, నృసింహదాసు మైరావణ చరిత్రలో, పోతనా మాత్యుని నారాయణ శతకంలో, పింగళి సూరనా ర్యుని కళాపూర్ణోద యంలో, శేషాచలదాసు... నరహరి, నృసింహ, నృకేసరి శతకాలలో, కాకతీయా నంతర శాసనాలలో, మధ్యయుగ దాన పత్రాలలో ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం ప్రశంసించ బడింది. పూర్వం ధర్మవర్మ మహారాజు ధర్మదేవత భక్తుడై, ప్రజలను ధర్మ కార్యోన్ముఖులను చేయడానికి చేసిన తపస్సు ఫలితంగా "ధర్మపురి" నామాంకితయై, నృసిం హుడు భక్తుల కోర్కెల తీర్చేందుకై ఇచ్చట వెలసి యున్నాడని, పురాణాలు స్పష్ట పరుస్తు న్నాయి. గౌతమ మహర్షి, తన బ్రహ్మహత్య పాతకాన్ని పోగొట్టు కునేందుకు పరమశివుని గూర్చి తపస్సు చేసి, ఆయన జటాజూటం నందు గల "గంగా దేవి"ని ధర్మపురికి రప్పించినందున "గౌతమి" "గోదావరి" అని నదీ పేర్లు వచ్చినట్లు స్థల పురాణం విశదపరుస్తున్నది. శ్రీరామచంద్ర స్థాపిత రామేశ్వరాలయం, అక్కపెల్లి రాజేశ్వరాలయం, శ్రీరామాలయం, దత్తాత్రేయ, గౌతమేశ్వర, శ్రీసాయి శివ బాలాజీ, అయ్యప్ప, ప్రసన్నాంజనేయ, భక్తాంజనేయ, యమ ధర్మరాజు, సంతోషిమాత, సత్యవతీ, మహాలక్ష్మి మందిరాలు ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. రామాయణ, భారత, భాగవతాది పురాణ ఘట్టాలు చెక్కబడిన నృసింహాల యపు కాకతీయుల శిల్పకళకు అద్దం పట్టే కళ్యాణ మంటపం, శివాలయం లోని గణేష చండిక, సప్తమాతృకలు, నల్లశనపు రాతిపై సమంశ పద్ధతిలో చెక్కబడిన శ్రీరామలక్ష్మణ, సీతాదేవిల విగ్రహాలు మిగుల మనోజ్ఞమై ఉన్నాయి. ధర్మపురి క్షేత్రం మొదట జైన, బౌద్ధ యుగము లందు ఆర్ష విద్య ప్రచార కేంద్రమై, విధర్భ రాజ్య పోషణలో మున్యాశ్రమంగా ఉండేది. తర్వాత శాతవాహన, బాదామి చాళుక్య, రాష్ట్రకూట, కళ్యాణి చాళుక్య, కాకతీయ, రేచర్ల వెలమల మరియు నిజాం రాజుల ఏలుబడిలో అద్వితీయ వైభవాన్ని అనుభవించింది. ప్రతాప రుద్రుని కాలంలో ఢిల్లీని ఏలిన అల్లావుద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ నాయబ్ కాఫూర్ సైన్యం క్రీస్తు శకం 1309లో ఇందూరు (నిజామాబాద్) మీదుగా కాకతీయులపై దండెత్తిన సమయంలో ఇచ్చటి నరసింహ ఆలయం, రామేశ్వరాలయాలను ధ్వంసం చేసినట్లు చరిత్ర చెబుతున్నది. 14వ శతాబ్ది మూడవ పాదంలో నారాయణాశ్రమ స్వామి అనే సన్యాసి, నాటి రామగిరి పాలకుడైన ముప్ప భూపతి సేనాని కేశనమంత్రి సాయంతో నారాయణ పురమను మఠంను స్థాపించి, భాష్మణులకు గృహములను నిర్మింపజేసి, అన్న సత్రాన్ని నెలకొల్పారు. 1724-50 మధ్య ధర్మపురి వాసులు తిరిగి నృసింహాలయాన్ని నిర్మించారు.

### క్షేత్ర ప్రాశస్త్యం

అద్వితీయ మహిమాన్వియైన ధర్మపురి క్షేత్రమున యాత్రికుల సౌకర్యార్థం నివాస స్థానములను కట్టించు వారు భగవత్కటాక్షమున ఉత్తమ భవనముల పొందగలరని, ఇచ్చటి జీర్ణమందిర ములను ఉద్ధరించు వారు వైకుంఠమునందు ఉత్తమ సుఖములను అనుభవించ గలరని, శ్రీనృసింహుని పూజ కొరకు పూల చెట్లను పెంచు వారు నందనాది వనములతో సౌఖ్యములను అనుభవించగ లరని, శ్రీనృసింహు శౌల్యన్నమును, దధ్యన్నమును మరియు పులిహోరను నైవేద్యమిడు వారు అన్నదాతలై భగవత్కటాక్షమునకు పాత్రులగుదురని, నృసింహుని ప్రీతికై క్షేత్రమున బ్రహ్మణులకు భూదానం, గోదానం మరియు హిరణ్యాది దానముల నొసంగువారు ముందు జన్మమున సార్వభౌము లగుదురని, క్షేత్రమున దీనాదులకు, దంపతులకు, బ్రహ్మచారులకు పశు పక్ష్యాదులకు అన్నదాన మొనర్చినచో, నృసింహ కటాక్షమున వారి వారి పితృ దేవతలు మోక్షమును పొంద గలరని, శౌనకాది మహర్షులకు నైమిషారణ్యము నందు సూత పౌరాణికులు వివరించినట్లు స్కంధ పురాణాంతర్గత ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం విశద పరుస్తున్నది.

### నరసింహ అవతార ప్రత్యేకత

రామకృష్ణాది అవతారములవలె గాక , నిర్యాణం లేని శాశ్వత అవతారమైన శ్రీనరసింహుని జయంతి, హిందూ పండగలలో అత్యంత ఆధ్యా త్మిక ప్రాధాన్యత నొందింది. వైశాఖ శుద్ధ చతుర్దశి పుణ్య తిథియందు ఉద్భవించిన నారసింహుని పూజలతో, అకాల మృత్యుభయ ముండదని, దుష్ట గ్రహ బాధలు, పైశాచిక చేతబడుల ప్రయోగాలను తిప్పికొట్టే శక్తి నారసింహ మంత్రానికి గల దని భక్తుల, సాంప్రదాయాచరణాసక్తుల ప్రగాఢ విశ్వాసం. "ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతో ముఖం: నృసింహం భీషణం భద్రం మృత్యుమృత్యుం నమామ్యహం" అనే మంత్రంతో నరసింహ స్వామిని పూజిస్తే శత్రు జయం కలుగుతుంది. పగలు రాత్రి కాని సంధ్యా సమయాన, నరుడు జంతువు కాని రూపంతో, భూమ్యాకాశాలు కాని తొడలపై, సజీవము నిర్జీవ మూ కాని చేతిగోళ్ళతో, హిరణ్య కశిపుని చీల్చి భక్త జన రక్షకుడై, సుదర్శన, శంఖ, చక్ర, ఖడ్గ, అంకుశ, పాశు, పరశు, ముసల, కులిశ, పద్మాదులను కలిగి గదాధరుడై ప్రకాశించిన ఉగ్రనారసింహ అవతార తత్వం మిగతా అమారాలకు భిన్నం..

### 13 రోజుల బ్రహ్మోత్సవాలు

ఈ సంవత్సరం ఫిబ్రవరి 27వతేదీ నుండి మార్చి 11వరకు, ప్రధానంగా ఫిబ్రవరి 28 వ తేదీ గోధూళి సుముహూర్తంలో స్వామి వారల కల్యాణోత్సవం, మార్చి 3,4,5, తేదీలలో వరుసగా... బ్రహ్మ పుష్కరిణీ (కోనేరు)లో సాయంత్రం శ్రీ యోగానంద నరసింహ, శ్రీ ఉగ్ర నరసింహ, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల తెప్పోత్సవం, డోలోత్సవం; 8న సాయంత్రం రథోత్సవం, 9,10,11 తేదీలలో ముప్వురు స్వామి వారల ఏకాంతోత్సవాలు ఘనంగా, సంప్రదాయ రీతిలో జరుగ నున్నాయి. నిత్య ఆరాధనలతో పాటు ప్రత్యేక, పూజాదికాలు నిర్వహించ నున్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశానుసారం, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అధ్యక్షతన, దేవస్థానం ఏసీ, ఈఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తల మార్గదర్శకత్వంలో, ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ, వివిధ ఆలయాల అర్చకులు, సిబ్బంది, కార్యక్రమాల ఏర్పాట్ల నిర్వహణలలో నిమగ్నమై ఉన్నారు.







## బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం... ఏర్పాట్లు సత్వరమే పూర్తి చేయాలి

### - ధర్మపురి బ్రహ్మోత్సవాలపై జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఫిబ్రవరి 26 : ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై పలు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ గురువారం ప్రత్యక్షంగా పరిశీలించారు. గోదావరి నది తీర ప్రాంతాలు లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ ప్రాంగణం, కళ్యాణ మండపం కోనేరు ఇసుక స్తంభం పలు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఏమన్నా మిగిలిన పనులు ఉన్నట్లయితే సత్వరమే పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం, ధర్మపురి లో నిర్వహించనున్న బ్రహ్మోత్సవములు (జాతర)-2026 గురువారం రోజున ధర్మపురి తహసిల్దార్ కార్యాలయంలో అధికారులతో సమన్వయ సమావేశంను జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ... బ్రహ్మోత్సవాల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి శానిటేషన్, ఆరోగ్య శిబిరాలు మరియు అగ్నిమాపక సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, కేటాయించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా, సమన్వయంతో నిర్వహించి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో ఆర్డీవో, డిఆర్డి ఓడిపిఆర్ఓ, ఈఈ ఆర్డబ్ల్యూఎస్, సంబంధిత జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, దేవస్థాన కమిటీ చైర్మన్ మరియు కమిటీ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, దేవస్థాన ఈవో, తహసీల్దార్ లు, ఎంపిడివోలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గోపు కొమరన్న జాతరకు భారీ ఏర్పాట్లు

### - ప్రకృతి సోయగాలతో జాతర ప్రాంతం
### - పక్కనే గోదావరి ఎల్లంపల్లి ప్రాజెక్టు జల అందాలు
### - సీసీ కెమెరాలు వాలంటీర్ల ఏర్పాట్లు
### - అన్ని దారులు మొర్మూర్ జాతర వైపే
### - నేడు నూతన ఆలయం ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఫిబ్రవరి 26 : గలగల పారే గోదావరి ఒడ్డున గల పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మొర్మూర్ శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ అబ్దుల్ కలాం మెయిన్ పంప్ హౌస్ ప్రాంతంలో 60 ఏళ్ల క్రితం సాధారణ యాదవ కులంలో పుట్టి భక్తి శ్రద్ధలతో ఆధ్యాత్మికతను ఆకలింపు చేసుకొని మల్లికార్జున స్వామి దైవసిద్ధిని పొంది యాదవ కుల వంశీయుల మూల పురుషుడిగా మారిన గోపు కొమురయ్య యాదవ్ మల్లికార్జున స్వామి గుడి వెలిసింది... ప్రతి ఏటా కొమురయ్య యాదవ్ మల్లికార్జున స్వామి జాతరగా గ్రూపు వంశీయులు నిర్వహిస్తూ వస్తున్నారు. వాక్‌సిద్ధి గల కొమురయ్య యాదవ్ మల్లికార్జున స్వామి పేరిట దాతల సహకారంతో 70 లక్షల పైగా రూపాయలను ఖర్చుచేసి గత సంవత్సరం నిర్మాణం ప్రారంభించి జాతర కమిటీ నిర్వాహకులు గోపు ఐలయ్య యాదవ్ వంశీయులు పూర్తి చేయడం నూతన దేవాలయాన్ని ఈనెల 27న శుక్రవారం తెల్లవారుజాము నుంచి పచ్చని పాలకొరక పందిళ్లతో మంగళ వాయిద్యాల మధ్య మల్లికార్జున స్వామి భక్తుల సమక్షంలో నిర్వాహకులు గోపు ఐలయ్య యాదవ్ దంపతులతో పాటు వంశీయిలంతా పసుపు కుంకుమల పట్నాలతో బ్రహ్మశ్రీ కాచెలింగన్న శర్మ పురోహితుల బృందం మంత్రోశ్చరణ మధ్య ప్రారంభిస్తారు. 28 శనివారం యజ్ఞశాలలో 81 సంప్రోక్షణలు పంచాంగన్యాది ఉం టాయని నిర్వాహకులు ప్రకటించారు.





మార్చి 1న శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు 2సోమవారం వేలాదిమంది భక్తుల రాకతో కొమరన్న జాతర ప్రాంగణం కిక్కిరిసి ఉంటుంది పూనకం వచ్చిన భక్తుల నృత్యాలు మల్లికార్జున స్వామి శరణు ఘోష పిల్ల పాపలతో తరలివచ్చిన భక్తులు చలువ పందిళ్లు చెట్ల కింద బెల్లం పానకం బోనాలు పోయడం, గోదావరి తీర ప్రాంత పెద్దపల్లి మంచిర్యాల ధర్మపురి సింగరేణి కార్మిక క్షేత్ర పట్టణాల నుంచి జాతరకు భక్తులు తరలి రావడంతో నాలుగు రోజులపాటు గోదావరి నది మొర్మూర్ కొంరన్న జాతర ఆధ్యాత్మిక కేంద్రంగా మారిపోనుంది అగ్నిగుండంలో భక్తులు నడిచే ప్రక్రియ భక్తులను ఉత్కంఠకు గురి చేసే క్షణాలు మరువరానివి మరువలేనివి ఈ ఘట్టాన్ని తిలకించేందుకు జాతరకు వచ్చిన భక్తులు మై మరచి పోవడం ప్రత్యేక విశేషం.

జాతర నిర్వాహకులు గోపు ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ జాతర ప్రాంగణం చుట్టూ పచ్చని చేనుచెలకలు, పంటల పైర్లతో అహ్లాదకరమైన వాతావరణంలో వేలాదిగా తరలివచ్చే భక్తులకు తాగునీరు బోనాలు తీసుకునేందుకు తగిన స్థలాలను కేటాయించామని ఎలాంటి ఇబ్బందులు రాకుండా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో వైద్య సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని, సీసీ కెమెరాలతో ఎవరికి ఎలాంటి నష్టం రాకుండా ఏర్పాటు చేశామని, పోలీస్ రెవెన్యూ అన్ని ప్రభుత్వ శాఖల సహాయ సహకారాలను కోరామని, భక్తులు జాతర ప్రాంతానికి చేరేందుకు గోదావరిఖని ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను రాకపోకలు సాగించేందుకు ఏర్పాట్లు చేశామని, భక్తజనం కోసం రెండు రోజులపాటు అన్నప్రసాదాలను అందించనున్నామని నూతన దేవాలయ ప్రారంభంతోపాటు జాతరకు గత జాతర్ల కంటే భారీగా భక్తజనం హాజరవుతున్నారని ఆశిస్తున్నామని ఎలాంటి లోటుపాట్లు లేకుండా తమ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసిందని అన్నారు.

## గుడిపాడు శ్రీ మోక్ష వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఘనంగా ప్రతిష్ట మహోత్సవ పూజలు

### - పాల్గొన్న రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)





పాల్వంచ, ఫిబ్రవరి 26 : భద్రాద్రి జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ పరిధిలోని గుడిపాడు గ్రామంలో శ్రీ మోక్ష వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం పూజారి సింహాద్రి కందాల ఆనందకు మారాచార్యులు, శ్యామల గోపాలన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ చైర్మన్ సురేష్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, గోదాదేవి సమేత శ్రీ మోక్ష వేంకటేశ్వర స్వామి, గరుడాళ్వార్, విశ్వక్సేన, వకుళాదేవి, జీవధ్వజ (ధ్వజ స్థంభం), ఆలయ శిఖర యంత్ర, ద్వారపాలక, పూర్వక రాజతయంత్ర ప్రతిష్ట మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్నసమారాధనను ప్రారం భించారు. ఈ కార్యక్రమాల్లో 9వ డివిజన్ కార్పొరేటర్ చరపా శాంత, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోండం వెంకన్న గౌడ్, డాక్టర్ యుగంధర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు జమ్ముల సీతారాంరెడ్డి, మిరియాల కమలాకర్, చింతా నాగరాజు, సందుపట్ల శ్రీనివాస రెడ్డి, యమ్మన మల్లిఖార్జున్, చరపా పాపారావు, రేనాటి శ్రీనివాసరావు, సున్నం రాజులు, పావని, తదితరులు పాల్గొన్నారు.



## పాల్వంచలో శ్రీనివాస గిరి శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భూమి పూజ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఫిబ్రవరి 26 : భద్రాద్రి జిల్లా పాల్వంచలోని శ్రీనివాసగిరి (గుట్ట)పై మార్చి 14వ తేదీనుండి జరగబోవు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం పాదాల మండపం వద్ద భూమి పూజ జరిగింది. ఆలయ ప్రధాన ఆలయ అర్చకులు తోలేటి నగేష్ శర్మ, అర్చకులు ఆరుట్ల ఫని రాజాచార్యుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించి పందిరి గుంజ పాతడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాసగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా ట్రస్ట్ చైర్మన్ కొత్త వెంకటేశ్వర్లు, అధ్యక్షులు డాక్టర్ బిక్కసాని సుధాకర్, ప్రధాన కార్యదర్శి ఆరుట్ల లక్ష్మణాచారి, భక్త సమాజ మండలి అధ్యక్ష కార్యదర్శులు ఊకే భద్రయ్య, తాటికొండ శ్రీలత, గౌరవ అధ్యక్షులు పసుమర్తి వెంకటేశ్వర్లు, సేవాదళ్ అధ్యక్ష కార్యదర్శులు కొండ్రు శివ, పరిశిక కిరణ్, మహిళా సంఘం అధ్యక్ష కార్యదర్శులు నిడమనేని అనూష, రేనాటి స్రవంతి, భక్త సమాజ మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com